ఈనాడు జగిత్యాల

సోమవారం 14 ఆగస్టు 2017 16 పేజీలు

వరి.. పురస్కార సిరి

- ధాన్యం కొనుగోళ్లలో జిల్లా ప్రథమ స్థానం
- జిల్లా కలెక్టర్‌కు ఉత్తమ అవార్డు



జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. జిల్లాలో రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినందుకు అవార్డు ప్రదానం చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌గా గత పదినెలల కాలంలో అనేక మార్పులు సాధించారు. జిల్లాలో 321 గ్రామ పంచాయతీలుండగా గత రబీ సీజన్‌లో 317 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు జరిపారు. జిల్లా కలెక్టర్ సహా మెట్‌పల్లి సబ్ కలెక్టర్ ముషారఫ్ అలీ, జగిత్యాల ఆర్డీవో నరేందర్, తహసీల్దార్లు కిందిస్థాయి అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు కొనుగోళ్ల కేంద్రాలు సందర్శిస్తూ కేవలం 35 రోజుల్లో 39.35 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలో మిల్లులు లేకున్నా ఇతర జిల్లాలకు తరలించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటదివెంట రూ.594.21 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇదే కాకుండా గతేడాది జిల్లాను పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపారు. గత నవంబర్ నెల నుంచే ఫలితాలపై దృష్టితో అన్ని పాఠశాలలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం విద్యార్థులకు 'ఉత్తేజం' పేరుతో రూ.10 లక్షల ఖర్చుతో సాయంత్రం అల్పాహారం అందజేశారు. ఫలితంగా జిల్లాలో 14124 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13750 మంది ఉత్తీర్ణులు కాగా 97.35 శాతంతో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలిచింది.

భూ సమస్యలపైనా ప్రత్యేక దృష్టి

భూసమస్యల పరిష్కరించేందుకు కలెక్టర్ శరత్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను మిగతా2లో..

తాగేది గరళమే

- శుద్ధి చేయకుండానే సరఫరా
- మిషన్ భగీరథ నీళ్లు వచ్చే వరకు అంతేనట!



మల్యాల శివారులో కొండగట్టుపైకి నిర్మించిన తాగునీటి పథకం ఫిల్టరు బెడ్‌లో పెరిగిన నాచు



జలం ప్రాణాధారం.. శుద్ధి చేసి తాగితే ప్రాణాలు నిలుస్తాయి.. కలుషితమైతే ప్రాణాలు పోతాయ్.. ఇంతటి ప్రాధాన్యమున్న తాగునీటి శుద్ధిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోట్ల వెచ్చించి నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసినా నిర్వహణ మరిచారు. కలుషిత నీటినే సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. నీటిని శుద్ధి చేస్తున్న ప్లాంటులో ఇసుక మార్చకపోవడంతో ఏళ్ల తరబడి శుద్ధి చేయని జలమే అందుతోంది. మిషన్ భగీరథ పథకం వస్తుందనే సాకుతో అధికారులు ఉన్న పథకాలను గాలికొదిలేశారు. జగిత్యాల జిల్లాలో తాగునీటి పథకాలపై 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం.

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం, ధర్మపురి, మెట్‌పల్లి, మల్యాల

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పురపాలక సంఘాల పరిధిలోని ప్రాంతాలకు ఫిల్టర్‌బెడ్ పథకాల నుంచి తాగునీరు అందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో జగిత్యాల మండలం పొలాస, ధర్మపురి మండలం నాగారం వద్ద, మల్యాలలో కొంపెల్లి చెరువు నుంచి, రాయికల్‌లో, బీర్‌పూర్‌లో శుద్ధజల పథకాలున్నాయి. జగిత్యాల పట్టణానికి తాగునీరు అందించే ధర్మసముద్రం రిజర్వాయర్ పథకంలో నీటిని శుద్ధి చేసే చోట 1993లో ఇసుకను మార్చగా ఇప్పటి వరకు మళ్లీ ఇసుక ముట్టుకోలేదు. సరిగా శుద్ధికాని నీరే సరఫరా అవుతోంది. పొలాస పథకం దాదాపు మూత పడింది. అసలే వర్షకాలం కావడం సీజనల్ వ్యాధులకు తోడు మురుగునీరు కారణంగా మరింత మంది వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ కల్ల మిషన్‌భగీరథ పథకం అందుబాటులోకి వస్తుందనే భావనతో మున్సిపల్ అధికారులు, ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పథకాలను గాలికొదిలేశారు. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ తాగునీటి పథకాల ఉన్నప్పటికీ చాలా మంది కుటుంబాలు శుద్ధ జలాలను క్యాన్ల ద్వారా కొనుగోలు చేసి తాగుతున్నారు. దాదాపు ప్రతి నెల జిల్లాలో రూ.1.50 కోట్ల నుంచి రూ. 2 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నట్లు అంచనా.. ఇదీలా ఉంటే నిరుపేదలు మాత్రం వచ్చే కొళాయి నుంచి వచ్చే కలుషి నీటితే తాగుతూ రోగాల బారిన పడుతున్నారు.

నిర్వహణ అధ్వానం

మల్యాల మండలంలోని 15గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించడానికి నిర్మించిన సమగ్ర రక్షిత తాగునీటి పథకం నిర్వహణ సరిగాలేక ఆయా గ్రామాలకు కలుషిత నీరే దిక్కుగా మారింది. సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్వహణకు ఏటా రూ.50లక్షలకుపైగా వెచ్చిస్తున్నా కలుషిత నీటి సరఫరా జరుగుతోంది. తరచూ పైపులు పగిలిపోవడం, మోటార్లు కాలిపోవడంవల్ల ఏడాదిలో సగం రోజులు కూడా రక్షిత నీటి సరఫరా జరగడంలేదని మండలవాసులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు మాత్రం చర్యలు మిగతా2లో..



జగిత్యాల పట్టణానికి సరఫరా అవుతున్న తాగు నీరు ఇదే

భూమి లెక్కలు పక్కాగా?

- ప్రతి భూమికి ప్రత్యేక సంఖ్య
- దస్త్రాల ప్రక్షాళనకు ప్రభుత్వం సన్నాహాలు



సర్వే చేస్తున్న అధికారులు

"గతంలో ఒక సర్వే నంబరులో ఒకరికి మించి వ్యక్తులు ఉండటం, కుటుంబ సభ్యులు వాటాల మేరకు పంచుకోవడం, క్రయవిక్రయాల ద్వారా చేతులు మారటం తదితర కారణాల వల్ల సదరు సర్వే నంబరు పక్కన తెలుగు, ఆంగ్ల అక్షరాలను చేర్చి అదే సర్వే నంబరును రికార్డుల్లో కొనసాగించేవారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇక ఈ విధానానికి తెరపడనుంది. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేయడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక నంబరు కేటాయించనున్నారు. దస్త్రాల శుద్ధీకరణతో పాటు, సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి సమూలంగా సర్వే చేపట్టి రికార్డుల మేరకు సబ్‌డివిజన్ చేయడంతో పాటు, సంబంధిత భూ యజమానుల భూములకు ప్రత్యేక నంబరు, సర్వే పటాలను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిజాం కాలం నాటి ఫసలీ, ఇస్వీలో భాగంగా రూపొందించిన సేత్వారు, తరువాత ఖాస్రా తదితర సర్వేశాఖ రికార్డుల ఆధారంగా ఇప్పటి వరకు సర్వే నంబర్లుండగా, తాజా సంస్కరణలతో భూములకు ప్రత్యేక నంబర్లు కేటాయించే విధానం రానుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే

జిల్లాలోని సర్వే నంబర్లు	1,57,479
మొత్తం భూములు	7,19,781.10 ఎకరాలు
పట్టాదారులు	2,55,190
ప్రభుత్వ భూములు	1,18,422.17 ఎకరాలు

సర్వే నంబరులోని దరఖాస్తుల మేరకు సబ్‌డివిజన్ చేయడం నేడు ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు తహసీల్దార్ వ్యవస్థలోని పట్వారీ, కరణాల వ్యవస్థ రద్దు కావడంతో అజమాయిషీ కొరవడి భూమి రికార్డుల నిర్వహణ మరింత లోపభూయిష్టంగా మారడం, క్రయవిక్రయాలు పెరగడంతో సమస్య పరిష్కారం రెవెన్యూ కార్యాలయాలకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలో రికార్డుల సవరణ ప్రక్రియ దాదాపుగా పూర్తవుతుండగా, దీని ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలంటే జిల్లాను రీసర్వే చేయడం మినహా మరో మార్గం లేదని సర్వేశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇప్పటి వరకు ఒక సర్వే నంబరును కొలిచేందుకే అవకాశం

సర్వే శాఖ నిబంధనల ప్రకారం ఒక సర్వే నంబరును మాత్రం కొలిచి ఆ మేరకు హద్దులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. సాధారణంగా ఒక సర్వే నంబరులో ఒక్కరికి మించి వ్యక్తులు భూమి కలిగి ఉన్న సర్వే నంబర్లు 99 శాతం వరకున్నాయి. సర్వే నంబరులోని భూమిని ఇద్దరు లేదా అంతకు మించి వ్యక్తులు భూమిని కలిగి ఉన్నపుడు సర్వే నంబరుతో పాటు పక్కనే అ, ఆ, ఇ, ఈ ఇలా అక్షరాలను చేర్చి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేస్తారు. అయితే సర్వే నంబరులోని భూమి విషయంలో లావాదేవీలు జరిగినపుడు ఆ మేరకు సర్వే చేపట్టి సబ్‌డివిజన్ ఆధారంగా హద్దులు ఏర్పాటు చేసుకోవడం కష్టసాధ్యంగా మారుతోంది.

వివాదాలు తలెత్తితే సబ్‌డివిజన్ సర్వే హుళక్కే!

ఒక సర్వే నంబరులో ఎక్కువ మంది భూమి కలిగి ఉన్నపుడు సదరు సర్వే నంబరులోని ఎవరైనా వ్యక్తి తన భూమిని ఇతరులకు మిగతా2లో..

తాగేది గరళమే

(మొదటి పేజీ తరువాయి) తీసుకోవడంలేదు. ప్రతి ఏటా ఫిల్టరు బెడ్‌లో ఇసుకను (సాండ్ మీడియా) మార్చాల్సివున్నప్పటికీ మూడేళ్లుగా మార్చకపోవడంతో బురద, పచ్చని రంగుల్లో నీటి సరఫరా జరుగుతోంది. ఫిల్టరు బెడ్స్‌లో నీరు వడపోత జరగకపోవడంతోపాటు క్లోరినేషన్ కూడా సక్రమంగా జరగడంలేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.

కొండగట్టుపైకి నిర్మించిన పథకం అంతే!

కొండగట్టు ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రానికి రక్షిత నీటి సరఫరా చేయడానికి రెండేళ్ల క్రితం సమగ్ర రక్షిత తాగునీటి పథకం పక్కనే రూ.2.15కోట్లతో నిర్మించిన మరో పథకం కూడా పూర్తిగా విఫలమైంది. ఈ పథకం నిర్మాణంలో భాగంగా వేసిన పైపులు నాసిరకంగా ఉండటంతో నిత్యం పలుచోట్ల పగులుతుండటంతో కొండగట్టుపైకి నీటి సరఫరా జరగడంలేదు. కేవలం హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా రెండు రోజులు మాత్రమే కొత్త కోనేరులోకి నీటిని సరఫరా చేసి తర్వాత పథకాన్ని పట్టించుకోకపోవడంతో ఈ పథకానికి సంబంధించిన ఫిల్టరుబెడ్స్‌లో విపరీతంగా నాచు పెరిగింది. పథకం విఫలం కావడంతో దీనిని స్వాధీనం చేసుకోవడానికి ఆలయ అధికారులు కూడా తిరస్కరించారు. ఈ రెండు పథకాలను అధికారులు, గుత్తేదారు సక్రమంగా నిర్వహిస్తే మండలంలోని 17గ్రామాల ప్రజలకు, కొండగట్టు ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రానికి నీటి సరఫరా జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

శుద్ధజల పథకాలపై చిత్త శుద్ధి ఏది?

ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, ధర్మారం, వెల్గటూర్, గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం మండలాలోల మొత్తం 129 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 110 తాగునీటి పథకాలు ఉన్నాయి. వీటిలో ధర్మపురితో పాటు మరో ఆరు గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేసే బీర్‌పూర్ బృహత్తర నీటి పథకం మాత్రమే ఉంది. కేవలం కాగితాల్లోనే మాత్రమే శుద్ధి చేస్తున్నట్లు రాసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది కనీసం అటువైపు చూడటం లేదు. పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంటోంది. ఈ నీటి పథకాలన్నీ గ్రామం బయటనే ఉన్నాయి. వీటిలోకి వర్షాకాలంలో కలుషిత నీరు వచ్చి చేరుతోంది. ప్రధానంగా ఈ నీటి పథకాల బావులు, నీటి ట్యాంకులను కనీసం నెలకోమారు తప్పనిసరిగా శుభ్రం చేయాలి. కాని వర్షాకాలంలో ఏ మాత్రం చేయడం లేదు. సీఆర్ గ్రాంటు కింద మండలానికి పది నీటి పథకాలకు చెందిన తాగునీటి బావులలో పూడికతీతకు నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది. రెండేళ్లకోమారు ఈ నిధులు మంజూరవుతున్నాయి. మొక్కుబడిగానే ఈ పనులను కానిస్తున్నారు. ఒక్కొక్క తాగు నీటి బావికి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు. అయినా ఏమాత్రం ఉపయోగకరంగా ఉండటం లేదు. వర్షాకాలం వచ్చిందంటేనే తాగునీటి పథకాలను వెంటనే బ్లీచింగు పౌడర్‌తో కడిగించి శుభ్రం చేయించాలి. దీనిపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు.


ధర్మపురికి సరఫరా నీటిని సరఫరా చేసే బీర్‌పూర్ తాగునీటి శుద్ధ జల పథకం నిర్వహణ అధ్వాన్నం

* బీర్‌పూర్ బృహత్తర నీటి పథకంలో నీటిని శుద్ధి చేసేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా ఇసుకను నీటి ఫిల్టర్‌ల నుంచి తీసేసి నూతనంగా ఇసుకను పోయాల్సి ఉంటుంది. దీనితోనే నీటి పథకాలకు చెందిన ఫిల్టర్లు బాగా పని చేసి శుభ్రమైన నీటిని అందిస్తాయి. చాలా రోజులుగా ఈ బృహత్తర పథకంలోని నాలుగు ఫిల్టర్లలోని ఇసుకను మార్చడం లేదు. పథకం వచ్చే నీటిని తాగలేకపోతున్నామని ధర్మపురితో పాటు దోనూర్, నక్కలపేట, దమ్మన్నపేట, రాజారం గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

రక్షిత మంచినీళ్లు అందని ద్రాక్ష

కోరుట్ల: ద్వితీయశ్రేణి పురపాలక సంఘమైన కోరుట్ల పట్టణ ప్రజలకు పాలమాకుల చెరువు, తాళ్ల చెరువుద్వారా నీరును సంగెం సమీపంలోని పంపుహౌజ్‌కు పంపించి నిల్వచేస్తున్నారు. అక్కడి నుంచి పట్టణంలోని రెండు రక్షిత మంచినీటి ట్యాంకల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో 66,293 జనాభా ఉండగా 20,289 కుటుంబాలు, 5వేలకు పైగా నల్లాలు ఉన్నాయి. రిజర్వాయర్, శుద్ధజల కేంద్రం కోసం ఏడేళ్ల క్రితం రూ.28 కోట్ల హడ్కో నిధులు మంజూరయ్యాయి. ఎట్టకేలకు ఏడాది క్రితం నిర్మాణం పనులు పూర్తయ్యాయి. పురపాలక సంఘానికి శుద్ధజల కేంద్రం అప్పగించడంలో ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యంగా ఉండటంతో పట్టణ ప్రజలకు శుద్ధజలం అందడం లేదు.


మెట్‌పల్లిలో ఉత్సవ విగ్రహంలా ఉన్న నీటి శుద్ధ జల పథకం

మెట్‌పల్లి: డివిజన్ కేంద్రమైన మెట్‌పల్లి పట్టణ ప్రజలకు శుద్ధ జలం అందించడానికి 2004లో రూ.కోటి వ్యయంతో పట్టణ శివారులోని పెద్ద చెరువు సమీపంలో శుద్ధజల కేంద్రం నిర్మించారు. పూర్తిస్థాయిలో జలాన్ని శుద్ధిచేసే విధంగా నిర్మాణం చేపట్టకపోవడంతో శుద్ధి జరగక అపరిశుభ్ర నీరు సరఫరా కావడంతో ప్రజలు నిరసనలతో నీటి సరఫరాను నిలిపివేశారు. ఏడేళ్లుగా మూలనపడి ఉత్సవ విగ్రహంలా మిగిలిపోయింది. అధిక శాతం పట్టణ ప్రజలకు బోరు నీరే దిక్కవుతోంది. ప్రస్తుతం పట్టణం ప్రజలకు ఆరపేట వాగులోని రెండు బావులు, శుద్ధజల కేంద్రం సమీపంలోని మూడు పవర్ బోర్లు, ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని పవర్ బోర్ ద్వారా పట్టణంలో అయిదు రక్షిత మంచినీటి ట్యాంక్‌లకు నీరు పంపించి అక్కడి నుంచి 3961 నల్లాల ద్వారా ప్రజలకు తాగు నీరందిస్తున్నారు. పట్టణ జనాభా 50,609 కాగా 12,056 కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తయ్యాకే రెండు పట్టణాల ప్రజలకు శుద్ధ జలం అందిస్తామని పుర అధికారులు పేర్కొంటున్నారు.

మిషన్ భగీరథ వచ్చే వరకు శుద్ధిచేయడం కుదరదు

-రాంచందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

ఈ డిసెంబర్ వరకు జిల్లాలో మిషన్ భగీరథ పథకం అందుబాటులోకి వస్తున్నందున ఇసుక మార్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు నిలిపేశారు. ప్రస్తుతం ఫిల్టర్‌బెడ్ పథకాల్లో ఇసుకను మార్చలేక పోతున్నాం. గ్రామ పంచాయతీల పరిధిలో మాత్రం క్లోరినేషన్ చేసి పంపుతున్నాం. త్వరలోనే మిషన్ భగీరథ పథకం అందుబాటులోకి వస్తే ప్రతి కుటుంబానికి స్వచ్ఛనీరు అందనుంది.

ఖేలో భారత్ కబడ్డీ విజేత మేడిపల్లి

జగిత్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల ఆవరణలో భాజయుమో ఆధ్వర్యంలో పండిత దీన్‌దయాళ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన క్రీడా పోటీల్లో కబడ్డీ విభాగంలో తుది విజేతగా మేడిపల్లి జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన తుది పోరులో మేడిపల్లి జట్టు కాచారం జట్టుపై గెలిచి మొదటి స్థానం సాధించింది. అనంతరం భాజపా, భాజయుమో అధ్యక్షులు బాజోజి భాస్కర్, ఈర్తీ మధుకర్ తదితరులు బహుమతులు అందించి విజేతలను అభినందించారు. జిల్లా స్థాయిలో గెలిచిన జట్లను రాష్ట్ర పోటీలకు పంపిస్తామని ఈర్తి మధుకర్ చెప్పారు. కార్యక్రమంలో భాజపా, భాజయుమో నాయకులు దశరథ్‌రెడ్డి, కొక్కు గంగాధర్, జ్ఞానేశ్వర్, రాపర్తి రాజు, బైరి రాజేందర్, మల్లిఖార్జున్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

15న దుబ్బరాజన్నలో గోపాల కాలువలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ మండలం పెంబట్ల, కోనాపూర్‌లోని దుబ్బరాజన్న సన్నిధిలో ఈనెల 15న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోపాల కాలువలు నిర్వహిస్తున్నట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సన్నిధిలో యువకులతో ఉట్టికొట్టే కార్యక్రమం, అనంతరం అన్నదానం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శ్రావణ మాసంలో చివరి సోమవారం అవుతున్నందున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశమున్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 21న చివరి శ్రావణ మాస సోమవారం అయినప్పటికీ అమావాస్య వస్తున్నందున ఈనెల 14న వచ్చే సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

బీసీ విదేశీ విద్యకు ఈనెల 15నుంచి దరఖాస్తులు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకంకింద 2017-18 విద్యాసంవత్సరానికిగాను అర్హులైన బీసీ విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 15నుంచి సెప్టెంబరు 30 వరకు ఈ-పాస్ వెబ్‌సైట్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని టీబీసీ ఐకాస అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ప్రకటించారన్నారు. అభ్యర్థులు 30 ఏళ్లలోపు వయసు కలిగిఉండి, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలు, పట్టణాల్లో రూ. 1.5 లక్షలు ఉండాలని, డిగ్రీలో 60 శాతానికిపైగా మార్కులు సాధించినవారు అర్హులని వివరించారు.

వరి.. పురస్కార సిరి

(మొదటి పేజీ తరువాయి) క్రమబద్ధీరించాలని ప్రభుత్వం నిర్ణయించగా అందులో భాగంగా జిల్లాలో 67,256 దరఖాస్తులు రాగా 50641 దరఖాస్తులను పరిష్కరించారు. సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారంలోనూ జిల్లా 72 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. భూ వివాదాల పరిష్కారం కోసం కలెక్టర్ జిల్లాలో జమీన్‌బందీ కార్యక్రమం చేపట్టి మండలాల్లో సదస్సులు నిర్వహించి 19,478 సమస్యలను పరిష్కరించారు. దీనికితోడు రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కింద అధికారులు రైతుల ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు దాదాపు 5 లక్షల పొరపాట్లను సవరించారు. ఇవేకాకుండా జిల్లాలోని ఆస్పత్రులకు 'చికిత్స' చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెంచారు. గత సీజన్‌లో మామిడి మార్కెట్‌పై నిఘా ఉంచి సబ్ కలెక్టర్ ముషారఫ్‌అలీకి బాధ్యతలు అప్పగించి అనేక మార్పులు తెచ్చారు. జగిత్యాల మామిడికి రాష్ట్ర, దిల్లీస్థాయిలో గుర్తింపు తేవడమే కాకుండా 'జీరో' వ్యాపారాన్ని నియంత్రించి మార్కెట్ ఆదాయం రూ. 48 లక్షలకు పెరిగే విధంగా చేశారు. బహిరంగ మలవిసర్జన రహిత జిల్లా మార్చేందుకు ఉద్యమమే చేపట్టారు. జిల్లావ్యాప్తంగా వందరోజుల్లో 60 వేల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచారు. రెండు పడకల గదుల నిర్మాణం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, గొర్రెల పంపిణీ తదితర అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో వేగం పెంచేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతుండటంతో జిల్లా అన్నింటా ముందంజలో ఉంటోంది.

భూమి లెక్కలు పక్కాగా?

(మొదటి పేజీ తరువాయి) విక్రయించడం లేదా తన వాటాను పంచుకున్న సందర్భాల్లో సర్వే నిబంధనలు అనుకూలించకపోవడంతో హద్దులు ఏర్పాటు చేసుకోవడం కుదరని పని. ఎందుకంటే సర్వే శాఖ నిబంధనల ప్రకారం ఒక సర్వే నంబరుకు సంబంధించిన హద్దులను మాత్రమే నిర్ణయించేందుకు వీలవుతుంది. సర్వే నంబరులోని కొంత భాగం భూమిని కొలిచి హద్దులు ఏర్పాటు చేయాలంటే ఆ సర్వే నంబరులో భూమి కలిగి ఉన్న ఇతర వ్యక్తులు సైతం రాత పూర్వకంగా అంగీకరించినపుడు మాత్రమే మొత్తం సర్వే నంబరులోని అన్ని భాగాల కొలతలు తీసి రికార్డు ప్రకారం హద్దులు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. వీరిలో ఒక్క వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేసినా న్యాయస్థానం ఆశ్రయించాల్సి వస్తోంది. న్యాయస్థానంలో దరఖాస్తు చేసుకున్న తర్వాత కమిషన్‌ను ఏర్పాటు చేశాక, వారి సమక్షంలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇదంతా జరగాలంటే కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది.

ఎంజాయ్‌మెంట్ సర్వేతో చిక్కులే!

ఒక సర్వే నంబరులోని వ్యక్తులు దరఖాస్తుకుంటే కొన్ని సందర్భాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తారు. ఇందులో భాగంగా సదరు సర్వే నంబరులో ఎంత మంది వ్యక్తులు ఎంత భూభాగంలో మోకా మీద కబ్జాలో ఉన్నారనే విషయం సర్వే ద్వారా నిర్ధారించి నివేదిక సమర్పిస్తారు. అయితే చాలా సందర్భాల్లో రికార్డుల్లో ఉన్న భూమి కంటే ఎక్కువ సంబంధిత వ్యక్తులు కబ్జాలో ఉండటంతో ఎంజాయ్‌మెంట్ సర్వే చేసినా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో మొత్తం సర్వే నంబరును సర్వే చేయడం మిన్నహా మరో గత్యంతరం లేకపోవడంతో చాలా దరఖాస్తులు భూవివాదాలుగా మిగిలిపోతున్నాయి.

అభివృద్ధి చెందినా గొలుసులే దిక్కు!

జీపీఎస్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ నేటికీ చాలా వరకు గొలుసులతో కొలిచి సర్వే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సర్వే అధికారులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుండగా, కచ్చితత్వం లోపిస్తోంది. దీనికి తోడు గొలుసులతో కొలిచేందుకు సాయపడే సహాయకుల వయోభారం వేధిస్తుండటంతో, ప్రయివేటు వ్యక్తులను నియమించుకున్న సందర్భాల్లో దరఖాస్తుదారులకు అదనపు వ్యయప్రయాసలు తప్పడం లేదు. దీనికి తోడు పంట పొలాలు, చెట్లు, ఒర్రెలు తదితర ప్రాంతాలలో గొలుసులతో భూమిని కొలిచేందుకు ఆపసోపాలు పడాల్సి రావడం మరో సమస్యగా మారుతోంది.

నెలకు సగటున 1000 దరఖాస్తులు

జిల్లాలో 3 పట్టణాలు, 18 మండలాలు ఉండగా, ఒక్కో మండలం నుంచి సర్వే కోసం 50 వరకు దరఖాస్తులు వస్తుండగా, నెలకు సగటున జిల్లా నుంచి 1000 వరకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక్కో దరఖాస్తుకు రూ. 300 వరకు వెచ్చించాల్సి వస్తుండగా, ఒక దరఖాస్తును 45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ సర్వేయర్ల కొరతతో ప్రయివేటు సర్వేయర్లను, గొలుసులతో కొలిచేందుకు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి రావడంతో కొన్ని సందర్భాల్లో సర్వే జరపడంలో జాప్యం చోటు చేసుకుంటోంది.

రీసర్వేతోనే సబ్‌డివిజన్ సాధ్యం!

ఆధునిక పరికరాలతో జిల్లా మొత్తం రీసర్వే చేసినపుడే రికార్డుల ప్రకారం సబ్‌డివిజన్ చేయడం, సర్వే మ్యాప్ రూపొందించి సంబంధిత రైతులు, వ్యక్తులు అందించేందుకు వీలవుతుందని సర్వే వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా మొత్తం యూనిట్‌గా రీసర్వే చేయకుండా ప్రస్తుతం సర్వేశాఖలో ఉన్న అధికారులు, సిబ్బంది, పరికరాలతో సబ్‌డివిజన్ చేయాలంటే ఏళ్ల సమయం పడుతుందని సంబంధిత సర్వే అధికారులు చెబుతున్నారు. దీంతో శుద్ధీకరణ జరిగిన రికార్డుల మేరకు ధ్రువీకరణ పత్రాలు అందచేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టకుంటే మ్యాప్ అందించేందుకు వీలు పడని పరిస్థితి తలెత్తనుంది. ఈ క్రమంలో జిల్లాను యూనిట్‌గా ప్రతి సర్వే నంబరులోని సబ్‌డివిజన్ల సంఖ్య ప్రకారం రీసర్వే చేసి మ్యాపులు, వివరాలను నమోదు చేసుకొని ఆ మేరకు సప్లిమెంటరీ సేత్వార్ రూపొందిస్తారు. దీంతో సర్వే నంబరులోని సబ్‌డివిజన్లను సర్వే చేసి దరఖాస్తుదారులకు వారి భూమికి సంబంధించిన పటాలను కచ్చితత్వంతో అందించేందుకు వీలవుతుంది. ఈ లెక్కన జిల్లా యూనిట్‌గా రీసర్వే చేయాలంటే కనీసం నాలుగు డీజీపీఎస్ (డిఫ్రెన్షియల్ గ్లోబల్ పోజిషనింగ్ సిస్టం) పరికరాలు, డిప్యూటీ సర్వే అధికారులు, సర్వేయర్లు, సహాయకులతో మూడు నాలుగు బృందాలను ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరిగా మారింది.

మూడు శాఖల సమన్వయం తప్పనిసరి

గతంలో 2006లో భూభారతి పథకం కింద నిజామాబాద్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని చేపట్టిన సర్వే విజయవంతం కాలేదు. ప్రయివేటు ఏజెన్సీ ప్రధాన పాత్ర పోషించడం, లెక్కకు మిక్కిలి అభ్యంతరాలు రావడం వైఫల్యానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ప్రస్తుతం ప్రభుత్వం సర్వే ఆఫ్ ఇండియా సాయంతో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రక్షాళన చేయాలని సంకల్పించడం సత్ఫలితాలను ఇస్తుందనే అభిప్రాయం నెలకొంది. రికార్డుల శుద్ధీకరణలో కీలకమైన రెవెన్యూ, ఇప్పటి వరకు పట్టు ఉన్న రాష్ట్ర సర్వేశాఖతో కలిసి సర్వే ఆఫ్ ఇండియా సమన్వయంతో పనిచేస్తేనే పూర్తిస్థాయి ఫలాలు అందే అవకాశం ఉంది. సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి చేపట్టనున్న సర్వే తదితర చర్యలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది.

తెరపై ఈనాడు



జగిత్యాల

బాలాజీ- ఫిదా
నటరాజ్ - జయ జానకి నాయకా
దుర్గరాజ - నక్షత్రం
శ్రీనివాస - లై
శ్రీరామా- నేనే రాజు నేనే మంత్రి

మెట్‌పల్లి

లక్ష్మి- జయ జానకి నాయకా
సాయికృష్ణ- నేనే రాజు నేనే మంత్రి

కోరుట్ల

లక్ష్మి- లై
కిన్నెర- నేనే రాజు నేనే మంత్రి

గోదావరి తీరం..

ఇసుక దోపిడీ రాజ్యం

● జోరుగా అక్రమ రవాణా ● నియంత్రణ కరవు
● అతివేగంతో వాహనాలు.. ప్రమాదాలకు ఆనవాళ్లు


ధర్మపురి వద్ద గోదావరిలో ఉదయమే ఇలా ఇసుక ట్రాక్టర్లు

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం, ధర్మపురి, రాయికల్, మల్లాపూర్ :

చుట్టూ గోదావరి తీరం.. పచ్చని అడవుల నిలయం.. ప్రకృతి రమణీయతకు కేంద్రం.. వ్యవసాయాధారితం.. ఇలా చెబుతూ పోతుంటే జిల్లాలో ఆకట్టుకునే అంశాలు ఎన్నో.. కానీ సహజ వనరుల దోపిడీ కరవుకు బాటలు వేస్తోంది. గోదావరి తీరాన్ని ఇష్టారాజ్యంగా తోడేస్తూ భూగర్భ జల వనరులు లేకుండా చేస్తున్నారు. చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. అనుమతి లేకుండానే రవాణా సాగుతుండగా ట్రాక్టర్లు, లారీల అతివేగంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుక రవాణాకు సాగిస్తున్నారు. జిల్లాలో ఇసుక దందాపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇసుక కేంద్రం ధరూర్ క్యాంపులో ఒకటి ఉండగా, కోరుట్లలో మరొకటి ఉంది. ఈ రెండు ఇసుక నిల్వ కేంద్రాలతోపాటు కరీంనగర్ జిల్లాలో ఖాజీపూర్, కొత్తపల్లి ఇసుక క్వారీలు ఉండగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొదుముంజ, కొదురుపాకలో క్వారీలు ఉన్నాయి. ప్రస్తుతం కొదురుపాక క్వారీ మూతపడగా కొదుముంజ నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా అవుతోంది. ఇక్కడి నుంచి ఒక్కో లారీ రూ.6400లకు ఇసుక నింపుతుండగా ఆ ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి తెచ్చిన ఇసుకను రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు పట్టణాల్లో విక్రయిస్తున్నారు. ఒక వేబిల్లుతో అనుమతి పొంది.. ఇచ్చిన గడువులో రెండు, ట్రిప్పులను జార వేస్తున్నారు.

గోదావరి పరివాహక ప్రాంతం ధర్మపురి, వెల్గటూర్, సారంగపూర్, రాయికల్, మల్లాపూర్ నుంచి ప్రతి రోజు వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. ట్రాక్టర్లతో తెచ్చిన ఇసుకను పట్టణ ప్రాంతంలో రూ.3500 నుంచి రూ. 4వేల వరకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలలో రూ. కోటి నుంచి రూ.2 కోట్ల మేర వ్యాపారం సాగుతోంది. ధర్మపురి నుంచి ప్రతి రోజు 100, సారంగాపూర్ నుంచి 20, రాయికల్ నుంచి 20, మల్లాపూర్ నుంచి 50 ట్రాక్టర్ల వరకు ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు రాత్రిపూట ఇసుక రవాణా సాగించడంతో రాత్రిపూట మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జగిత్యాల-ధర్మపురి మార్గంలో రాత్రి వేళ వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది.

☛ జగిత్యాల పట్టణంలో ధరూర్ క్యాంపు, కోరుట్లలో ప్రభుత్వ ఇసుక నిల్వ కేంద్రాలు ఉండగా.. ఇక్కడ ఇసుకను వేబిల్లు ద్వారా తీసుకెళ్లాలంటే క్యూబిక్ మీటర్‌కు రూ.1200 చెల్లించాలి. ట్రాక్టరు ఇసుక కావాలంటే అద్దెతో కలుపుకుని రూ.4800 వెచ్చించాలి. అక్రమ రవాణాదారులు తక్కువ ధరకే అందిస్తుండటంతో భవన నిర్మాణ దారులు కొనుగోలు చేస్తున్నారు.


ధర్మపురి: గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

పుణ్యక్షేత్రంలో..

ధర్మపురి మండలంలో గోదావరినది రూపురేఖలు పూర్తిగా ఎల్లంపల్లి రిజర్వాయర్ పూర్తయిన తర్వాత మారిపోయాయి. గతంలో ధర్మపురితో పాటు రాయపట్నం, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్, ఆరెపల్లిలతో పాటు సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల నుంచి అంతగా ఇసుక నిలువలు ఉండేవి కావు. బండరాళ్లే దర్శనమిచ్చేవి. దీనికి కారణం భౌగోళికంగా రాయపట్నం, తిమ్మాపూర్ పరిసర ప్రాంతాల్లోనే అధికంగా ఇసుక నిలువలు ఉండేవి. కాని ప్రస్తుతం ధర్మపురి వద్దకు ఎల్లంపల్లి నీరు చేరిన దరిమిలా ధర్మపురిపై గ్రామాల వద్ద ఇసుక నిలువలు పుష్కలంగా పెరిగిపోయాయి. ఈ ప్రాంతం నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఒక్కొక్క ఇసుక ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.2 వేల నుంచి 3, 4 వేల వరకు కూడా ధర ఉంటోంది. వందలాది ట్రాక్టర్లను కొనుగోలు చేసి కేవలం ఇసుక రవాణా ఏకైక ఉపాధిగా వాడుతున్నారు. ధర్మపురి ప్రాంతంలో కన్నా ఈ ఇసుకను జగిత్యాలకు తరలిస్తే అధిక ధర వస్తోంది. దీనితో అక్కడికే తరలించేందుకు పోటీ పడుతున్నారు.


తీర గ్రామాల్లో ఇంటింటా ఇసుక నిలువలే

☛ వర్షాకాలంలో బాగా నది ప్రవహించిన నేపథ్యంలో తాము ఈ ఇసుకను విక్రయించ వచ్చనే ఉద్దేశంతో వందలాది ట్రిప్పుల ఇసుకను నిలువ ఉంచుకుంటున్నారు. జారీ చేసిన పర్మిట్‌పై మళ్లీ, మళ్లీ ఇసుకను రవాణా సాగిస్తున్నారు. కొందరు తేదీలను సైతం దిద్దుకుంటున్నారు.

☛ కొందరు పౌరులు పోలీసులకు వాట్సప్‌లో ఫిర్యాదు చేస్తున్న వెంటేనే వారి నంబర్లు ఇసుక అక్రమ రవాణాదారులకు చేరడంతో బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇసుక మాఫియాకు పోలీసులు ఎలా సహకరిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. ధర్మపురి పుణ్యక్షేత్రంలో ప్రశాంతంగా భక్తులు స్నానాలను ఆచరించే పరిస్థితి లేకుండా పోతోంది.


సంగెం శ్రీరాంపూర్ శివారులోని గోదావరి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

మెట్‌పల్లి డివిజన్‌లోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణ ప్రాంతాలతో పాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, రాయికల్, సారంగాపూర్, మేడిపల్లి మండలాలకు అవసరమైన ఇసుకను మల్లాపూర్-రాయికల్ సరిహద్దులో ప్రవహిస్తున్న పెద్దవాగుతో పాటు గోదావరి నది నుంచి యథేచ్ఛగా ఇసుకాసురులు తరలిస్తున్నారు. డివిజన్‌లోని మల్లాపూర్, కోరుట్ల, రాయికల్ మండలాల సరిహద్దుల నుంచి ప్రవహిస్తున్న పెద్దవాగుకు ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దమొత్తంలో ఇసుక నిల్వలు ఏర్పడటంతో ఇసుక అక్రమ రవాణాదారుల కన్ను ఆయా గ్రామాలపై పడింది.

మల్లాపూర్ నుంచే సరఫరా


స్థానికంగా ఉండే రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఇటీవల పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాకు వేలం పాట నిర్వహించారు. గోదావరి తీరంలోని సంగెం శ్రీరాంపూర్, పాతదాంరాజుపల్లి గ్రామాల శివారు నుంచి సైతం ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అడిగేవారు కరవయ్యారు. మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలతో పాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, రాయికల్, సారంగాపూర్ మండలాల్లో చేపట్టే పనులకు ఇక్కడి ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం రెండు వందలకు పైగా ట్రాక్టర్లలో ఇసుకను రాత్రింబవళ్లు తరలిస్తూ కోట్లాది రూపాయాలను సంపాదిస్తున్నారు. నిత్యం వేకువజామున, రాత్రి వేళల్లో భారీ మొత్తంలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక టెండర్లు నిర్వహించే గ్రామాల వీడీసీల ద్వారా నెల వారీగా అధికారులకు ఇసుకను తరలించే రవాణాదారులు పోలీసు, రెవెన్యూ శాఖలకు పెద్ద ఎత్తున మామూళ్లు ముట్టజెప్పుతుండటంతోనే అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జోరుగా సాగుతున్న ఇసుక దందా...

రాయికల్ మండలంలోని ఇటిక్యాల, కొత్తపేట, మూటపల్లి పెద్దవాగు నుంచి బోర్నపల్లి, జగన్నాథపూర్ గోదావరి ప్రాంతాలతో పాటు చింతలూరు అటవీ ప్రాంతాల నుంచి నిత్యం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. రాయికల్ మండలంలోనే సుమారు 80 ట్రాక్టర్లు నిత్యం ఇసుక దందా కొనసాగిస్తుండగా ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని ట్రాక్టర్లు ఇసుక రవాణాకు వస్తుంటాయి. మల్లాపూర్, రాయికల్ మండల శివారు ప్రాంతాలలోని వాగుల నుంచి నిత్యం ఇసుకను రవాణా చేయడంతో ఆయా గ్రామాలలో భూగర్భ జలాల మట్టం తీవ్రంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకుని కేసులు చేస్తే కృత్రిమ కొరత సృష్టించి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఒక్కో ట్రాక్టరుకు విక్రయించి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.2వేల నుంచి 2500 వరకు విక్రయిస్తూ నిత్యం 100 వరకు ట్రిప్పులు సాగిస్తుండగా సుమారు రోజుకు 2.50లక్షలు, నెలకు రూ.75 లక్షల వ్యాపారం సాగుతోంది. గ్రామాలలో వీడీసీల ద్వారా అక్రమంగా ట్రిప్పునకు కొంత వసూలు చేయడంతో గ్రామస్థులు రవాణాను అడ్డుకోవడం లేదు.

అక్రమ ఇసుక రవాణా అరికడతాం..

-అనంతశర్మ, జిల్లా ఎస్పీ, జగిత్యాల



జిల్లాలో ధర్మపురి, సారంగాపూర్, రాయకల్, మల్లాపూర్ గోదావరి ప్రాంతం నుంచి అక్రమ ఇసుక రవాణా సాగుతుందని గుర్తించాం. అయితే ఇప్పటికే చాలా ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు చేశాం. అయినా ఇంకా ఇసుక దందా సాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణా అరికడతాం. ఇందులో రెవెన్యూ, మైనింగ్‌శాఖ కూడా తమతో సహకరిస్తే పూర్తిగా అక్రమ ఇసుక దందాను అరికడతాం. ఫలితం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి.

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మిడ్‌వైఫరీ నర్సింగ్ కోర్సు

ఎంపీ వినోద్‌కుమార్

చైతన్యపురి, న్యూస్‌టుడే : ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువుగా ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే మిడ్‌వైఫరీ నర్సింగ్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. అదివారం మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ప్రసూతి వార్డు, నవజాత శిశు కేంద్రాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. అమెరికా, యూరోపియన్ లాంటి పాశ్చాత్య దేశాల్లో మాత్రమే అందుబాటులో ఉండే మిడ్‌వైఫరీ నర్సింగ్ కోర్సును కరీంనగర్‌లో ప్రారంభించాలని సీఎం కేసీఆర్ సూచనలతో కేంద్ర ప్రభుత్వం ఈ కోర్సును కరీంనగర్‌లో అమలు చేసేందుకు అనుకూలంగా ఉందన్నారు. బీఎస్సీ నర్సింగ్, జనరల్ నర్సింగ్ కోర్సులు చేసినవారు అర్హులని తెలిపారు. ఈ కోర్సు రావడం ద్వారా సాధారణ ప్రసవాలు అధిక సంఖ్యలో పెరగనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాత శిశు ఆరోగ్య కేంద్రానికి కేవలం రూ. 10 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరో రూ.10 కోట్లు నిధులు కేటాయించి ఆసుపత్రిలో ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వినోద్‌కుమార్

కేసీఆర్ కిట్లు ఇతర రాష్ట్రాలకు అదర్శం : కేసీఆర్ కిట్టు పథకం ఇతర రాష్ట్రాలకు అదర్శంగా నిలుస్తోందని.. ప్రసవం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు మగ పిల్లాడు పుడితే రూ.12వేలు, అడపిల్ల పుడితే రూ.13వేలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులో ప్రసవాల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ పథకాన్ని దేశంలో ఇతర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టేందుకు.. పార్లమెంటరి మెడికల్ కమిటీ సభ్యులు అలోచిస్తున్నట్లు తెలిపారు. . ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. తల్లిబిడ్డల సంరక్షణ కోసం తెలంగాణాలోనే ఏర్పాటుచేసిన కార్పొరేట్‌స్థాయి ఆస్పత్రి ఇదేనని, స్మార్ట్ సిటీ కూడా ఎంపీ చొరవతోనే వచ్చిందని, మిడ్‌వైఫరీ నర్సింగ్ శిక్షణ సైతం ఎంపీ చొరవతోనే సాధ్యమైతుందన్నారు. జడ్పీ ఛైర్మన్ తుల ఉమ మాట్లాడుతూ.. మిడ్‌వైఫరీ కోర్సుతో కరీంనగర్‌లో పేదలకు మరిన్ని వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. కార్యక్రమలో ఎంఎల్‌సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేశం, ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ సుహాసిని, ఆర్‌యంవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ దస్త్రాల పరిశీలన

బీర్‌పూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో రెవెన్యూ దస్త్రాల పరిశీలన కొనసాగుతోంది. రైతుల పాసుపుస్తకాలలోని తప్పులను సవరించుకునేందుకు మంచి అవకాశమున్నందున సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రాజేందర్, వసంత, నాయబ్ తహసీల్దార్లు శ్రీనివాస్, వెంకటరమణ, రెవెన్యూ పరిశీలకులు వంశీకృష్ణ, ముక్తార్‌అలీ, రెవెన్యూ కార్యదర్శులు, సహాయకులు పాల్గొన్నారు.

రేపు మంగళగౌరి వ్రతాలు

కోరుట్ల పట్టణం: కోరుట్ల పట్టణంలోని శ్రీశివమార్కండేయ కోటి నవదుర్గ ఆలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సామూహిక మంగళగౌరి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంగారాం, సుధాకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత సహకార సంఘం భవనంలో ఉదయం 8 గంటలకు, పద్మశాలి సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు జాతీయ పతకావిష్కరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



రోగులతో వైద్యుడు ఎం.సంజయ్‌కుమార్ తదితరులు

పేదలకు ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆస్పత్రిలో ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణం, మండలం, రాయికల్, సారంగాపూర్, మెట్‌పల్లి, గొల్లపల్లి తదితర మండలాలకు చెందిన 17 మంది పేదలకు వైద్యుడు ఎం.సంజయ్‌కుమార్ ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలను ఆదివారం నిర్వహించారు. అనంతరం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆపి ఉపాధ్యక్షుడు కొత్త ప్రతాప్, రోటరీక్లబ్ అధ్యక్షుడు సిరిసిల్ల శ్రీనివాస్, కోశాధికారి కాశీరావు, టీవీ సూర్యం, అంజయ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పడక గదుల ఇళ్లను నిర్మించాలి

రాయికల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయికల్ మండలానికి మంజూరు చేసిన రాయికల్, కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామాలలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు కంటె గంగారాం డిమాండ్ చేశారు. గత రెండేళ్లు గడిచినా పనులు మొదలు పెట్టకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం త్వరగా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కునారపు నరేష్, పడిగెల ప్రవీణ్, కంటె అరవింద్, మదాసు రమేష్, జైత వేణు, కొండా రాజేష్, తేజ తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: తెరాస పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. నిజామాబాద్ లోక్‌సభ సభ్యురాలు కల్వకుంట్ల కవిత, తెరాస ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి తెరాసలో చేరామని యాదవ మహాసభ పట్టణశాఖ అధ్యక్షుడు చెరుకు మనోహర్ యాదవ్, గొర్ల హరిప్రసాద్ యాదవ్, తిరుపతి యాదవ్, అశోక్‌యాదవ్, అనిల్‌యాదవ్ తదితరులు చెప్పారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎం.సంజయ్‌కుమార్‌కు అండగా పార్టీ శ్రేణులతో కలిసి సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

గంగపుత్ర సంఘం కార్యవర్గం ఎంపిక

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: తెలంగాణ గంగపుత్ర (బెస్త గూండ్ల) సంఘం జగిత్యాల మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నాచుపెల్లి రెడ్డి తెలిపారు. మండల అధ్యక్షునిగా దేశవేని ప్రవీణ్ (ధరూర్), ఉపాధ్యక్షునిగా బింగి నర్సయ్య, కార్యదర్శిగా ఎల్ల రాజు, సభ్యులుగా అర్వపెల్లి రవి, జె.నర్సయ్య, యువజన అధ్యక్షునిగా ఆరుముల్ల శేఖర్, ఉపాధ్యక్షునిగా ఆరవెల్లి రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా పందిరి అరుణ్‌కుమార్, కార్యదర్శులుగా దేశవేని రాజేశ్, బింగి మహేశ్, సభ్యులుగా సిరికొండ సంతోష్, కోరుట్ల గంగాధర్, ఆరుముల రాజేందర్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆరుముల్ల పవన్, యువజన అధ్యక్షుడు ఆరుముల్ల ఉమేందర్, కల్లెడ నర్సింహరాజు, కల్లూరి నవీన్, ఆరుముల్ల రమేశ్, పల్లికొండ రవి తదితరులున్నారు.

క్రీడలకు ప్రోత్సాహమేదీ?

పాఠశాలల్లో మైదానాలు కరవు ✦ ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఆర్థిక సమస్యలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: "బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 218 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో కొందరికైనా క్రీడల పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ క్రీడా మైదానంతోపాటు గత మూడేళ్లుగా పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు లేడు. ఆసక్తి ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులే ఆడించాల్సి వస్తోంది. రెండేళ్ల వరకు పక్కనే ఉన్న పశువైద్యశాలలోని కొంత స్థలంలో విద్యార్థులు ఆడుకునేవారు. అందులో మొక్కలు నాటడంతో ప్రస్తుతం క్రీడలకు స్థలం లేకుండా పోయింది. ఇది ఒక్క తుంగూర్ సమస్యనే కాకుండా మండలంలోని దాదాపు అన్ని పాఠశాలల పరిస్థితి ఇలాగే ఉంది."

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 63 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ రెండు, మూడు పాఠశాలలు మినహా ఎక్కడా పూర్తి స్థాయిలో క్రీడా మైదానాలు లేవు. ఉన్న వాటికి వ్యాయామ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో క్రీడల్లో ప్రోత్సాహం లేకుండా పోతోంది. మైదానం లేకపోవడంతో చదువుల్లో పోటీ ఏర్పడటంతో చదువుపై ఉన్న ధ్యాస క్రీడలపై పెట్టకపోవడంతో ప్రతిభ ఉన్న క్రీడాకారులు కూడా పాఠశాల స్థాయిలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



మైదానం లేకపోవడంతో రహదారిపై పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం (పాత చిత్రం)

వ్యాయామ ఉపాధ్యాయుల నియామకమేదీ?

ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకం లేకపోవడంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు క్రీడలను ఆడిపించేందుకు ఆసక్తి చూపడంలేదు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో రేచపల్లి, రంగపేట, అర్పపల్లి, కోనాపూర్, సారంగాపూర్, బీర్‌పూర్, నర్సింహపల్లె, తుంగూర్, కొల్వాయితోపాటు కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాలలో ఉన్నత పాఠశాలలుగా కొనసాగుతున్నాయి, ఆయా పాఠశాలల్లో కేవలం రేచపల్లి, కోనాపూర్, బీర్‌పూర్‌లో మాత్రమే రెగ్యులర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఉండగా అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లెలో ఆర్వీఎం నుంచి వ్యాయామ ఉపాధ్యాయులను నియమించారు. మిగతా కనీసం ఉన్నత పాఠశాలలకు కూడా పీఈటీ పోస్టులు ఖాళీగానే ఉండటంతో విద్యార్థులకు క్రీడలకు ప్రోత్సాహం లేకుండా పోతోంది.

పోటీలకు వెళ్లాలంటే...

ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహిస్తున్నా.. ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు ఎలాంటి ఆర్థికంగా చేయూత ఇవ్వకపోవడంతో దాతల సహకారంతో పాల్గొనాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ శాతం నిరుపేదలే కావడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనాలంటే ఇబ్బంది పడాల్సివస్తోంది. మంచి ప్రతిభ ఉన్నప్పటికీ పోటీలలో పాల్గొనాలంటే ఆర్థికంగా ఉంటే సాధ్యపడుతుంది. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సాహం అందించాల్సిన అవసరముంది.

మైదానం లేకపోవడం ఇబ్బందిగా ఉంది

- లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయుడు



పాఠశాలల్లో మైదానం లేకపోవడంతో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికే తరగతి గదులతోనే పాఠశాలలు నిండిపోవడంతో క్రీడలపై విద్యార్థులు ఆసక్తి కనబరిచినా మైదానాలు లేకపోవడంతో వ్యవసాయ పొలాల్లో ఆడుకోవాల్సి వస్తుంది. గత మూడేళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోవడంతో మేమే విద్యార్థులను ఆడించాల్సి వస్తుంది.

పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు

-చందన్, విద్యార్థి



మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైతే అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారే కావడంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆర్థిక వనరులు సమకూర్చి, క్రీడా పరికరాలు అందించి ప్రోత్సహించాలి.



తుంగూర్ గ్రామ పంచాయతీ సమీపంలో రహదారి



లక్ష్మీదేవిపల్లెలోని ఓ రహదారి

రహదారులు ఇలా.. నివాసముండేదెలా?

సారంగాపూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారి కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 22 పంచాయతీలు ఉండగా మరో పది శివారు తండాలు ఉన్నాయి. మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికి కూడా మురుగు నీరు రహదారిపై పారుతోంది. పక్కనే ఉన్న ఇళ్లలో నివాసముంటున్న వారు అవస్థలు పడుతున్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లోని గ్రామ పంచాయతీ వద్ద రహదారిపై పూర్తిగా బురదగా ఉండటంతో నడవలేని పరిస్థితి నెలకొంది. రహదారుల నిర్మాణాలతోపాటు మురుగు కాలువల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రేచపల్లిలోని ఓ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి 15న

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 15న సాయంత్రం జగిత్యాలలోని గీతాభవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకను నిర్వహించన్నుట్లు వీహెచ్‌పీ జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరాజిరెడ్డి తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడికి అష్టోత్తర అర్చన తదితర ప్రత్యేక పూజాధికాలను జరపడం, ఉట్టికొట్టుట, ఊయల, హారతి తదితర కార్యక్రమాలుంటాయన్నారు. చిన్నారులను శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో తీసుకురావాలని, నంబి వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో మంగళశాసనం, బహుమతి ప్రదానం ఉంటుందని వివరించారు. గుండు సాయి మధుకర్, పద్మాకర్, చిటుల్ల గంగాధర్, తిలోక్ ఆముద్, వీరబత్తిని రాజమల్లు, వేముల సంతోష్, పల్లెర్ల శంకరయ్య, బెజ్జెంకి సుభాష్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మోరపల్లి(జగిత్యాల గ్రామీణం): జగిత్యాల మండలం ధరూర్ రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. జగిత్యాల ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు... జగిత్యాల మండలం మోరపల్లికి చెందిన సంకోజి లక్ష్మినారాయణ(55) మల్యాలకు వెళ్లి జగిత్యాలకు తిరిగి వస్తుండగా జగిత్యాల మండలం ధరూర్ వద్ద కారు ఢీకొనగా తీవ్ర గాయాలైన అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే అతని పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జగిత్యాల

రెండు రోజుల్లో కరదీపికలు అందజేస్తాం

రాయికల్ పట్టణం: త్రీ ఆర్స్ కార్యక్రమంపై సర్వశిక్షా అభియాన్ రూపొందించిన శిక్షణ కరదీపికలను రెండు రోజుల్లోగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందజేయనున్నట్లు త్రీ ఆర్స్ కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి లతాదేవి తెలిపారు. 'ఈనాడు' జగిత్యాల జిల్లా పత్రికలో 'శిక్షణ ఇచ్చారు.. కరదీపికలు మరిచారు' అనే శీర్షిక ఈనెల 13న కథనం ప్రచురితం కాగా జిల్లా విద్యాధికారులు స్పందించారు. ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించిన మేరకు ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో త్రీఆర్స్ పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్షాకాలం.. దాహం.. దాహం

పట్టణ ప్రజలకు శుద్ధజలం అందని ద్రాక్షే

రాయికల్, న్యూస్‌టుడే: వర్షాకాలమైనప్పటికి రాయికల్ మండల కేంద్రంతో పాటు శివారు కాలనీల్లో తాగునీటి తిప్పలు తప్పడం లేదు. పెద్ద చెరువులో నీటి కొరతతో పాటు పట్టణానికి పంపింగ్ చేస్తున్న మూడు వ్యవసాయబావుల్లో ఒకబావి పనిచేయక పోవడంతో పట్టణంలోని పలు వార్డులకు తాగునీటి సరఫరా జరగడం లేదు. మరోవైపు కోట్లు ఖర్చుచేసి నిర్మించిన శుద్ధజల కేంద్రం నిరూపయోగంగా మారిది.

రాయికల్ మండల కేంద్రంలో 18 వార్డులుండగా మూడు తాగునీటి బావుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మైతాపూర్ రహదారి, అయ్యప్ప ఆలయం వద్ద గల బావుల నుంచి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతుండగా ఇటిక్యాల మూలమలుపు వద్ద గల వ్యవసాయ బావిలో కలుషిత నీరు రావడంతో పట్టణంలోని కొన్ని వార్డులకు నీటి సరఫరా జరగడం లేదు. ఇటు తాగునీటి బావుల నుంచి నీటిని సరఫరా చేయకపోవడంతో పాటు కోట్లు వెచ్చించి నిర్మించిన శుద్ధజల కేంద్రం నిరూపయోగంగా మారింది. సుమారు రూ.6కోట్ల వ్యయంతో సమగ్ర నీటి పథకం ద్వారా మండలంలోని రాయికల్, రామాజీపేట, భూపతిపూర్, కుమ్మరిపెల్లి, ఇటిక్యాల్, చెర్లకొండాపూర్ గ్రామాలకు శుద్ధజలం అందించడమే లక్ష్యంగా 2007లో మండల కేంద్రంలో ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు నత్తనడకన



రాయికల్‌లో నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్‌బెడ్

సాగగా నిర్మాణ పనులు పూర్తి కావడానికి ఏడు సంవత్సరాలు పట్టింది. నిర్మాణం జరుగుతున్న క్రమంలోనే మండలంలోని అటవీ గ్రామాలకు కూడా నీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో మరో రూ.4కోట్లతో అటవీ గ్రామాలకు పైప్ లైన్ నిర్మాణాలను పూర్తి చేశారు. ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి మొత్తం రూ.10కోట్ల వ్యయమైంది. ఫిల్టర్‌బెడ్ పూర్తయి 2014 జనవరి 11న లాంఛనంగా ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క గ్రామానికి కూడా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగలేదు. గత సంవత్సరం పైపులైన్ల పరీక్షల నిమిత్తం మండలంలోని మూడు గ్రామాలకు పది రోజుల పాటు నీటిని సరఫరా చేసిన ఆయా గ్రామాల ప్రజలకు కలుషిత నీరే దిక్కయింది.

నీటి లభ్యతకు చెరువే ఆధారం

రాయికల్ మండల కేంద్రంలో సమగ్ర నీటి పథకంలో ఫిల్టర్‌బెడ్‌ను ఏర్పాటు చేయగా రామాజీపేట-భూపతిపూర్ గ్రామాల మధ్యన ఉన్న చెరువు నుంచి పంపింగ్ ద్వారా నీటిని ఫిల్టర్‌బెడ్‌కు తరలించారు. ఈ చెరువు పూర్తిగా వర్షాభావం కావడంతో తగినంత నీటి వనరుల లభ్యత లేదు. తీవ్రమైన కరవు ఏర్పడిన పరిస్థితుల్లో ఫిల్టర్‌బెడ్‌కు నీటి వనరుగా ఉన్న రామాజీపేట-భూపతిపూర్ గ్రామాల మధ్యన ఉన్న చెరువు పూర్తిగా ఎండిపోవడంతో నీటి సరఫరా చేయలేకపోయారు. తమ చెరువుకు ఎస్సారెస్పీ కాల్వలతో అనుసంధానం లేదని ఈ చెరువులో నీరుంటేనే సుమారు 480 ఎకరాల ఆయకట్టు సాగవుతుందని, భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు వాపోతున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించిన తాగునీటి పథకం వృథాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో తాగునీటి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ సేవలే సంస్థ ధ్యేయం

జగిత్యాలలో అక్షరచిట్స్ శాఖ ప్రారంభం



ప్రారంభిస్తున్న సంస్థ అధ్యక్షుడు పేరాల శ్రీనివాసరావు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించడమే సంస్థ ధ్యేయమని అక్షర చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. జగిత్యాలలోని కరీంనగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన అక్షర చిట్స్ జగిత్యాల శాఖను ఆదివారం ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నోఏళ్లుగా చిట్ ఫండ్ రంగంలో నమ్మకమైన సేవలందిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 29 అక్షర చిట్స్ శాఖలుండగా ఖాతాదారుల కోరికమేరకు జగిత్యాలలో 30వ శాఖను ప్రారంభించామన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీరంజన్‌రెడ్డి, ఏడీఎంలు మల్లికార్జున్, భిక్షమయ్య, హరీష్, సంపత్‌రావు, బ్రాంచి మేనేజర్ తిరుపతి, మేనేజర్లు, ఖాతాదారులు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ అమర్‌దీప్‌గౌడ్

కవి సమ్మేళనం 28న

జగిత్యాల ధరూరుక్యాంపు, న్యూస్‌టుడే: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్, ప్రముఖకవి కాళోజీ నారాయణరావుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 28న జగిత్యాలలో జిల్లాస్థాయి కవిసమ్మేళనం జరపనున్నట్లు జాగృతి జిల్లా కన్వీనర్ చెర్లపల్లి అమర్‌దీప్‌గౌడ్, కార్యక్రమ ఇన్‌ఛార్జి బైరం హరికిరణ్ పేర్కొన్నారు. తెలంగాణం అనే అంశంపై జరిపే కవి సమ్మేళనంలో భాషా, సంస్కృతి, కళలు, ప్రకృతి, వృత్తులు, జీవనవిధానం, ఊరు, బాల్యం తదితరాలను స్పృశించవచ్చన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు గీతాభవన్‌లో జరిగే సమ్మేళనంలో పాల్గొనే కవులు తమ పేర్లను 9951361399 నెంబరుద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. వెల్ముల శ్రీనివాసరావు, తాటిపాముల రాజేందర్, సిరంగి సంతోష్, నీలగిరి రాజేందర్‌రావు, కొండ యుగంధర్, మేకల ప్రవీణ్, కొక్కుల రాజు, జావిద్ తదితరులున్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ జీవన విధానం

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: క్రమ శిక్షణతోనే ఉత్తమ జీవన విధానం అలవడుతుందని పట్టణ సీఐ ప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని జ్యోతి ఉన్నత పాఠశాలలో స్కౌట్ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ జెండాను సీఐ ఆవిష్కరించిన అనంతరం విద్యార్థులు స్కౌట్ దీక్షను స్వీకరించారు. సమాజసేవలో ముందుండే స్కౌట్ విద్యార్థులు విపత్కర పరిస్థితుల్లోనూ అందించే సేవలు నిరుపమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, స్కౌట్ గైడ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి కంకణాల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్కౌట్ జెండాను ఆవిష్కరిస్తున్న పట్టణ సీఐ ప్రకాశ్

నేతన్నలు అన్ని రంగాల్లో రాణించాలి

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర ఉద్యమంలో నేతన్నలు కీలక పాత్ర పోషించారని, అలాంటి నేతన్నలు అన్ని రంగాల్లో విశేషంగా రాణించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఇటీవల పద్మశాలీ సేవా సంఘం పట్టణశాఖ అధ్యక్ష ఎన్నికల్లో మాజీ ఎంపీటీసీ సభ్యుడు మ్యాకల కాంతారావు విజయం సాధించగా ఆదివారం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, తెరాస నియోజకవర్గ బాధ్యులు సంజయ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తన రాజకీయ అనుభవాన్ని వినియోగించుకుని పద్మశాలీ సామాజిక వర్గీయుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధ్యక్షులు మ్యాకల కాంతారావు పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు సిరిపురం జితేందర్, సీనియర్ పద్మశాలీ సేవా సంఘం నాయకులు మోర హన్మండ్లు, ఆడెపు లక్ష్మినారాయణ, మ్యాకల రమేష్, మామిడాల లక్ష్మినారాయణ, శ్రీరాముల సత్యనారాయణ, ఆశోక్, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సహకార సంఘంలో అవినీతిపై విచారణ జరపాలి

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: రాయికల్ సహకార సంఘంలో రూ.50లక్షల వరకు అవినీతి జరిగిందని, అధికారులు విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం పలువురు మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల ఆడిట్ నిర్వహించగా సహకార సంఘం అవినీతి వ్యవహారం బయటపడిందని, సహకార సంఘంలో రైతులకు సక్రమంగా రుణాలు అందించడం లేదని, వరి ధాన్యం కొనుగోళ్లలో సహకార సంఘాలు రైతుల నుంచి రూ.28 వరకు డబ్బులు వసూలు చేసినట్లు వారు ఆరోపించారు. రాస్తారోకో సందర్భంగా వాహనాలు రాకపోకలు నిలిచిపోగా స్థానిక ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో తెరాస మండల అధ్యక్షులు పడాల తిరుపతి, సర్పంచులు తురగ రాజిరెడ్డి, ఆర్మూరి లక్ష్మినారాయణ తెరాస నాయకులు ఇంతియాజ్, అనీల్, వేణు తదితరులు పాల్గొన్నారు.



రాయికల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

అవగాహనరాహిత్యంతోనే ఆరోపణలు

మండలంలోని కొందరు ప్రజాప్రతినిధులు రాజకీయ దురుద్దేశం, అవగాహన రాహిత్యంతోనే రాయికల్ సహకార సంఘంపై అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు రాయికల్ సహకార సంఘం అధ్యక్షులు పడిగెల రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన, పాలకవర్గం సభ్యులతో కలిసి పట్టణంలోని రాయికల్ సహకార సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంఘం పరిధిలో 2003 నుంచి పెట్రోల్ ఉత్పత్తుల అమ్మకాన్ని ప్రారంభించామని అప్పటి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు పెట్రోల్ ఉత్పత్తుల్లో తరుగుదలను నికర లాభాల నుంచి తీసివేయలేదని అన్నారు. ఈ 14 సంవత్సరాల పెట్రోల్ ఉత్పత్తుల తరుగుదలను ఆడిట్ అధికారులు రు.34,84,990గా గుర్తించారన్నారు. అంతేకాని ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు హమాలీలకు ఇచ్చిన ఛార్జీలతో తమకు సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పల్లికొండ గంగారాం, పాలకవర్గం సభ్యులు ఏనుగు మల్లారెడ్డి, మాణిక్యం శివకుమార్, వేముల హన్మండ్లు, అయిండ్లేని లత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు కొవ్వొత్తులతో నివాళులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోయిన చిన్నారులకు స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బోగోజి ముకేష్‌ఖన్నా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ప్రాణ వాయువు అందక 60 మందికి పైగా చిన్నారులు మృతి చెందడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. ఇది భాజపా వైఫల్యానికి నిదర్శనమన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, ఉపాధ్యక్షుడు సిరాజొద్దీన్ మన్సూర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బండ శంకర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీర్‌గౌడ్, కౌన్సిలర్లు బింగి రవి, గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

చలో దిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో చలో దిల్లీ గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. దళిత, మైనార్టీ, గిరిజనులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 23న దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టే దళితుల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్ సూచన మేరకు ఉమ్మడి జిల్లా నుంచి సభ్యులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి చలో దిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మేడి అంజయ్య, నాయకులు బండ శంకర్, బల్దియా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ మన్సూర్, అటుకుల జాన్సన్, పట్టణశాఖ అధ్యక్షుడు కడమండ కమలాకర్, మెరుగు లక్ష్మణ్, కంటి దేవయ్య, చిత్తారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

EENADU CLASSIFIEDS

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 95818 75105.

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 77995 18807.

తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఉంటూ పేపర్ ప్లేట్స్ తయారుచేసే మెషిన్లు కలవు. ముడిసరకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం, అగ్రిమెంట్ కలదు, Govt. రిజిస్ట్రేషన్. సాయి విగ్నేష్ ఏజెన్సీస్, ✆ 99630 02088.

థర్మాకోల్ & పేపర్ ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. స్కై ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

READYMADE & TEXTILES

***భారీ డిస్కౌంట్** ఆఫర్* ముందెప్పుడు లేనివిధంగా సారీస్, రెడిమేడ్స్, మెటీరియల్స్, టాప్స్‌పై హోల్‌సేల్ ధరల కంటే తక్కువ ధరలకే, స్టాక్ క్లియరెన్స్ సేల్, వీకెంట్ ప్రత్యేక ఆఫర్ (Aug 10 - Aug 16) స్టాకు ఉన్నంతవరకే. బ్రాండెడ్ ఇన్నర్‌వేర్ & లెగ్గింగ్‌లపై భారీ తగ్గింపు. సుప్రియ ఫ్యాషన్స్, క్రిస్టియన్ కాలనీ, కరీంనగర్. ✆ 95021 32576.

EDUCATION

TUITIONS

Tuitions: B.Tech, Diploma, Inter, 6th - 10th, Special Coaching for Detained Students. Ranckers Academy, Near Kaman. 73823 28246, 98667 97192.

MARRIAGE SERVICES

మీ జీవితాంతం తోడుంటారనుకున్న జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. 1వ, 2వ, లేట్ మ్యారేజ్‌లకు & అన్ని కులాల పెండ్లి సంబంధాలకై సంప్ర॥ హరిహర మ్యారేజ్ బ్యూరో, KNR. Cell: 98496 51552.

REAL ESTATE

HOUSE FOR SALE

16 లక్షలకే B.B.నగర్ దగ్గరలో గేటెడ్ కమ్యూనిటిలో 2BHK ఇంట్లో A/C, T.V ఫుల్ ఫర్నీష్డ్, విత్‌బ్యాంక్‌లోన్ మరియు EMI తో ఓపెన్ ప్లాట్స్ కలవు. Ph: 9059959696.

ధర్మారం మండల కేంద్రములో మెయిన్‌రోడ్డుకు హాస్పిటల్ బిల్డింగ్ 2225x3 స్లాబ్‌లు కలిగిన 3.70 గుంటల స్థలంములో నిర్మించినది అమ్మబడును. Cont: 94402 10877, 84999 51939.

PLOT FOR SALE

శామీర్‌పేట -తుర్కపల్లి Near జినోమ్ వ్యాలీ, 300 బయోటెక్ పార్క్స్, ప్రజయ్ వాటర్ ఫ్రంట్ విల్లాస్ ప్రక్కన, విల్లాప్లాట్స్ కలవు. స్పాట్ రిజి॥ లోన్, రెడి టు కన్‌స్ట్రక్షన్. Ph: 7569993323/ 8247789699

పెద్దపల్లి జిల్లా భూమ్‌నగర్ క్లాస్ 1 లొకాలిటీలో ఉత్తరం ఫేస్‌తో కల్గిన 527 గ॥ 2 రోడ్లు కల్గిన ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 98492 10517.

LEASE / RENT

Commercial/ Office Purpose Building for Rent or Lease. Near to Fire Station Karimnagar. (with Furniture) Cell: 70139 53415.

TO-LET

KNR మంకమ్మతోటలో JNM స్కూల్ దగ్గర ఇ.నెం. 7-2-221 నందు 1st ఫ్లోర్‌లో 4 రూముల ఫ్యామిలీ పోర్షన్ అన్ని వసతులతో అద్దెకు ఇవ్వబడును. సంప్ర: సెల్: 90002 88980, 79897 95262.

JOBS

Wanted Faculty for Maths, Physics, Chemistry and Technical Subjects. EEE, ECE, CSE, IT, Mech, Civil require Jobs 10 Members. Jyothi B.Tech. Cell: 97012 34074.

కరీంనగర్‌లోని హాస్పిటల్స్‌కు అర్జెంటుగా స్థానిక సెక్యూరిటీ గార్డులు కావలెను. సివిల్ హాస్పిటల్ వెనుక మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్. జి.రఘురామ్. సంప్ర॥ 96668 77880.

కరీంనగర్‌లోని ప్రముఖ ఏజెన్సీనందు పనిచేయుటకు Ape 3 విల్లర్ ఆటో డ్రైవర్లు డెలివరి బాయ్స్ కావలెను. ఆకర్షనీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 79935 93646.

జాబ్‌మేళా. Q: 10th - P.G (M/F) Telecallers, Executives, Team Leasers, Supervisors (Fresh/ Exp) కావలెను. జీతం: 12,000 to 22,500/- (TA+DA) జిల్లా, మండలాల వారీగా ఫ్రాంఛైజ్, డీలర్లు కావలెను. 97018 86898.

S.K.V.R కంపెనీలో పనిచేయుటకు BSc (కెమిస్ట్రీ), ITI ఆల్‌ట్రేడ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ బాయ్స్ సూపర్‌వైజర్స్, లేడిటెలికాలర్స్ కావలెను. జీతం:10000 To 17000/- PM డైరెక్ట్ ✆ 9553650060/ 9553633437

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ (Orion PVT Ltd) నందు పనిచేయుటకు ట్రాలీ ఆపరేటర్స్ కావలెను, అర్హత 7th to ఇంటర్ జీతం+ OTలు కలవు, వివరాలకు సంప్ర: 9133154411, 9441854493.

హోటల్ నందు టిఫిన్‌మాస్టర్, సౌత్‌ఇండియన్ దోసామాస్టర్ మరియు అసిస్టెంట్స్ అనుభవం కల్గినవారు వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 91778 22472, 88866 88442, 45.

కరీంనగర్‌లోని స్వాగత్ వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు ఆటో డ్రైవర్స్ & హెల్పర్స్ కావలెను. ఉచిత భోజనం + రూం ఫ్రీ సెల్: 7032522474, 7032524277.

రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ చానల్ కరీంనగర్ బ్రాంచ్ నందు ఉద్యోగవకాశంలు. వయస్సు: 25 పై. అర్హత ఏదైన డిగ్రీ, 1 సం॥ మార్కెటింగ్ అనుభవం ఉన్నవారు. జీతం: 20,000/- + ఇన్సెంటివ్స్. ✆ 93476 60954.

కరీంనగర్ (భగత్‌నగర్) కిరణ్ వాటర్‌ప్లాంట్‌లో పనిచేయుటకు ఆటోడ్రైవర్, వర్కర్ కావలెను. జీ॥ 6000/- రూం మరియు రెండు పూటల భోజనం కలదు. సంప్ర: ✆ 90822 25555/ 94933 69988.

ఓం నాగేంద్ర ఆటోమోబైల్స్ జగిత్యాల షోరూం నందు వర్క్ మేనేజర్ డిప్లొమా చేసిన వారు కావలెను మరియు మెకానిక్స్, టెక్నీషియన్లు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. 98490 45389, 73373 96794.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో గల విజ్‌డమ్ హైస్కూల్‌లో పనిచేయుటకు Male & Female Wardens మరియు High School Telugu టీచర్ కావలెను. సంప్ర॥ 94404 45554, 94405 25432.

జాబ్ ఆఫర్: Shara గ్రూప్ ఆఫ్ కంపనీకి క్రొత్త జిల్లాలో పర్మినెంట్ ఉద్యోగాలు. నో ఫీజు. ఫ్రీ రూం. అ: 10th ఆపైన వ॥ 18 to 26 సం॥లోపు స్త్రీ/పు. జాబ్ కోసం ఈరోజు, రేపు సంప్ర: 79811 66439. GDK, KNR. D.No: 19-2-40.

Hyd, హైటెక్‌సిటి 5 స్టార్ హోటల్‌లో పనిచేయుటకు యువకులు కావలెను. జీతం: 7 నుంచి 9 వేలు + భోజనం + రూం ఫ్రీ. ✆ 96189 49412/ 80966 48884

3, 5 స్టార్ హోటల్‌లో క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూం+ మీల్స్ ఫ్రీ. జీతం: 13,500 చదువు ఉన్నా లేకున్నా వ॥ 18 నుండి 32 సం॥ వరకు, ✆ 7032144066/ 8501014020

ఫీజులేదు Hyd లో ప్రముఖ MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకింగ్‌బాయ్స్, సూ॥వైజర్స్ కా॥ జీ: 13-18 వేలు రూం + భోజనం ఫ్రీ. ESI + PF చదువు లేకున్నా జాబ్, ✆ 7330250599.

కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, హుజూరాబాద్, గోదావరిఖనిలో సిగరెట్ సేల్స్‌మెన్స్‌గా చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. జీతం: 10,000 ఆపైన, సంప్ర॥ Cell: 77020 00348, 98495 05548.

జగిత్యాలలోని రెస్టారెంట్‌లో పనిచేయుటకు అనుభవంగల అకౌంటెంట్ కావలెను. Tally ఉన్నవారికి ప్రాధాన్యత, క్యాషియర్, సూపర్‌వైజర్ కావలెను. ✆: 9703037007.

Wanted Receptionist, Nursing and House keeping staff for Hospital. Cont: 98490 01227.

మీ కుమార్ హాస్పిటల్‌లో డ్యూటీ డాక్టర్స్, అనుభవం గల ANM, GNM, రిసెప్షనిస్ట్, వార్డు బాయ్స్ కావలెను. (M/F). Cell: 83330 89895, 0878 2241815.

పర్మిట్ రూంలో పని చేయుటకు వర్కర్లు మరియు క్లీనింగ్ చేయుటకు బాయ్స్ కావలెను. అడ్రస్: కరీంనగర్. Contact: 73375 30213.

కావలెను. కరీంనగర్ భగత్‌నగర్‌లోని హిందుస్థాన్ ఏజెన్సీలో పని చేయుటకు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. 4 గం॥ to 9 గం॥ వరకు. జీతం: 2500. Cont: 92480 59500.

Hydలోని ప్రముఖ లి॥కం॥లకై హెల్పర్స్, ప్యాకర్స్, క్యాటరింగ్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. జీ: 13-18 వేలు. రూం+మీల్స్ ఫ్రీ. చదువు లేకున్నా జాబ్ సంప్రదించండి. ✆ 9550082383

సిగరేట్ సేల్స్‌మెన్‌గా పనిచేయుటకు ఉత్సాహవంతులు సంప్రదించగలరు. sub: wo బాలజీ డిస్ట్రిబ్యూటర్ (ITC) Dealer బైపాస్ రోడ్, జగిత్యాల. కనీస జీతం నెలకు 10,000/-,పైన సంపాదన. Cell: 98491 14378.

హుజురాబాద్ వరంగల్ రోడ్ HP పెట్రోల్ బంకులో పనిచేయుటకు 3-హెల్పర్స్, 2-క్యాషియర్స్, నైట్‌వాచ్‌మెన్ కావలెను. బంకు నుండి 20 కి.మీ పరిదిలోపువారు కావలెను. సంప్ర: 94938 85345.

MARKETING / SALES

J.S.R. గ్రూప్ సన్‌సిటీ యాదగిరిగుట్ట, వరంగల్ హైవేలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+కమీషన్+ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. Ph: 7799893899

DRIVERS

లైఫ్ స్టయిల్ ఫర్నీచర్స్ శనివారం వీక్లీ మార్కెట్ కరీంనగర్ నందు పని చేయుటకు డ్రైవర్ కం వర్కర్ బ్యాడ్జి లైసెన్స్ తప్పనిసరి. జీతం 7500/-. ఉచిత వసతి. సెల్: 99498 63130.

TOURS & TRAVELS

Singapore & Malaysia @ 49,999/- Dubai & Abudabi @ 49,999/- Bangkok, Pattaya & Phuket @ 39,999/- Kakani Holidays P.Ltd., ✆ 97016 95555.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



ఉదయనగర్‌లో జలమయమైన రహదారి




సుభాష్‌విగ్రహం వద్ద రోడ్డెక్కిన మురుగు

పెద్దపల్లిలో భారీ వర్షం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లిలో ఆదివారం రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. జిల్లా కేంద్రంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. కూనారం రహదారి సమీపంలో రాజీవ్‌రహదారిపై వరద నీరు ప్రవహించింది. ఎస్‌ఎస్‌గార్డెన్ సమీపంలోని ఉదయనగర్‌లో రహదారిపై చేరిన వరదనీరు సమీపంలోని నివాసగృహాల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద కూడా వరదనీరు రహదారిపై ప్రవహించింది. జెండాకూడలీ, పోలీస్ స్టేషన్, సుభాష్‌విగ్రహం, సాగర్‌రోడ్డుల్లో వరదనీరు రహదారిపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రెండు రోజులుగా పట్టణవాసులకు భరిస్తున్న ఉక్కపోత ఒక్క వర్షంతో ఎగిరిపోయి చల్లదనం నిండుకుంది.

రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కారానికి ఎంపిక

కరీంనగర్ సాంస్కృతికం : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ సంస్కృత పండిత పురస్కారానికి ప్రముఖ సంస్కృతాంధ్ర సాహిత్య పండితుడు, మహాకవి, వాచస్పతీ పురస్కార గ్రహీత శ్రీభాష్యం విజయసారథి ఎంపికయ్యారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో ఈనెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకోనున్నారు. విజయసారథి ఎనిమిదేళ్ల వయసు నుంచే కవిత్వం రాస్తున్నారు. ఈయన మందాకిని, భారత భారతి, శబరీ పరిదేవనమ్ వంటి శతాధిక గ్రంథ రచనలు చేశారు. ఓ వైపు సంస్కృత సాహిత్య సేవ చేస్తూనే సమాజ సేవకు సనాతన ధార్మిక విజ్ఞాన పరంపరకు పునరంకితమయ్యారు. 36 సంవత్సరాలు వరంగల్ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలు సాహితీ సంస్థలు, కవులు, రచయితలు, సర్వవైదిక సంస్థానం కార్యవర్గ సభ్యులు, సాహిత్యాభిమానులు విజయసారథికి అభినందనలు ప్రకటించారు.



శ్రీ భాష్యం విజయసారథి

సరస్వతీ సుతోత్తంసులుగా కీర్తి : సరస్వతీ పుత్రులుగా, సంస్కృత పండితులుగా, అర్ష ధర్మ సంస్కృతిని ముందుకు తీసుకెళ్తున్న శ్రీభాష్యం విజయసారథి సరస్వతీ సుతోత్తంసులుగా కీర్తింపబడ్డారని, అలాంటి వ్యక్తి రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం అందుకోవడం జిల్లాకే గర్వకారణంగా సమైక్య సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, కె.ఎస్.అనంతాచార్య పేర్కొన్నారు. పురస్కారం రావడంపై డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, వేణుశ్రీ, డాక్టర్ బి.వి.ఎన్.స్వామి, డాక్టర్ అడువాల సుజాత, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, పద్యకవితా సదస్సు రామక విఠల్‌శర్మ, రాజరాంమోహన్ శర్మ, వివిధ సంస్థలు అభినందనలు తెలిపాయి.

వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

కరీంనగర్ విద్యా విభాగం, న్యూస్‌టుడే : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టుల ఆధారిత కుటుంబ సభ్యుల ఆరోగ్య పథకంలో భాగంగా వైద్య సేవలను అందించేందుకు కరీంనగర్ జిల్లాలో వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ, తెలంగాణ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌కు వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కె.లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. మెరుగైన వైద్యం అందించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని, దీని ఏర్పాటుతో చాలా మందికి ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే కరీంనగర్‌లో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లెపాటి వేణుగోపాల్ రావు, పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు క్యాదాసి సారయ్య, జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాతూరి రాజ్‌రెడ్డి, అట్ల శ్రీనివాసర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పీఆర్టీయూ తెలంగాణ సభ్యులు

రెనె ఆసుపత్రి ప్రారంభం

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే : సామాన్యులకు అందుబాటులో అసమాన వైద్యం అనే లక్ష్యంతో కరీంనగర్‌లోని ఇందిరానగర్‌లో అధునాతనంగా ఏర్పాటు చేసిన రెనె ఆసుపత్రిని ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కె.లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన ఆసుపత్రిలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను మంత్రులు లక్ష్మారెడ్డి, జోగు రామన్న, ఈటల రాజేందర్ ప్రారంభించారు. అధునాతన రీతిలో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలు, వైద్యులు, వైద్య పరికరాలు, చికిత్స విధానాలు వంటి వాటిని పరిశీలించి ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులకు ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా స్వాగతం పలికింది. కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి, మెట్‌పల్లి ఎమ్మెల్యేలు బొడిగె శోభ, కె.విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, కె.సంతోష్‌కుమార్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ అక్బర్ హుస్సేన్, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, మేయర్ రవీందర్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశం, రెనె ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ బంగారి స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బంగారి రజనిప్రియదర్శిని, వైస్ ఛైర్మన్ పెద్దపల్లి శివరంజన్, సీఈవో రేగులపాటి మహేశ్రావు తదితరులు పాల్గొన్నారు.



రెనె ఆసుపత్రిని ప్రారంభిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

తాయ్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కరీంనగర్ క్రీడావిభాగం : తాయ్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా చల్లా హరిశంకర్, అధ్యక్షుడిగా డాక్టర్ నరేశ్, ఉపాధ్యక్షులుగా సాన రాజన్న, కె.వెంకట రమణారెడ్డి, వి.రామకృష్ణారెడ్డి, బి.పద్మ, ప్రధాన కార్యదర్శిగా చందనం రాజేందర్, కార్యదర్శిగా రాజు, సభ్యులుగా రాజు, డాక్టర్ రాంకిరణ్, వి.శ్రీకాంత్, సలహాదారులు ఎ.దయాకర్, ఎం.నారాయణ రెడ్డి, న్యాయ సలహాదారులుగా సాన చంద్రమోహన్‌లు ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి రాజేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోదావరిఖని, న్యూస్‌టుడే: కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గంగానగర్‌కు చెందిన గుండా సంజీవ్(42) ఈనెల 8న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అతడిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అయిదు రోజులుగా చికిత్స పొందుతున్న సంజీవ్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఇంట్లో భార్య పిల్లలతో తరచూ గొడవపడే సంజీవ్ ఈ నెల 8న అదే మాదిరిగా ఘర్షణ పడ్డాడు. ఎప్పుడూ చనిపోతానని బెదిరించే సంజీవ్ ఆ రోజు కూడా భార్య, పిల్లలను ఇంట్లో ఉంచి బయట గడియపెట్టాడు. అనంతరం రోడ్డుపై ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపు గడియ తీసి కుటుంబ సభ్యులను బయటకు తీసుకువచ్చారు. సంజీవ్‌ను ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

రామగుండం, న్యూస్‌టుడే: రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం ఉదయం గుర్తించారు. గుర్తు తెలియని రైలు నుంచి కింద పడి మృతి చెందాడా? లేక గుర్తు తెలియని రైలు ఢీకొనటం వల్ల చనిపోయాడా? అనేది ఇంకా నిర్ధారణకు రాలేదు. ఉదయం 8.30 గంటలకు రైల్వే పోలీసులకు అందిన సమాచారం మేరకు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి రాఘవపూర్ వెళ్లే రైలు మార్గమధ్యంలో మృతదేహాన్ని గుర్తించారు. కాగా మృతుడికి సంబంధించిన వివరాల కోసం రైల్వే పోలీసులు మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు.

గల్ఫ్‌లో మృతదేహం

కుటుంబ సభ్యుల ఎదురుచూపు



సత్తయ్య ఫొటోతో కుటుంబ సభ్యులు

రామడుగు, న్యూస్‌టుడే: కుటుంబ పోషణ కోసం గల్ఫ్ బాట పట్టిన ఇంటి యజమాని అక్కడే ప్రాణాలు వదలాడని తెలిసి కుటుంబ సభ్యులు తల్లడిల్లి పోతున్నారు. పద్నాలుగేళ్లుగా తండ్రి కోసం ఎదురు చూసిన పిల్లలు కడసారి చూపునకూ నోచుకో లేని పరిస్థితి గ్రామస్థులను కంటి తడిపెట్టిస్తోంది. ఈ సంఘటన రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో జరిగింది. బాధిత కుటుంబీకుల కథనం మేరకు.. పాలమాకుల సత్తయ్య (45)కు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. కుటుంబ పోషణకు 2003 లో ఓమన్ వెళ్లాడు. అక్కడ పని సరిగా లేక పోవడంతో 2008లో కల్లివెల్లి (అక్రమ వలసదారు) అయ్యాడు. దీంతో ఇంటికి రావడం వీలుకాక పోవడంతో నాలుగేళ్ల కిందట జరిగిన పెద్ద కుమార్తె వివాహానికి కూడా ఇంటికి రాలేదు. తరచూ చరవాణిలో మాత్రమే మాట్లాడే వాడు. ఈ క్రమంలో జులై మొదటి వారంలో కూలి పని చేస్తున్న సత్తయ్య భవనం పైకి టైల్స్ ఎత్తుకెళ్తుండగా కిందపడి గాయాలయ్యాయని కానీ చికిత్స చేయించుకోకుండా పనిచేశాడని అక్కడి మిత్రులు లక్ష్మీపూర్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలా దెబ్బలను కూడా లెక్క చేయకుండా పని చేసిన సత్తయ్య అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో సహచరులు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గత నెల 31 న మృతి చెందాడు. కాగా మృతుడు అక్రమ వలసదారు కావడంతో స్వగ్రామం చేరడం కష్టంగా మారిందని అక్కడి సహచరులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు పది రోజులుగా కన్నీటి పర్యంతమవుతున్నారు. కడసారి చూసేందుకైనా సత్తయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని భార్య కనకమ్మ, కుమార్తె శైలజ, కొడుకు రమేష్‌లు వేడుకుంటున్నారు.

కట్నం వేధింపులతో యువతి ఆత్మహత్య

పెళ్లయిన నాలుగు నెలలకే విషాదం



పరమేశ్వరి(పాతచిత్రం)

రామగుండం, న్యూస్‌టుడే: కట్నం వేధింపులు భరించలేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అంతర్గాం మండలం ముర్మూరులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా ముల్కల్ల గ్రామానికి చెందిన పెసరి పరమేశ్వరి(21)కి అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో ఏప్రిల్ 21న వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.3 లక్షల కట్నంతో పాటు 5 తులాల బంగారం ఇచ్చారు. పెళ్లి అనంతరం అదనంగా మరింత కట్నం కావాలని భర్త, అత్తమామలు వేధింపులకు పాల్పడ్డారు. రూ.60 వేలు అదనంగా తెస్తేనే ఇంట్లో ఉండనిస్తామని వేధించారు. ఈ విషయమై పరమేశ్వరి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. ఈ క్రమంలో శనివారం రాత్రి వేధింపులు ఎక్కువ కావటంతో ఆదివారం ఉదయం ఆమె పురుగుల మందు తాగి అపస్మారస్థితికి వెళ్లింది. వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అదనపు కట్నం కోసం వేధించటం వల్లనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని పరమేశ్వరి తండ్రి బోండ్ల రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు అంతర్గాం ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. వేధింపులకు పాల్పడ్డ భర్త లక్ష్మణ్, అత్తమామలు కొమురమ్మ, రాజయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

పురుగుల మందు తాగి యువకుడిఆత్మహత్య

ముస్తాబాద్, న్యూస్‌టుడే: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు నామాపూర్ గ్రామానికి చెందిన బనుక అనురాధ-రాజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అనిల్ (25) ఓ రైస్‌మిల్లులో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమెకు పెళ్లినిశ్చయం కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. గ్రామ శివారులో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన వారు గమనించి బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధిత బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య



ఖాసీం (పాతచిత్రం)

మల్లాపూర్, న్యూస్‌టుడే: అప్పుల బాధ భరించలేక మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రైతు గుజ్జుల ఖాసీం(45) ఆదివారం మధ్యాహ్నం పంటచేలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మల్లాపూర్ ఎస్సై సతీష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కొద్ది సంవత్సరాలుగా బతుకుదెరువుకు దుబాయి వెళ్తున్న ఖాసీం ఏడాది కాలంగా ఇంటివద్దనే ఉంటున్నాడు. వ్యవసాయభూమిని చదును చేయించడంతో పాటు కూతురు పెళ్లికి చేసిన అప్పులు తీర్చే మార్గంలేక మానసిక వేదనకు గురై ఉదయం వ్యవసాయ చేలోకి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడు. మధ్యాహ్నం రెండు గంటలైనా తిరిగి రాకపోవడంతో చేలోకి వెళ్లి చూడగా పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు తెలిపారు. భార్య భూమక్క ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

బాలికపై అత్యాచారం

ఆలస్యంగా వెలుగులోకి.. కేసు నమోదు

రాయికల్, న్యూస్‌టుడే: బాలికపై గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కట్కాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన కుటుంబంతో కలిసి ఉపాధి నిమిత్తం తాట్లవాయి గ్రామంలోని మోతిలాల్ తండాలో నివసిస్తోంది. సదరు మహిళ కూతురు(16) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువుకుటోంది. ఈనెల 11న శుక్రవారం పాఠశాలకు వెళ్లి తిరిగివస్తుండగా గ్రామానికి చెందిన నందగిరి గోపాల్(28) అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై బలవంతంగా గ్రామ శివారులోనికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఇంటికి వెళ్లిన బాలిక తల్లితో చెప్పగా గ్రామంలోని యువకుడిని గ్రామ పెద్దలు నిలదీశారు. యువకుడిపై చర్యలు శూన్యం కాగా ఆదివారం ఆలస్యంగా ఈ విషయంపై బాధితురాలి కుటుంబ సభ్యులు రాయికల్ ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రికి వ్యతిరేకంగా జిల్లా ఫోరం తీర్పు

కరీంనగర్ న్యాయ వార్తలు, న్యూస్‌టుడే : కరీంనగర్‌లోని నగునూర్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు ప్రసూతి కోసం వచ్చిన మహిళకు సరైన వైద్యసేవలు అందించడంలో విఫలమయ్యారని జిల్లా ఫోరం ఆస్పత్రికి వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. ఫిర్యాదు కథనం మేరకు.. కరీంనగర్‌లోని శర్మనగర్‌కు చెందిన మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి ఆస్పత్రికి వెళ్లి వైద్యుల సలహామేరకు మందులు వాడింది. కొన్ని సార్లు ఆమెలో మార్పులు వచ్చినప్పటికీ.. పరీక్షలు నిర్వహించక, సరైన మందులు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రసూతికి సంబంధించి ఆపరేషన్ నిర్వహించాలని.. లేదంటే హాని జరుగుతుందని ఆస్పత్రి వైద్యురాలు తెలుపడంతో మహిళా కుటుంబీకులు ఒప్పుకున్నారు. 2007, సెప్టెంబర్ 10న అపరేషన్ జరుగగా ఆ మహిళ పాపకు జన్మనిచ్చింది. మరుసటి రోజు నుంచి మహిళ ఆరోగ్యంలో మార్పులు వచ్చి ప్రమాదానికి దారితీసే పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండో రోజు మహిళను పరీక్షించిన వైద్యులు వెంటనే హైదరాబాద్ తరలించాలని, ఆరోగ్యం విషమంగా మారిందని తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. కరీంనగర్ ఆస్పత్రిలోని వైద్యులు సరైన పరీక్షలు నిర్వహించక, సకాలంలో మందులు ఇవ్వక నిర్లక్ష్యం వహించారని, అందుకే ఆరోగ్యం విషమంగా మారిందని యశోద ఆస్పత్రిలోని వైద్యులు తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఆస్పత్రి ఖర్చులు, మందులకు ఖర్చు అయిందని, మానసిక క్షోభకు గురైనట్లు మహిళ పేర్కొన్నారంటూ న్యాయవాది గుండి రాములు ద్వారా జిల్లా ఫోరంలో కరీంనగర్ ఆస్పత్రి సంబంధిత వైద్యురాలిపై ఫిర్యాదు దాఖలు చేసింది. ప్రసూతి తర్వాత మహిళ రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గాయని, మొదటి నుంచి ఆమెకు ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేదని కరీంనగర్ ఆస్పత్రివర్గాలు పేర్కొన్నాయి. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ఫోరం అధ్యక్షురాలు కె.స్వరూపరాణి, సభ్యులు ప్రవీణ్‌కుమార్ ఆస్పత్రి సేవలలో లోపం జరిగిందని పేర్కొంటూ.. ఆస్పత్రి, మందుల ఖర్చుల కింద రూ.2.50 లక్షలు నష్టపరిహారంగా, రూ.25 వేలు ఫిర్యాదు ఖర్చుల కింద, ఐదు వేలను ఆస్పత్రి సంబంధిత వైద్యురాలు వెంటనే ఫిర్యాదుదారైన మహిళకు చెల్లించాలని తీర్పు చెప్పారు.

పుణ్య గోదావరి.. శ్రావణ ఝరి



రామునిగుండాల కొండపై భక్తుల శ్రావణమాస పూజలు

- చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు నిలయం
- రామగుండంలో అలరిస్తున్న రమణీయ క్షేత్రాలు

గలగలా పారే గోదావరి.. కట్టిపడేసే జలాశయ అందాలు.. రామునిగుండాల జలపాత సవ్వడులు.. పురాతన ఆలయాల శిల్ప సోయగం.. చుట్టూ పచ్చటి ప్రకృతి రమణీయత మధ్య రామగుండం పరిసర ప్రాంతాలు ఆహ్లాదానికి నిలయంగా మారాయి.. గోదావరి పరీవాహక ప్రదేశాలు, ఇక్కడి దేవస్థానాలు ప్రస్తుతం శ్రావణ శోభను సంతరించుకున్నాయి.. ప్రకృతి అందాలను తిలకించేందుకు పారిశ్రామిక ప్రాంత ప్రజలు కొండపైకి తరలివస్తున్నారు.. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆనకట్టకు దిగువన ఉత్తరవాహినిగా ప్రవహించే ప్రశస్థమైన నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ చారిత్రక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.. ఈ నేపథ్యంలో ఇక్కడి చారిత్రక, ఇతిహాస, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల ప్రదేశాల అక్షర సందర్శనమిది..

- న్యూస్‌టుడే, రామగుండం

శ్రీరామ పాదం.. ప్రకృతి సోయగం

వనవాస సమయంలో శ్రీరాముడు అబాది రామగుండం వద్ద గోదావరి నదిని దాటి సమీపంలోని కొండపైన కొంతకాలం ఉన్నారని ఈ ప్రాంత వాసులు చెప్పుకుంటారు. కొండపై రాముడు ఏర్పాటు చేసినట్లుగా చెప్పుకొనే 101 గుండాలు ఇక్కడ ఉన్నాయి. రామునిగుండాలతోనే ఈ ప్రాంతానికి రామగుండంగా పేరొచ్చింది. కొండపై రాముని పాదాలు, సీతమ్మ కొలను, యమకోణంతో పాటు లోయలు, పలు ఆలయాలున్నాయి. ఇక్కడి గుండాల్లో భక్తులు స్నానాలు చేస్తుంటారు. కొండపై ఉన్న గుడుల్లో దేవతలకు పూజలు నిర్వహిస్తుంటారు. కొండపై ఉన్న జలపాతాలు నయాగరా అందాలను తలపిస్తాయి. వర్షాలతో కొండ ప్రాంతమంతా పచ్చని చెట్లతో శోభాయమానంగా మారింది. ప్రకృతి అందాలను తిలకించేందుకు పారిశ్రామిక ప్రాంతం నుంచి నిత్యం సందర్శకులు వస్తుంటారు. ఆహ్లాదకరంగా ఉన్న కొండపై విహరిస్తుంటారు.



ఎల్లంపల్లి జలాశయం వద్ద సందర్శకులు




ఎల్లంపల్లి జలాశయం

కట్టి పడేసే 'జల' దృశ్యం

అంతర్గాం మండలం మూర్మూర్ గ్రామ సమీపంలో నిర్మించిన శ్రీపాదసాగర్(ఎల్లంపల్లి) జలాశయం జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు వద్దకు వెళ్తే కనుచూపు మేర అగుపించే జల దృశ్యం సందర్శకులను కట్టిపడేస్తుంది. జలాశయ అలల కదలికలు చూపరుల మదిలో ఆనంద డోలికలు ఊగిస్తుంటాయి. చుట్టూ చల్లటి వాతావరణం, ప్రకృతి ఒడిలో పచ్చని తివాచీలా కనిపించే పరిసరాల్లో గడపడానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలివస్తుంటారు. ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న మామిడితోట, పార్కులతో పాటు కరకట్టల మీద పెరిగిన పచ్చదనంపై సేద దీరుతున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ఇక్కడి సుందర దృశ్యాలను కెమెరాల్లో, చరవాణుల్లో బంధిస్తుంటారు.

ఉత్తర వాహిని.. పుణ్య ప్రదాయని

అంతర్గాం మండలంలో పొట్యాల దాటే వరకు దక్షిణ దిశగా ప్రవహించి అనంతరం మూర్మూర్ చేరుకునే సమయంలో ఉత్తర దిశకు, మళ్లీ తూర్పు దిశకు గోదావరి నది ప్రవహిస్తుంటుంది. ఉత్తర వాహినిగా గోదావరి ఇక్కడ ప్రవహిస్తున్నందునపూర్వకాలంలో మునులు కుటీరాలు ఏర్పాటు చేసుకొని తపస్సు చేసేవారని చెప్పుకుంటారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని మునిపురమని పిలిచేవారని, నాటి మునిపురమే నేటి మూర్మూర్ అని జనప్రతీతి. ఎల్లంపల్లి ఆనకట్ట దిగువన ఉత్తరం దిక్కున నది ప్రవహిస్తుంది. ఎల్లంపల్లి డ్యాం సందర్శనతో పాటు ఉత్తరవాహినిలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు. ఒడ్డున ఉన్న శివాలయంతోపాటు మూర్మూర్ పునరావాస కాలనీలో ఇటీవల నిర్మించిన శ్రీచెన్నకేశవస్వామి, శ్రీపాతాళేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.



కొండ పైనుంచి గుండాల్లోకి పారుతున్న జలపాతాలు

చారిత్రక శిల్ప కళకు వేదిక


గోదావరి తీర గ్రామాలైన జనగామ, అబాది రామగుండం, రాయదండి, మూర్మూర్, పొట్యాల గ్రామాల్లోని చారిత్రక ఆలయాల్లో భక్తులు శ్రావణ పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామాల పక్క నుంచి పారే గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి దేవస్థానాలను సందర్శిస్తున్నారు. అబాది రామగుండంలో శాతవాహనుల కాలం నాటి వామాంకస్థిత జానకి, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరాముని ఆలయం ఉంది. ఈ ఆలయ గర్భగుడిలో అనంత పద్మనాభస్వామి కొలువై ఉండటం విశేషం. ఆలయం ఎదుట రాతి మకర తోరణం, గరుడస్తంభం ఉంది. పక్కనే ఉన్న రాయదండిలో 11, 12వ శతాబ్దాల కాలంలో కాకతీయులు నిర్మించిన శ్రీచిలుక రామేశ్వరాలయంలో పెద్ద శివలింగం ఉంది. ఆలయంలోని శైవ ద్వారపాలకులు, నంది, విఘ్నేశ్వరుడు, పార్వతీ, నాగదేవత, అంజనేయస్వామి విగ్రహాల శిల్ప కళా వికాసం కనిపిస్తాయి. ఈ గ్రామాల్లోని పలు పురాతన శివాలయాలతో పాటు పొట్యాల, మూర్మూర్‌లలోని పురాతన ఆలయాల్లో భక్తులు పూజలు చేస్తారు.

త్రిలింగేశ్వరాలయం.. మహాక్షేత్రం

నదీ తీరంలోని జనగామ గ్రామంలో శ్రీత్రిలింగేశ్వరాలయం ఉత్తర ముఖం కలిగి ఉంది. మూడు గర్భగుడుల్లో ముక్కంటిని దర్శించుకోవచ్చు. ఆలయంలోని రంగమంటపానికి 16 స్తంభాలున్నాయి. ఆలయం పడమర వైపున శిథిలమైన మరో ఆలయం, ఎదురుగా మరో త్రికూటాలయం ఉన్నాయి. చాళుక్యులు, కాకతీయుల కాలంలో ఈ ప్రదేశం మహాక్షేత్రంగా విలసిల్లిందని ప్రతీతి. గోదావరిలో పుణ్యస్నానాల అనంతరం భక్తులు ఇక్కడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

పర్యాటక శోభితం

గోదావరిపై నిర్మించిన అంతర్గాం రైల్వే వంతెన, గోదావరిఖని గంగానగర్ రోడ్డు వంతెనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గోదావరి ఒడ్డున, రామునిగుండాల కొండపై ఉన్న జెన్‌కో, సింగరేణి పంపుహౌజ్‌లు పర్యాటక కేంద్రాలుగా మారాయి. శ్రావణమాసం కావడంతో పరిసర ప్రాంత ప్రజలు కుటుంబాలతో కలిసి ఇక్కడికి వస్తున్నారు. బసంత్‌నగర్ సమీపంలోని బుగ్గ గుట్ట ప్రదేశంలోని బుగ్గ రామేశ్వరాలయంలోనూ భక్తులు శ్రావణ పూజలు చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి విడిది చేస్తున్నారు. వన భోజనాలు చేస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడుపుతున్నారు.



జనగామలోని త్రిలింగేశ్వరాలయం

సంఘటితం.. స్వచ్ఛ పథం



ప్రైవేటు పాఠశాలను తలపిస్తున్న తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల భవనం



ఆవరణలో పెంచుతున్న కూరగాయల తోట

- బాలల బృందాలతో బడిలో క్రమశిక్షణ
- మొక్కల పెంపకం, ఉత్తమ బోధనలో గుర్తింపు
- సర్కారు విద్యాలయాలకు తిమ్మాపూర్ పాఠశాల స్ఫూర్తి

ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థుల సమష్టి కృషికి ఆ పాఠశాల నిలువెత్తు నిదర్శనం. హరితహారం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలకు అక్కడ ఎప్పుడో అడుగులు పడ్డాయి. సంఘటిత కృషిలో స్ఫూర్తిగా నిలుస్తున్న ఆ బడి ప్రగతికి నడకలు నేర్పుతోంది.

న్యూస్‌టుడే, ధర్మపురి

ధర్మపురి మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 132 మంది విద్యార్థులున్నారు. వీరిని వివిధ సంఘాలుగా విభజించగా పాఠశాల అభివృద్ధిలో వారు మమేకమవుతున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్న ఈ బడిలో మొక్కల పెంపకాన్ని బాలల సంఘాలే చేపట్టడం విశేషం. ఆరు సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ, తరగతి గదుల పరిశుభ్రత, స్వచ్ఛభారత్ కార్యక్రమం, మొక్కల సంరక్షణలో విద్యార్థులు పూర్తి స్థాయిలో చొరవ తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులు రాజయ్య పాఠశాలలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మొక్కల పెంపకానికి శ్రద్ధ చూపుతున్నారు. గత రెండేళ్లలో 400 మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలోనూ నీరందించడంతో రెండేళ్లలోనే ఏపుగా పెరిగి ఆవరణలో పచ్చదనం వెల్లివిరుస్తోంది.

బాలల సంఘాలతో ప్రగతికి బాటలు

పాఠశాలలో ఆరు బాలల సంఘాలు ఏర్పాటు చేశారు. క్రియాశీలకంగా ఉండే విద్యార్థులను తీసుకొని నిత్యం ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో సంఘంలో దాదాపు 10 మంది విద్యార్థులుండగా ఒక నాయకుడి ఆధ్వర్యంలో పని చేస్తున్నారు. స్వచ్ఛభారత్, తాగునీటి సరఫరా, హరితహారం, క్రమశిక్షణ, గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ, ఇతరత్రా పనులను ఈ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. పాఠశాలలోని గ్రంథాలయంలో 1100 పుస్తకాలున్నాయి. సాయంత్రం వేళలో తరగతుల వారీగా విద్యార్థులు చదివేలా చేస్తుండగా గ్రూపుల వారీగా, తరగతుల వారీగా, స్థాయిల వారీగా గ్రంథాలయాన్ని విద్యార్థులే నిర్వహించుకుంటున్నారు. సైన్సు ల్యాబ్‌లు కూడా వినూత్నంగా, ప్రయోజనకరంగా, విద్యార్థులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు కూడా బాలల సంఘాలే తోడ్పాటు అందిస్తున్నాయి. వంద శాతం విద్యార్థులు భోజనం చేసేలా చర్యలు తీసుకుంటుండగా తరగతి ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం వహిస్తున్నారు.

చదువులోనూ చిచ్చరపిడుగులు

ఎన్‌జీసీ కార్యక్రమాల నిర్వహణకు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదుల బాక్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాఠశాలలో ఏదైనా సమస్యలుంటే ప్రధానోపాధ్యాయుల దృష్టికి తేవడానికి ఇది దోహదపడుతోంది. వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా తరగతుల వారీగా ప్రతి విద్యార్థి స్వచ్ఛందంగా స్వచ్ఛతకు బాటలు వేస్తున్నారు. తెలుగు భాషాభివృద్ధికి తెలుగు పండితులు శివప్రసాద్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది పదో తరగతిలో పాఠశాలలోని ఎనిమిది మంది విద్యార్థులు తెలుగులో 10/10 జీపీఏ సాధించడం విశేషం. 8, 9, 10 తరగతుల విద్యార్థులు సొంతంగా కవితలు, వ్యాసాలు రాస్తూ, ఉపన్యాస, వ్యాఖ్యాన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ బడి విద్యార్థుల్లో చాలా మంది నరసింహ శతకం పద్యాలు మొత్తం కంఠతా వస్తాయి. గతేడాది జిల్లా స్థాయి పద్య రచన పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఉత్తమ పురస్కారాలు దక్కాయి.



గోడలపై ఆకట్టుకునేలా వేసిన చిత్రాలు

ఆవరణలో తాజా కూరలు

పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో చిక్కుడు, బెండ, టమాట, ఆకు కూరలు, మిర్చి ఇలా వివిధ రకాల కూరగాయ మొక్కలను పెంచుతూ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకానికి వాడుతున్నారు. నిత్యం సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కూరగాయలకు నీరు పోయడం బాధ్యతగా భావిస్తారు. తిమ్మాపూర్ వాసి, వరంగల్‌లో వైద్య వృత్తిలో స్థిరపడిన డా. శ్యామంతుల విజయలక్ష్మి పాఠశాల విద్యార్థుల కోసం 2012-13లో సుమారు రూ. 1 లక్ష వ్యయంతో ప్రత్యేకంగా వేదిక నిర్మించారు. జాతీయ పర్వదినోత్సవాలు, ఇతర వేడుకల సందర్భంగా ఇది ఉపయోగపడుతోంది. గ్రామస్థులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాల ఆవరణ పక్కనే గల తాగునీటి బావికి రక్షణ గోడను నిర్మించారు. గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. అత్యధికంగా బండపల్లి అఖిల, పరమాండ్ల రేవతి 9.2 జీపీఏ సాధించగా మొత్తమ్మీద 98 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలో మరో నాలుగు గదుల అవసరం ఉంది. ఇటీవలే డిజిటల్ తరగతులను కూడా ప్రారంభించారు.

సహకారం అందిస్తే మరిన్ని విజయాలు

రాజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు



గ్రామస్థులు, యాజమాన్య కమిటీ, ప్రజాప్రతినిధుల సహకారంతో తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నాం. మొక్కలను విరివిగా పెంచడానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం. గత రెండేళ్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటగా సంరక్షణ బాధ్యతలను సమష్టిగా తీసుకుంటున్నాం. కూరగాయల మొక్కలతో మధ్యాహ్న భోజన పథకంలో తాజా కూరలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామస్థులు సహకరిస్తే మరిన్ని విజయాలు సాధించేలా సమర్థవంతంగా చర్యలు తీసుకుంటాం.


ప్రగతి వీచిక.. ప్రచార దీపిక

- సింగరేణి సమాచార వ్యవస్థకు జాతీయ స్థాయి పురస్కారాలు
- ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ రంగ సంస్థలకే ఆదర్శం

న్యూస్‌టుడే, గోదావరిఖని

బొగ్గు ఉత్పత్తి.. కార్మికుల సంక్షేమం.. పర్యావరణ పరిరక్షణ.. ప్రభావిత గ్రామాల్లో సామాజిక బాధ్యత కార్యక్రమాల నిర్వహణ.. ఈ అంశాలకే పరిమితం కాకుండా సింగరేణి సమాచార మాధ్యమాల ద్వారా సంస్థ అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ఉద్యోగులు, ప్రజలను చైతన్యపరచడంలోనూ ముందుంటోంది. సంస్థలో చేపట్టే ప్రతి అంశాన్నీ కథనంగా మలిచి రెండు రోజులకోమారు 'సింగరేణి సమాచారం' పత్రిక ద్వారా, ప్రతి వారం 'సింగరేణి స్రవంతి' పేరిట టీవీ ధారావాహికలోనూ ప్రసారం చేస్తోంది. సామాజిక బాధ్యతతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు చేస్తున్న ఈ కృషికి ఈ ఏడాది జాతీయ స్థాయిలో ప్రజా సంబంధాల విభాగంలో నాలుగు పురస్కారాలు వరించాయి. వీటితో పాటు సింగరేణి క్యాలెండర్ జ్యూరీ అవార్డు దక్కించుకుంది. సింగరేణి సమాచారం, సింగరేణి స్రవంతిలకు జాతీయ స్థాయి అవార్డులు రావడం ఇది వరుసగా రెండోసారి.

56 ఏళ్ల నిరంతర సమాచార ప్రక్రియ



సింగరేణీయుల సమాచారం ద్వైమాస పత్రికలు

వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణి, కార్మికుల్లో సంస్థ పట్ల పారదర్శకత పెంపొందించడానికి 1961లో 'సింగరేణి సమాచారం' పత్రికను ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి రెండు నెలలకోసారి వచ్చే పత్రిక ద్వారా కొత్త కొత్త అంశాలను పొందుపరుస్తున్నారు. సంస్థ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, పురోగతి.. కార్మికుల సంక్షేమం.. రక్షణ.. బొగ్గు ఉత్పత్తి అంశాలపై కథనాలు ప్రచురిస్తున్నారు. 24 పేజీలతో 55 వేల ప్రతులను ముద్రిస్తుండగా పత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా, కమ్యూనికేషన్ అధికారి గణాశంకర్ పూజారీ, పర్యవేక్షణ ఎడిటర్‌గా, ప్రజా సంబంధాల అధికారి బి.మహేశ్, చీఫ్ ఎడిటర్‌గా జీఎం జె.నాగయ్య వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా సింగరేణి బీఐఎఫ్ఆర్‌కు నివేదించిన సమయంలో పత్రిక ద్వారా కార్మికుల్లో చైతన్యం తేవడానికి దోహదపడింది. సంస్థ ఆర్థిక పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రచురిస్తుండటంతో సంస్థ పట్ల కార్మికుల్లో అంకిత భావం పెరిగింది. దీంతో వారు మరింత కష్టపడి పని చేయడంతో బీఐఎఫ్ఆర్ నుంచి బయటపడింది. హౌజ్ జర్నల్ విభాగంలో ఈ పత్రికకు భారత ప్రజా సంబంధాల సంస్థ ఇటీవల నాలుగు ఉత్తమ జాతీయ స్థాయి పురస్కారాలు అందజేసింది. న్యూస్‌లెటర్, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచురించిన అంశాలకు అవార్డులు వరించాయి. పరిసర గ్రామాలు, కాలనీల్లో సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతులు కల్పించే అంశాలపైనా కథనాలు ప్రచురించి ప్రచారం చేస్తోంది. ప్రభావిత గ్రామాల యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు, అలా శిక్షణ పొంది సొంతంగా ఉపాధి పొందుతున్న యువతపై స్ఫూర్తి కథనాలు కూడా ప్రచురిస్తున్నారు. గనుల్లో ఉద్యోగులు కొత్త అంశాలను ఆవిష్కరించిన సందర్భంలో వారిలో మరింత ఉత్సాహం నింపేందుకు ఈ పత్రిక ఎంతో ఉపయోగపడుతోంది.



అవార్డు అందుకుంటున్న వర్కింగ్ ఎడిటర్ గణాశంకర్ పూజారీ

టీవీ కార్యక్రమాలతో మరింత చేరువ

సింగరేణి చేపట్టే సంక్షేమ కార్యక్రమాలపై కేవలం పత్రిక ద్వారానే కాకుండా ప్రసార మాధ్యమం ద్వారా ప్రచారం చేస్తోంది. సంస్థలో చేపట్టే కార్యక్రమాలను ప్రతి వారం అరగంట పాటు ప్రసారం చేస్తున్నారు. 2006 మే 1న ప్రారంభించిన 'సింగరేణి స్రవంతి' కార్యక్రమం మొదట్లో మన టీవీ ద్వారా ప్రతి ఆదివారం ఉదయం సమయంలో ప్రసారమయ్యేది. సింగరేణి ప్రజా సంబంధాలు, కమ్యూనికేషన్ విభాగాల ఆధ్వర్యంలో అరగంట నిడివి ఉన్న న్యూస్ బులిటన్ మాదిరిగా వస్తోంది. సంస్థ పనితీరు.. సంక్షేమం.. సామాజిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడింది. మన టీవీ తర్వాత దూరదర్శన్ సప్తగిరి ఛానల్, ప్రస్తుతం టీ-న్యూస్‌లో ప్రతి ఆదివారం ఉదయం అరగంట పాటు సింగరేణి కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి. ఈ క్రమంలోనే భారత ప్రజా సంబంధాల సంస్థ 'సింగరేణి స్రవంతి'కి రెండు జాతీయ స్థాయి అవార్డులు అందజేసింది. ఉత్తమ కార్పొరేట్ ఫీచర్, ఉత్తమ డైరీల విభాగాల్లో ఈ పురస్కారాలు దక్కాయి. ఇప్పటివరకు 580 భాగాలు ప్రసారం కాగా సంస్థ ప్రగతితో పాటు సంక్షేమం.. రక్షణ, సామాజిక బాధ్యత అంశాలపై కమ్యూనికేషన్ అధికారి గణాశంకర్ పూజారీ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. దీనికి వ్యాఖ్యాత కూడా ఆయనే.

ఇప్పటివరకు దక్కిన అవార్డులు

- 2014 : ఉత్తమ హౌజ్‌జర్నల్
- 2015 : ఉత్తమ ఇన్‌హౌస్ లెటర్
- 2016 : ఉత్తమ సీఎస్ఆర్ పత్రిక
- 2017 : జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రజా సంబంధాలు(అయిదు అవార్డులు)

కలం పట్టినా.. కళ్లకు కట్టినా!

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

రచయితగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞ

క్రీడాకారుడిగానూ రాణిస్తున్న సింగరేణి విశ్రాంత కార్మికుడు

రచయితగా.. దర్శకుడిగా.. నటుడిగా.. క్రీడాకారుడిగా.. బహుముఖ ప్రజ్ఞ కనబరుస్తున్నారు గోదావరిఖనికి చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు దామెర శంకర్. స్థానిక పరిస్థితులను కళ్లకు కట్టేలా జానపద గేయ రచన నుంచి సంక్షిప్త చిత్రాల కథలు రూపొందించడం వరకు ఆయనకు ఆయనే సాటి. అటవీ ప్రాంతాల్లోని కోయదొరల పూజా విశేషాలపై 'కొండ దేవరా... నిన్ను కొలిచేమమ్మా..' జానపద నృత్య రూపకం 18 సార్లు రాష్ట్ర స్థాయి బహుమతులను అందుకోవడమే శంకర్ ప్రతిభకు నిదర్శనం. సముద్ర తీరాల్లో జాలరుల స్థితిగతులపై రచించిన 'తెలతెలవారింది... రేవుకెళ్దాం రారో... చేపల్లి తెద్దాం రారో' నృత్య రూపకం 'వంశీ బర్కిలి' రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఒకప్పుడు పాఠశాలల్లో జరిగే వార్షికోత్సవాలతో పాటు పలు సందర్భాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శించే అత్యధిక గేయాలు శంకర్ కలం నుంచి జాలువారినవే కావడం విశేషం.

సందేశాత్మక చిత్రాలే లక్ష్యం

కార్మికుడిగా సింగరేణి సంస్థ ప్రోత్సాహంతో కార్మికుల ప్రయోజనాలు, రక్షణకు సంబంధించి శంకర్ పలు సంక్షిప్త చిత్రాలను రూపొందించి పలువురి మన్ననలు అందుకున్నారు. సంస్థకు సంబంధించి గోల్డెన్ హేక్‌హ్యాండ్, పరిసరాల పరిశుభ్రత, నాగాల నాగన్న, తనదాక వస్తే, చిన్న తప్పుకు పెద్ద శిక్ష లాంటి లఘుచిత్రాలెన్నో రూపొందించారు. ఈయన రూపొందించిన 'సాగరతీరం' 13 ఎపిసోడ్లు, 'ఇంకెవర్ని నమ్మాలి' 19 ఎపిసోడ్లు స్థానిక కేబుల్ టీవీలో ప్రసారమై ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. నటనాభిలాష కలిగిన స్థానిక యువతతోనే ఆయన లఘు చిత్రాలను రూపొందిస్తుంటారు. సామాజిక భద్రతకు సంబంధించిన లఘు చిత్రాలు సైతం రూపొందించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగించేందుకు 'జరభద్రం బిడ్డో', ద్విచక్రవాహనదారులకు శిరస్త్రాణం ఆవశ్యకతపై 'నిర్లక్ష్యం', నిరుద్యోగ యువత పాట్లపై 'నిర్ణయం', గుట్కా, మద్యపానం అనర్థాలపై 'ఇకనైనా మారండి', పచ్చదనం ప్రాముఖ్యతను పెంచేలా 'వృక్షోరక్షతి రక్షితః' తదితర లఘు చిత్రాలను రూపొందించారు. స్థానిక మానసిక వికలాంగుల వృత్తి శిక్షణ కేంద్రం(మనో చైతన్య), శ్రీధర్మశాస్త్ర నిత్యాన్నదాన వేదికపై రూపొందించిన లఘు చిత్రాలు పలువురిని ఆలోచింపజేశాయి. నిత్య జీవితంలో హాస్యానికి ఎంతో ప్రాధాన్యత ఉందంటూ అనేక హాస్య సన్నివేశాలతో 'సరదాగా కాసేపు నవ్వుకుందాం' సీడీని రూపొందించారు. పలు మార్లు ఉత్తమ దర్శకునిగా పురస్కారాలు అందుకున్న శంకర్ 'నెష్టా' పోటీల కోసం రచించి దర్శకత్వం వహించిన 'స్వాతంత్ర్యం వచ్చిందెవరికీ...' పలువురి ప్రశంసలు అందుకుంది.



అవార్డులతో దామెర శంకర్

నటనతోనూ మెప్పించి..

లఘు చిత్రాలను రూపొందించి దర్శకత్వం వహించడమే కాకుండా, అవసరాన్ని బట్టి ఆయా చిత్రాల్లోని ప్రధాన పాత్రల్లో శంకర్ నటనలో జీవిస్తున్నారు. 1958లో విద్యార్థి దశలోనే జిల్లా స్థాయి నాటక పోటీల్లో రెండు సార్లు ఉత్తమ, వరంగల్ జోనల్ స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. అనేక ఒత్తిళ్లలో జీవనం సాగిస్తున్న సింగరేణి కార్మికులతో పాటు స్థానిక ప్రజల్లో మానసికోల్లాసాన్ని కల్గించాలనే లక్ష్యంతో 'స్మైల్ ప్లీజ్' లాఫింగ్ క్లబ్ ఆవిర్భావంలో శంకర్ కీలక పాత్ర పోషించారు. పలు హాస్య సన్నివేశాలతో సీడీని రూపొందించారు. 'శ్రీశైలం', 'పోరు తెలంగాణ' చిత్రాలతో ఈయన సినీ రంగ ప్రవేశం చేశారు. త్వరలో విడుదల కానున్న 'బిచ్చగాళ్లా.. మజాకా...' చిత్రంలోనూ నటించారు.



త్యాగరాయ గానసభలో తనికెళ్ల భరణి చేతుల మీదుగా పురస్కారం

క్రీడాకారుడిగానూ ప్రతిభ

2004లో ఫోర్‌మెన్‌గా ఉద్యోగ విరమణ చేసేవరకు శంకర్ సింగరేణి, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో అనేక బహుమతులు అందుకున్నారు. 1993లో ఆల్ ఇండియా కోల్ ఫీల్డ్ పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. వాలీబాల్ జట్టుకు దాదాపు ఎనిమిదేళ్లు కెప్టెన్‌గా వ్యవహరించారు. పలుమార్లు ఛాంపియన్‌షిప్ సాధించారు. రెండేళ్ల క్రితం కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న శంకర్ డిస్కస్‌త్రోలో రాష్ట్ర స్థాయి ప్రథమ, షాట్‌పుట్‌త్రో, జావెలిన్‌త్రోలో ద్వితీయ బహుమతులను అందుకున్నారు.

సర్కారు వైద్యానికి హంగులు...

మెట్‌పల్లి ఆసుపత్రిలో మెరుగుపడుతున్న సేవలు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు కొంతపుంతలు తొక్కుతున్నాయి. రోగులకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టింది. రోగుల సపర్యలకు సంరక్షకులను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. జిల్లా ఏరియా ఆసుపత్రిలో గత కొంత కాలంగా రోగికి సంరక్షలు సేవలు అందిస్తుండగా ఇటీవల మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రిలోనూ రోగికి సంరక్షకులను నియమించారు. రోగులకు సేవలు చేయడానికి ఆసుపత్రిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళా రోగులను సంరక్షకులను నియమించారు. పారిశుద్ధ్యానికి పదిమంది ప్రత్యేక కార్మికులు, ఆసుపత్రి రక్షణకు నలుగురు సెక్యూర్టీ గార్డులను నియమించింది. ఆసుపత్రి రూపు మార్చుకొంటుంది. ఆసుపత్రిపై విశ్వాసం పెరగడంతో రోజు రోజుకు చికిత్సల కోసం వచ్చే రోగులు, కేసీఆర్ కిట్ వల్ల ప్రసవాల సంఖ్య పెరుగుతోంది.


మెట్‌పల్లి ఆసుపత్రిలో సేవలందిస్తున్న రోగి సంరక్షకులు

సేవలు ఇలా..

ఆసుపత్రిలో చికిత్స కోసం చేరిన రోగికి మూత్ర, స్కానింగ్, ఎక్స్‌రే తదితర పరీక్షలకు రోగులకు బంధువులే దగ్గరుండి సపర్యలు చేసుకోవల్సి వచ్చేది. వైద్య సిబ్బంది ముట్టన్నట్లు వ్యవహరించే వారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆసుపత్రిలో తాత్కాలికంగా ప్రయివేట్ ఏజెన్సీ ద్వారా రోగి సంరక్షకులను నియమించింది. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి వెళ్లే వరకు రోగి బాగోగులు చూసుకుంటారు.

* ఆసుపత్రికి రోగి వచ్చిన వెంటనే దగ్గరుండి నిర్ధరణ పరీక్షలుచేయిస్తారు.
* వ్యాధి నిర్ధరణ పరీక్షల ఫలితాలు, ఎక్స్‌రే, స్కానింగ్ గదుల నుంచి తెచ్చి వైద్యులకు చూపుతారు.
* రోగికి ఇంజెక్షన్ చేసేటప్పుడు వైద్య సిబ్బందికి సహాయ పడతారు.
* రోగి మంచంపై కదలేని స్థితిలో ఉంటే వ్యర్థాల తొలగింపునకు, దుస్తులు మార్చడానికి సహాయ పడతారు.
* పారి శుద్ధ్య సిబ్బంది ఆసుపత్రిని, ఆవరణను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తారు.

స్థాయి మెరుగు పడితేనే ప్రయోజనం

ఆసుపత్రి స్థాయి 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా మారిస్తేనే రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రి నాలుగు జిల్లాలకు కూడలిగా ఉండడంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజూ 300 నుంచి 400 మంది ఓపీ పరీక్షలకు వస్తుంటారు. 50కి పైగా చికిత్సలు పొందుతుంటారు. ప్రతి నెల 100కి పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. చికిత్స కోసం ఆసుపత్రికి వస్తుంటారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, మత్తు ఇచ్చే వైద్యుడు, గైనకాలజిస్ట్, పిల్లల, డెంటల్, జనరల్ వైద్యుడు ఆసుపత్రిలో రోగులకు సేవలు అందిస్తున్నారు. రోజు రోజు పెరుగుతున్న ప్రసవాల దృష్ట్యా మరో గైనకాలజిస్టను నియమించాలి. ఎముకలు, కీళ్ల వైద్యుని నియమించాలి. గత కొంత కాలంగా ఎక్స్‌రే తీసేవారు వారులేక ప్రయివేట్ కేంద్రాలపై ఆధారపడాల్సి వస్తోంది.


ఆవరణను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం పెరిగింది

- డాక్టర్ అమరేశ్వర్, ఆసుపత్రి పర్యవేక్షకులు



మెరుగైన సేవలు అందుతుండడంతో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యంపై విశ్వాసం పెరుగుతోంది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజు పెరుగుతోంది. నెలకు 100కు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. రోగులకు సపర్యలు చేయడానికి రోగి సంరక్షకులు, పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికుల నియామకం జరిగింది. మందుల కొరతలేదు.

ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా నర్సింగరావు

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే: ఎల్లాపు సామాజిక వర్గం సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ ఎల్లాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించాలని సూచించారు. అనంతరం సంఘం జిల్లా నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వేల్ముల నర్సింగారావు, ఉపాధ్యక్షులుగా వలజ భూంరావు, ప్రధాన కార్యదర్శి చలువాజి వాసుదేవరావు, ఆర్థిక సలహాదారునిగా బాస గజేందర్, ప్రచార కార్యదర్శిగా తూం పృథ్వీధర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా రావుల గోపాల్‌రావు, న్యాయ సలహాదారునిగా వడ్నాల కిషన్‌రావు, కోశాధికారిగా చలువాజి నాగేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా టి.సుధాకర్‌రావు, వి.హన్మంతరావు, ఎ.సత్యనారాయణరావు, వి.నర్సింగరావు, జి.దయాకర్‌రావు, బి.రవీందర్‌రావు, బి.రవీందర్‌రావు, పి.మారుతిరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రమేశ్ తెలిపారు.

'గంద్ర'కు ఉత్తమ హిందూ ధర్మ ప్రచార మండలి అధ్యక్షుడి అవార్డు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం జిల్లా ధర్మప్రచార మండలి అధ్యక్షుడుగా కొనసాగుతున్న డాక్టర్ గంద్ర లక్ష్మణ్‌రావుకు తితిదే, హిందూ ధర్మ ప్రచర పరిషత్ ఆయనను ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. ప్రముఖ సాహితీవేత్త, బహుగ్రంథ కర్త అయిన గంద్ర లక్ష్మణ్‌రావు గత నాలుగేళ్లుగా జిల్లాలో తితితే ధర్మ ప్రచార మండలి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తితిదే కార్యక్రమాలు జిల్లా నలుమూలల వ్యాప్తి చేయడానికి ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించే మనగుడి, శుభప్రదం లాంటి కార్యక్రమాలు గ్రామగ్రామాన తీసుకెళ్లిన ఘనత లక్ష్మణ్‌రావుకే దక్కింది. ఈయన సేవలను గుర్తించి ఉత్తమ అధ్యక్షుడు అవార్డును ప్రకటించారు. ఈ అవార్డు కరీంనగర్ జిల్లాకు రావడంపై ధర్మప్రచార మండలి ప్రధాన కార్యదర్శి కె.బి.శర్మ, శుభప్రదం సౌజన్యకర్త సొగాని కొమురయ్య, రిసోర్స్‌పర్సన్‌లు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, అనంతాచారి, సాహితీ గౌతమి అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, మాడిశెట్టి గోపాల్, నమిలికొండ హరిప్రసాద్ శర్మ, కొత్త అనిల్ కుమార్, గంప ఉమాపతి, తదితరులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి

కరీంనగర్ గ్రామీణం,ఇల్లంతకుంట, న్యూస్‌టుడే : కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై ఎలగందుల శివారు పల్లె శ్రీరాములపల్లె సమీపంలో ఆదివారం సాయత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. కొత్తపల్లి ఠాణా ఎస్సై రమేష్ తెలిపిన వివరాల మేరకు... ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన రాజమల్లు తన కుమారుడు మణికంఠ(15)తో కలిసి ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై పొత్తూరు వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో శ్రీరాములపల్లె శివారుకు చేరుకోగానే వేములవాడ వైపు నుంచి కరీంనగర్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం బస్సు ముందు భాగంలో చిక్కుకుని కొంత దూరం వరకు ఈడ్చుకు వచ్చింది. దీంతో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమల్లుకు తీవ్రగాయాలవగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాలుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మణికంఠ మృతదేహం


సంఘటనా స్థలంలో మృతి చెందిన మణికంఠ

ఆటోను ఢీకొట్టిన గ్రానైట్ లారీ


ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

కరీంనగర్ గ్రామీణం: కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై కమాన్‌పూర్ వద్ద శనివారం అర్ధరాత్రి గ్రానైట్ లారీ ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొత్తపల్లి ఠాణా ఎస్సై రమేష్ తెలిపిన వివరాల మేరకు... ఎలగందుల గ్రామానికి చెందిన ఎస్.డి.సయీుద్(46) కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కరీంనగర్‌లోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఆటోలో ఎలగందుల గ్రామానికి వస్తున్నాడు. కమాన్‌పూర్ గ్రామంలోని పెట్రోల్ పంపు వద్ద గ్రానైట్ రాయి లోడుతో వస్తున్న లారీ డ్రైవర్ వేగంగా వచ్చి మరో వాహనాన్ని దాటి ముందుకు వెళ్లే క్రమంలో ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ఉన్న సయిద్‌అలీ అక్కడికక్కడే మృతి చెందగా అతని కుమారుడు సాజిద్(19), భార్య సొహని బేగం(38), ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సాజిద్, సొహని బేగంలు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి కుమారుడు వాజిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మృతుడు సయిద్‌అలీ(పాతచిత్రం)

బీసీల సమస్యలు పరిష్కరించాలని వినతి

తెలంగాణ చౌక్, న్యూస్‌టుడే : బలహీన వర్గ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో.. ఆదివారం కరీంనగర్‌కు వచ్చిన బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. పెండిగ్‌లో ఉన్న బోధన రుసుంల నిధులు విడుదల చేయాలని, జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని అందులో పేర్కొన్నారు. స్టడీ సర్కిల్‌కు కాంగ్రెస్ హయాంలో శంకుస్థాపన చేశారని, అప్పటి ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందని, ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీ రుణాలకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని, రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, బీసీ వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, అవసరమైన సిబ్బందిని నియమించాలని, డీఎస్సీని పాత జిల్లాల వారీగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాజేశ్‌గౌడ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, నాయకులు రాచమల్ల రాజు, నాగుల కనకయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల పదోన్నతులను సెలవుల్లో చేపట్టాలి

కరీంనగర్ విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం రానున్న దసరా సెలవుల్లో చేపట్టాలని తెలంగాణ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన ఆ సంఘం జిల్లా శాఖ సమావేశంలో మాట్లాడుతూ. . ఏకీకృత సర్వీసు రూల్స్ కోసం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించిన దృష్ట్యా ఎంఈవోలు, ఇతర పోస్టులను చేర్చడం కోసం ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 674(జీఏడీ)ని సవరించాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన డ్రాఫ్ట్ కమిటీ రుపొందించిన నియమాలను వెంటనే అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, డైట్ అధ్యాపకులు, ఉప విద్యాధికారులు, జూనియర్ లెక్చరర్ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో 223ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏరుకొండ నరసింహస్వామి మాట్లాడుతూ.. 11వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే నియమించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వసతులు గల ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి, రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.డి.మన్సూర్, రాష్ట్ర, జిల్లా సభ్యులు పి.రవికుమార్ సాదిక్ మసరత్ ఆలీ, బి.వేణు మాదవ్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లా సభ్యులు ఎన్.రాజు, ఎన్.కుమారస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి


నాడు కళకళ.. నేడు వెలవెల


గతేడాది: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ మెట్ల చెరువులో జలకళ


నీరు లేక వెలవెలబోతున్న మెట్ల చెరువు

మెట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

వర్షాలు లేక నీటి వనరులు వెలవెలబోతున్నాయి. గతేడాది ఇదే సమయంలో నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. పలు చెరువులు, కుంటలు నిండడంతో పాటు మత్తడి పోశాయి. కాని నేడు పరిస్థితి భిన్నంగా ఉంది. వర్షాలు లేక చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. గతేడాది నీటితో నిండుగా ఉన్న చెరువులు, కుంటలు ప్రస్తుతం నీరు లేక బోసిపోయాయి. మెట్‌పల్లి మండలంలో జూన్‌లో సాధారణ వర్షపాతం 179 మిల్లీమీటర్లు కాగా 148.2 మి.మీ., జులైలో 291 మి.మీ. కాగా 192.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. లోటు వర్షపాతంతో చెరువుల్లోకి నీరు చేరక పంటల సాగు ముందుకు సాగక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిపించాలని గ్రామాల్లో కప్పతల్లి ఆటలు, చేప, కప్పలకు వివాహాలు, దేవతల విగ్రహాలకు జలాభిషేకాలు చేస్తున్నారు. ఈ నెలలోనైనా వరుణ దేవుడు కరుణించాలని ఎదురు చూస్తున్నారు.


గతేడాది: నీటితో నిండుగా రంగారావుపేట చెరువు


నేడు: నీరు కరువై బోసిపోతున్న రంగారావుపేట చెరువు

మట్టి గణపతి మనసా స్మరామి!



● ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణానికి హాని
● ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం
● ఈ చవితి కావాలి.. పర్యావరణ హితం

ఆది దేవుని పూజలంటే అందరికీ భక్తి పారవశ్యం ఉప్పొంగుతుంది.. మరికొన్ని రోజుల్లో వీధివీధిన వినాయకులు కొలువుదీరనున్నారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగంతో జీవరాశి మనుగడకే ముప్పు పొంచి ఉంది. ప్రమాదకరమైన రంగులను వినియోగించడంతో పర్యావరణంతో పాటు జలచరాలు, పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం నెలకొంది. పార్వతీదేవి నలుగు పిండితో ఆవిర్భవించిన గణపతి కనుక, మనం మట్టి గణపతిని, ప్రకృతి సహజ పత్ర పుష్పాలతో పూజించి నీటిలో నిమజ్జనం చేయాలి. ఇలా చేస్తే ఒకరకంగా ఆ నీటిని కూడా మనం శుభ్రపర్చినవారమవుతాం.. ఉత్సవ కమిటీలు ఈ సంకల్పంతో ముందుకెళ్లి ఆదర్శంగా నిలవాలి.

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

షోడశనామాలతో, ఏకవింశతీపత్ర పూజతో, నవరాత్రులు జరుపుకొనే గణపతికి ప్రకృతి అంటే ఇష్టం.. తనని ఆకులతో పూజించిన వారి ఇంటికి పచ్చని ఆకుల తోరణమై నిలిచి ఉంటాడీ పార్వతీపుత్రుడు. గణపతిని పూజించే ఆకులన్నీ ఆయుర్వేద వైద్యమూలికలే! తెల్లజిల్లెడు పత్రాలలో తాపసులని ప్రకృష్టంగా చేసే గుణం ఉంది. ఎర్ర జిల్లేడు సూర్యునికి ప్రతీక.. నీటిని వేడి చేస్తుంది. దుర్వాపత్రాలు జల శుద్ధి చేస్తాయి. కరవీర(గన్నేరు) ఆకుల రసంతో జలంలోని విష క్రిములు నశిస్తాయి. ఎర్ర గోరింట నీటిని రమింపజేస్తుంది. దుత్తూరపత్రం నీటిలోని వాతరోగాన్ని హరిస్తుంది. మరువక పత్రం నీటిని పరిమళభరితం చేస్తుంది. చూతపత్రం శుభతరంగాలను కలుపుతుంది. జాజీపత్రం నీటిని ఆకర్షిస్తుంది. ఇలా 21 పత్రాల్లో అన్నీ మేలు చేసేవే! మల్లెలు, మందారాలు, మంకెనలు, మొల్లలు, గణపతికి ప్రీతికరం. మల్లెలు భూమి ఆకర్షణకి, మందారాలు క్షుద్రరోగ నివారణకి, మంకెనలు నిశిత దృష్టికి, మొల్లలు నేత్ర శీతలత్వానికి చాలా ఉపయోగపడుతాయి. చవితినాడు మొదలై అనంత చతుర్థినాడు పూర్తయ్యే నిమజ్జనాలలో నీటిని పవిత్రంగా ఉంచే బాధ్యత మనందరిపైన ఉంది.

మట్టి విగ్రహాల వినియోగించేందుకు సంస్థల కృషి: జిల్లాలో దశాబ్ద కాలంగా మట్టి విగ్రహాలు వినియోగించాలని కొన్ని సంస్థలు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. క్రమంగా ఏటా మట్టి విగ్రహాల వినియోగం పెరిగింది. స్వర్ణ భారతి, మానేరు పర్యావరణ సమితి, పలువురు సిటిజన్ ఫోరంలతో పాటు కొన్ని ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు మట్టి విగ్రహాలపై ప్రచారం చేయడమే కాకుండా, విద్యార్థులతో తయారు చేయించి విక్రయిస్తున్నారు. దీంతో ఏటా ఆదరణ పెరగడంతో జిల్లాలో మట్టి విగ్రహాలను తయారు చేసి వ్యాపారం చేస్తున్నారు. గోదావరిఖనిలో కాలుష్య నియంత్రణ మండలి వారు గతేడాది ప్రచారంతో పాటు కొన్ని స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయించింది. ఖనికి చెందిన పలువురు మట్టి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. కరీంనగర్ సమీపంలో బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని గాయత్రి సంస్థ 2011 నుంచి మట్టి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. 90తో మొదలై గతేడాది జిల్లాలో 200 పెద్ద విగ్రహాలను విక్రయించారు. అలాగే హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచీ మట్టి విగ్రహాలను తీసుకొస్తున్నారు. నగరంలోని గంగపుత్రుల వీధి, బాలాజీనగర్ కాలనీవారు గత అయిదేళ్లుగా కాలనీలో మట్టి విగ్రహాల మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది కరీంనగర్‌లో కనీసం 40 దాకా పెద్ద మట్టి విగ్రహ మండపాలు వెలిశాయి. అయితే ఇళ్లల్లోనూ పెద్ద సంఖ్యలో మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. గతేడాది జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ తుల ఉమ కూడా మట్టి విగ్రహాలను తెప్పించి ఉచితంగా భక్తులకు అందించారు. నగర పాలక సంస్థ కూడా అందించింది.



మట్టి విగ్రహాలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో నష్టాలివే..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నిర్మాణంలో ఉపయోగించే ముడి పదార్థం.. జిప్సంను 150 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతల వద్ద మండించినప్పుడు ఇది తయారవుతుంది. ఇది నీటిలో కానీ, భూమిలో కానీ కరిగిపోదు.. ఈ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు, ఆ నీటిలో ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది. దీంతో నీటిలోని జీవరాశులకు ఊపిరాడటం కష్టమవుతుంది. కాల్షియం, మెగ్నీషియం, సిలికాన్, సల్ఫర్‌లతో పాటు ఆర్సెనిక్, లెడ్, మెర్క్యురీ వంటి రసాయనాలు విడుదలవుతాయి. ఇలా తయారైన విగ్రహాలను నదులు, చెరువుల్లో నిమజ్జనం చేయడంతో నీటిలోని సహజ లవణాలు నశించిపోతున్నాయి. 2014, 2015, 2016లలో నీటిలో 14 శాతం, 17 శాతం, 22 శాతం ఆమ్ల రసాయనాలను ఉద్భవింపజేశాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. అలాగే విగ్రహాలకు వేసే రసాయనిక రంగుల అద్దకం ఉపయోగించడంతో వాటి నుంచి భారీ లోహాలైన పాదరసం, కాడ్మియం, లెడ్ వంటి రసాయనాలు నీళ్లలో కలపడంతో మనుషులపైనే కాకుండా జలచరాలపైనా చెడు పరిణామాలు చూపిస్తున్నాయి. మనుషుల నరాలు, కిడ్నీపై దుష్ప్రభావం చూపిస్తున్నాయి. ఈ రసాయనాలతో నిండిన నీరు పంటలకు పారించడంతో వాటి మూలాలు ప్రతి ధాన్యపు గింజలోకి వెళ్లే ప్రమాదం ఉంది. తద్వార మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు, రక్త నాళ సంబంధ, చర్మ సంబంధ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ఇప్పటికే సమాజంలో చర్మవ్యాధులు పెరిగినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.



మట్టి విగ్రహాలే శ్రేష్ఠం

- గాలిపెల్లి నాగేశ్వర్, డైరెక్టర్, స్వర్ణభారతి

మట్టితో తయారు చేసిన విగ్రహాలు శ్రేష్ఠమని శాస్త్రం చెబుతోంది.. మట్టితో తయారు చేసిన వినాయకులను పూజించాలి. అందుకు మా సంస్థ గత పదేళ్లుగా ఈ కార్యక్రమం చేపట్టింది. 'మట్టి గణపతి.. మన దళపతి' అనే నినాదంతో వేలాది మంది విద్యార్థుల చేత మట్టి విగ్రహాలను తయారు చేయిస్తున్నాం. భావితరాలకు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందిస్తున్నాం. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో విద్యార్థులకు ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో కలిగే నష్టాలను వివరిస్తున్నాం.



సమాజహితమే లక్ష్యంగా చేస్తున్నాం

- తోట కిరణ్‌కుమార్, గాయత్రి పర్యావరణ సంస్థ

సమాజ హితమే లక్ష్యంగా మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం. నిజానికి వీటిని తయారు చేయటం శ్రమతో కూడుకున్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ దృష్టిలో పెట్టుకొని తయారు చేస్తున్నాం. మొదట్లో పీవోపీ వంటి ఆకర్షణీయ విగ్రహాల మధ్య ఇవి అమ్ముడవుతాయా? అని భయపడ్డాం. కానీ సమాజంలో ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వస్తోంది. ఈ ఏడాది వందలాది ఆర్డర్లు వచ్చాయి. రాబోయే రోజుల్లో మట్టి విగ్రహాలకు మరింత ప్రాధాన్యత పెరుగుతుందనిఆశిస్తున్నాం.

మట్టి విగ్రహాలకు పోటీపడాలి

నగరాల్లో, పట్టణాల్లో, పల్లెల్లో ఉత్సవ కమిటీలు ఎంత పెద్ద విగ్రహం పెడితే సమాజంలో అంత గౌరవంగా భావిస్తున్నారు. ఈ భావనలతోనే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఎత్తు ప్రమాణం కాదని ఉత్సవ కమిటీలు గుర్తించాలి.. లేదంటే రాబోయే తరాలకు అన్యాయం చేసినవారమవుతాం.. ఆర్భాటాలకు పోకుండా తక్కువ వ్యయంతో, భక్తిశ్రద్ధలతో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైవిధ్య భరితమైన పూజలతో, మండపాలను భక్తిరసాన్ని పంచేలా తయారు చేయాలి. ఇందుకు ఇప్పటి నుంచే ఉత్సవ కమిటీలు సమాయత్తం కావాలని సమాజహితులు కోరుకుంటున్నారు.



బాలాజీ నగర్‌లో మట్టి విగ్రహ మండపం



అందంగా అలంకరించిన మట్టి విగ్రహం (పాతచిత్రం)

స్వాతంత్య్ర దినోత్సవ కవాతు కమాండర్‌గా ఖని ఏసీపీ



ఏసీపీ అపూర్వరావు

గోదావరిఖని, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పరేడ్ కమాండర్‌గా గోదావరిఖని ఏసీపీ అపూర్వరావును నియమించారు. 71వ రాష్ట్ర స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఆమె పరేడ్ కమాండర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండ కోటపై నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి స్వీకరించే గౌరవ వందనంలో సాయుధ దళాలకు పరేడ్ కమాండర్‌గా అపూర్వరావు వ్యవహరించనున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● కమిషనరేట్ పోలీసుల కుటుంబ సమ్మేళనం
● ఆత్మీయంగా కలుసుకునేందుకే : సీపీ

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఫిర్యాదులు.. కేసులు.. ఎఫ్ఐఆర్‌లు.. విచారణలు.. అరెస్టులు.. బందోబస్తులు.. ఎస్కార్టులతో హడావుడిగా ఉండే కమిషనరేట్ పోలీస్‌స్టేషన్‌లలో ఆదివారం పండగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ, పాశ్చాత్య పాటలకు పోలీసులు, వారి కుటుంబ సభ్యుల నృత్యాలు, పిల్లల ఫ్యాషన్ షోలు, ఆటలు, పాటలు, మిమిక్రీలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. పోలీసుల కుటుంబాలకు పోలీస్‌స్టేషన్‌లను చూపించి పోలీసుల విధివిధానాలను తెలిపేందుకు, సిబ్బంది ఒత్తిడిని తగ్గించి పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలు ఆత్మీయంగా కలుసుకునేందుకు కమిషనరేట్ కేంద్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలోఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. కరీంనగర్‌లోని ఒకటో ఠాణా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి నగర పోలీస్ కమిషనర్ కమలాసన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రితం రోజుల్లో పోలీస్‌స్టేషన్‌లు అంటే ప్రజల్లో చెడు అభిప్రాయం ఉండేదని.. మారుతున్న సమాజానికి అనుగుణంగా పోలీసు శాఖలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ, స్నేహపూర్వంగా ఉండేందుకు ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ కొనసాగుతుందన్నారు. పరిశుభ్రమైన వాతావరణం, పచ్చని చెట్లు, ఫిర్యాదుదారులను బాధ్యతగా పలకరించి ఫిర్యాదు స్వీకరించే పోలీస్‌స్టేషన్‌లు కరీంనగర్ కమిషనరేట్‌లో దర్శనమిస్తున్నాయన్నారు. ఒకటో ఠాణాలో సీఐ తుల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎస్సైలు ఎం.సురేందర్, వంశీకృష్ణ, శ్రీనివాస్‌రావు, సిబ్బంది, కుటుంబ సభ్యులంతా నృత్యాలు చేసి ఆనందంగా గడిపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు సదానందం, సీతారెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల విధులపై నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో తిమ్మాపూర్ సీఐ కరుణాకర్‌రావు, ఎస్సై వై.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, కుటుంబ సభ్యులు ఆటలు, పాటలతో ఉత్సాహంగా గడిపారు.



నృత్యాలు చేస్తున్న ఒకటో ఠాణా ఎస్సైలు, సిబ్బంది



ట్రాఫిక్ పోలీసుల బృందం



నృత్యాలు చేస్తున్న ఒకటో ఠాణా సిబ్బంది పిల్లలు



ఆధునిక కాలంలో సార్వభౌమ దేశాలన్నింటిలోనూ కేంద్ర బ్యాంక్‌ను ఒక ముఖ్య ద్రవ్య సంస్థగా భావిస్తున్నారు. ఆ దేశాల్లో జరిగే అన్ని బ్యాంకింగ్ కార్యకలాపాలను అది నియంత్రిస్తుంది. దేశ ఆర్థిక విధానాలను అమలు పరచడంలో కేంద్ర బ్యాంకు ప్రముఖ పాత్ర వహిస్తుంది. మన దేశంలో స్వాతంత్ర్యానంతరం ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించడానికి ప్రభుత్వ స్వాధీనంలో ఉండే కేంద్ర బ్యాంక్ అవసరమని భావించి, ఆర్‌బీఐని ఏర్పాటు చేశారు.

ప్రతిభ

అంతిమ రుణదాత ఎవరు...?

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ



రచయిత
-సి.హెచ్.వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

భారత రిజర్వ్ బ్యాంక్, ద్రవ్య విధానం

ఆర్థిక వ్యవస్థ ఉత్పాదక రంగంలో అవసరమైన పెట్టుబడులను పొదుపు ద్వారా సమీకరించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలకు అవసరమైన పెట్టుబడులను అందించడానికి వాణిజ్య బ్యాంకులు పరపతిని సృష్టిస్తున్నాయి. ఈ ప్రక్రియలో అప్పుడప్పుడు వ్యాపార కార్యకలాపాల్లో వచ్చే ఒడిదొడుకుల ఫలితంగా వ్యాపార చక్రాలు ఏర్పడతాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలు కూడా తలెత్తుతాయి. ధరల స్థాయిల్లోని ఒడిదొడుకులను అదుపులో పెట్టడానికి పరపతి, ద్రవ్య పరిమాణాలను నియంత్రించడం అవసరం. కాగితపు ద్రవ్యం, దాని మార్పిడి రేటును స్థిరీకరించడం కూడా అవసరం. తద్వారా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ, ద్రవ్య వ్యవస్థ చివరికి ఆర్థికాభివృద్ధికి దారితీయాలి. దీన్ని సాధించడానికి, బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రించడానికి అధికారం కలిగి ఉన్న అత్యున్నత సంస్థ అవసరం. భారతదేశంలో భారత రిజర్వ్ బ్యాంక్ అనే కేంద్ర బ్యాంకు ఈ కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

పుట్టు పూర్వోత్తరాలు

మొట్టమొదటి కేంద్ర బ్యాంక్ 1656 లో స్వీడన్ రిక్స్ బ్యాంకు స్థాపనతో మొదలైనా, కేంద్ర బ్యాంక్ అనే భావన ఈ మధ్యకాలంలో బాగా ప్రసిద్ధి చెందింది. 1694 లో స్థాపించిన 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' ఒక కేంద్ర బ్యాంక్ నిర్వహించాల్సిన అన్ని విధులను నిర్వహించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను అనుసరించి 19 వ శతాబ్దంలో యూరప్‌లో మరెన్నో కేంద్ర బ్యాంకులు పుట్టుకొచ్చాయి.

1800 లో స్థాపించిన 'బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్' దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను నిర్వహించింది. బ్యాంక్ ఆఫ్ నెదర్లాండ్స్‌ను 1814 లో, 'బ్యాంక్ ఆఫ్ రష్యా'ను 1860 లో ఏర్పాటు చేశారు. దేశీయ ద్రవ్య పద్ధతిని క్రమపరచడానికి 1882 లో 'బ్యాంక్ ఆఫ్ జపాన్'ను స్థాపించారు. 'ఇటలీ సెంట్రల్ బ్యాంకు' 1893 లో ఏర్పడగా, స్విస్ జాతీయ బ్యాంకు 1907 లో స్థాపితమైంది. ప్రపంచంలో అతి పెద్ద పెట్టుబడిదారీ దేశమైన అమెరికాలో 'ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్'ను 1913 లో, కెనడాలో 1934 లో స్థాపించారు.

1920 లో బ్రెస్సెల్స్‌లో జరిగిన అంతర్జాతీయ విత్త సమావేశంలో కేంద్ర బ్యాంకు లేని దేశాల్లో వీలైనంత తొందర్లో కేంద్ర బ్యాంకులను స్థాపించాలని తీర్మానించారు. దీనికి అనుగుణంగా చాలా దేశాల్లో కేంద్ర బ్యాంకులను స్థాపించారు.

కేంద్ర బ్యాంకు నిర్వచనం

కేంద్ర బ్యాంకు నిర్వచనం అది నిర్వహించే విధులను అనుసరించి ఉంటుంది. కేంద్ర బ్యాంకు విధులు వివిధ దేశాల్లో వివిధ రకాలుగా ఉంటాయి. ఒకే దేశంలో వివిధ కాలాల్లో వివిధ రకాలుగా ఉంటాయి. అందువల్ల కేంద్ర బ్యాంకుకు అందరికీ ఆమోదయోగ్యమైన నిర్వచనాన్ని ఇవ్వడం కష్టం.

- కేంద్ర బ్యాంకు ప్రధానమైన విధి స్థిరత్వాన్ని కాపాడటం. అంటే ద్రవ్య ప్రవాహాన్ని నియంత్రించడం. - కిచ్, ఎల్‌కిన్
- ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య పరిమాణాల పెరుగుదల, తరుగుదలను అజమాయిషీ చేయడం కేంద్ర బ్యాంకు ముఖ్య విధి - కెంట్
- కేంద్ర బ్యాంకు అనేది వాణిజ్య బ్యాంకులకు అంతిమంగా రుణాలిచ్చి ఆదుకునే వ్యవస్థ - హాత్రే
- ద్రవ్య విధానాన్ని అమలు పరచడం కేంద్ర బ్యాంకు ముఖ్యవిధి - సేయర్స్
- కేంద్ర బ్యాంకు ద్రవ్య, బ్యాంకింగ్ నిర్మాణంలో శిఖరం ఆక్రమిస్తున్న బ్యాంకు. ఇది కరెన్సీ నోట్లను జారీ చేయడంలో గుత్తాధిపత్యాన్ని కలిగి ఉండటంతోపాటు అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది - డికాక్

భారత రిజర్వ్ బ్యాంక్

- ☆ భారతదేశ కేంద్ర బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్. దీన్ని RBI చట్టం 1934 కు అనుగుణంగా 1935 ఏప్రిల్ 1 న రూ. 5 కోట్ల మూలధనంతో వాటాదార్ల బ్యాంకుగా (Share holders bank) స్థాపించారు.
- ☆ 1949 జనవరి 1 న రిజర్వ్ బ్యాంక్‌ను జాతీయం చేశారు. ప్రారంభంలో రిజర్వ్ బ్యాంక్ కేంద్ర కార్యాలయం కలకత్తాలో ఉండేది. 1937 లో దీన్ని శాశ్వతంగా ముంబయికి మార్చారు. సమర్థవంతంగా విధులను నిర్వహించడానికి వీలుగా కోల్‌కతా, దిల్లీ, బెంగళూరు, నాగ్‌పుర్, చెన్నై, హైదరాబాద్, పట్నా నగరాల్లో శాఖలను ఏర్పాటు చేశారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. నలుగురికి మించకుండా ఉపగవర్నర్లు ఉంటారు. ఆర్‌బీఐ ప్రస్తుత గవర్నర్ ఉర్జిత్ పటేల్.

ఆర్‌బీఐ లక్ష్యాలు

ఎ) కరెన్సీని క్రమబద్ధం చేయడం
బి) ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య స్థిరత్వాన్ని, సుస్థిరతను సాధించడం
సి) పటిష్టమైన ద్రవ్య విధానాన్ని అమలుపరుస్తూ, పరపతిని నియంత్రించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం.
డి) దేశంలో వాణిజ్య బ్యాంకులకు స్నేహితుడిగా, తత్వవేత్తగా, మార్గదర్శకుడిగా వ్యవహరించడం.
ఇ) దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరపతి విధానాన్ని అమలు చేయడం.
ఎఫ్) దేశ ఆర్థిక, కోశ విధానాల్లో ప్రభుత్వానికి సలహాదారుగా వ్యవహరించడం.

ఆర్‌బీఐ విధులు

ఆదర్శమైన ఒక కేంద్ర బ్యాంక్ నిర్వహించే అన్ని ప్రాచీన, ఆధునిక విధులను భారత రిజర్వ్ బ్యాంక్ నిర్వహిస్తుంది. భారత రిజర్వ్ బ్యాంక్ చట్టం 1934 ప్రకారం ఆర్‌బీఐ ఈ కింది విధులను నిర్వహిస్తుంది.

1. ద్రవ్యాన్ని ముద్రించి, చలామణి చేసే గుత్తాధిపత్యం:

భారత రిజర్వ్ బ్యాంక్ చట్టం 1934 సెక్షన్ 22 ప్రకారం కరెన్సీ నోట్లను ముద్రించే గుత్తాధిపత్య అధికారం భారత రిజర్వ్ బ్యాంకుకు ఉంటుంది. రెండు రూపాయల కరెన్సీ నుంచి రూ. 2 వేల నోట్ల వరకు ఆర్‌బీఐ ముద్రించి, పంపిణీ చేస్తుంది.

- ☆ ఒక రూపాయి నోటు, ఒక రూపాయి నాణేలను భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసినా, వాటి పంపిణీ బాధ్యత మాత్రం ఆర్‌బీఐదే.
- ☆ 1956 కు ముందు ఆర్‌బీఐ కరెన్సీ నోట్ల జారీకి అనుపాత నిల్వల పద్ధతిని పాటించింది. 1956 లో అనుపాత నిల్వల పద్ధతిని రద్దు చేసి, 'కనిష్ఠ నిల్వల పద్ధతి' (Minimum Reserve System) ప్రవేశపెట్టింది.
- ☆ కరెన్సీ జారీకీ రూ. 400 కోట్లు కనీస నిల్వలుగా నిర్ణయించారు. ఇందులో రూ. 200 కోట్ల మేర బంగారం, రూ. 200 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఉండాలి. 1957 లో కరెన్సీ నిల్వల పరిమాణాన్ని రూ. 400 కోట్ల నుంచి రూ. 200 కోట్లకు తగ్గించారు. ఇందులో రూ. 115 కోట్ల మేరకు బంగారం నిల్వలు, రూ. 85 కోట్ల మేరకు విదేశీ మారక ద్రవ్యం ఉండాలి.

2. ప్రభుత్వ బ్యాంకు:

ఆర్‌బీఐ నిర్వహించే రెండో ముఖ్య విధి- ప్రభుత్వ బ్యాంకుగా వ్యవహరించడం. కేంద్ర ప్రభుత్వానికి, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రభుత్వ బ్యాంకుగా, ప్రభుత్వ ఏజెంటుగా ఇది వ్యవహరిస్తుంది. ఆర్థిక, ద్రవ్య విధానాల విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాదారుగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున రుణాలను స్వీకరిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 90 రోజుల కాలపరిమితితో స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తుంది. వీటిని 'వేస్ అండ్ మీన్స్' అడ్వాన్స్ అంటారు. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓవర్ డ్రాఫ్టు సౌకర్యాన్ని కూడా కల్పిస్తుంది.

3. బ్యాంకులకు బ్యాంకు:

వాణిజ్య బ్యాంకులకు నాయకత్వం వహించి, వాటి కార్యకలాపాలను నియంత్రిస్తుంది. వాణిజ్య బ్యాంకులు తమ లావాదేవీలను ఎప్పటికప్పుడు ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుంది. ఒక కొత్త బ్యాంకు ఆవిర్భవించాలన్నా, ఒక కొత్త శాఖను ఏర్పాటు చేయాలన్నా వాణిజ్య బ్యాంకులు ఆర్‌బీఐ నుంచి లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

4. అంతిమ రుణదాత:

అర్హత కలిగిన బిల్లులను రీ-డిస్కౌంట్ చేయటం ద్వారా గానీ, అర్హమైన సెక్యూరిటీల మీద రుణాలు, అడ్వాన్సుల రూపంలో వాణిజ్య బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చు. బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం ఏర్పడే పరిస్థితుల్లో వాణిజ్య బ్యాంకులను ఆదుకోవటానికి ఆర్‌బీఐ అందుబాటులో ఉంటుంది. అందుకే ఆర్‌బీఐని అంతిమ రుణదాత అంటారు.

5. పరపతి నియంత్రణ ద్వారా ఆర్థిక స్థిరత్వం:

వాణిజ్య బ్యాంకులు సృష్టించే పరపతి పరిమాణం ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ, ప్రతిద్రవ్యోల్బణానికి దారితీసి ఒడిదొడుకులు ఏర్పడవచ్చు. పరిమాణాత్మక, గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఉపయోగించడం ద్వారా ఆర్‌బీఐ పరపతి నియంత్రణ చేస్తుంది.

6. అంతర్జాతీయ ద్రవ్యనిధుల పరిరక్షణ:

విదేశీ ద్రవ్య వ్యవహారాలన్నీ ఆర్‌బీఐ ద్వారానే నడుస్తాయి. అంతర్జాతీయ చెల్లింపుల శేషంలో ఏర్పడే లోటును పూరించడానికి విదేశీ మారకంగా ఉపయోగించే బంగారు నిల్వలను, విదేశీమారక ద్రవ్య నిల్వలను పరిరక్షించడం ఆర్‌బీఐ విధుల్లో ఒకటి.

7. క్లియరింగ్ హౌస్‌ల నిర్వహణ:

బ్యాంకుల నిత్యావసరాల్లో పనులను సులభతరం చేసే నిమిత్తం కొన్ని ముఖ్య కేంద్రాల్లో ఆర్‌బీఐ క్లియరింగ్ హౌస్‌లను నిర్వహిస్తోంది. క్లియరింగ్ హౌస్‌ల ద్వారా జరిగిన వ్యవహారాల వల్ల ఏయే వాణిజ్య బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తున్నాయో ఆర్‌బీఐకి తెలుస్తుంది.

8. పర్యవేక్షక విధులు:

భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థలో రిజర్వ్ బ్యాంకు శిఖరాగ్ర సంస్థ. బ్యాంకింగ్ సంస్థలపై నియంత్రణ, పర్యవేక్షణ ద్వారా డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడుతుంది. ఆర్థిక వ్యవస్థలో మోసపూరిత కార్యకలాపాల నియంత్రణకు అవసరమైన విధివిధానాలను అమలుపరచడం ద్వారా బ్యాంకు నిధులు సమర్థవంతంగా ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడేలా చూస్తుంది.

9. అభివృద్ధిపరమైన విధులు:

భారతీయ రిజర్వ్ బ్యాంక్ అనేక అభివృద్ధిపరమైన, ప్రగతి పూర్వకమైన విధులను నిర్వహిస్తుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, అవస్థాపన సౌకర్యాల కల్పనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అవసరమైన చర్యలను ఆర్‌బీఐ చేపడుతుంది.

- ☆ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి కోసం 1963 లో వ్యవసాయ పునఃవిత్త కార్పొరేషన్‌ను, 1982 లో నాబార్డ్‌ను స్థాపించారు.
- ☆ పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి 1948 లో భారత పారిశ్రామిక విత్త కార్పొరేషన్‌ను, 1953 లో రాష్ట్ర విత్త కార్పొరేషన్‌లు, 1964 లో భారత పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (ఐడీబీఐ), భారతదేశ యూనిట్ ట్రస్ట్ (యూటీఐ)ను ఆర్‌బీఐ స్థాపించింది.

ఆర్‌బీఐ ద్రవ్యవిధానం

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య పరిమాణం ముఖ్యంగా పరపతి రూపంలో బ్యాంకులు సృష్టించే ద్రవ్యం ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. కానీ, అదే సమయంలో ద్రవ్యోల్బణం, స్పెక్యులేటివ్ కార్యకలాపాలకు, ఆదాయ అసమానతలు పెరగడానికి, వ్యాపార చక్రాలు ఏర్పడటానికి ద్రవ్య పరిమాణం కారణం అవుతుంది. కాబట్టి ఈ సమస్యలను అధిగమించి, నిర్దిష్ట లక్ష్యాలను సాధించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధానాన్ని అమలు చేస్తుంది.

ద్రవ్య విధానం ముఖ్య లక్ష్యాలు:

ఎ) ధరల స్థాయి నియంత్రణ, వ్యాపార చక్రాల నియంత్రణ
బి) సంపూర్ణ ఉద్యోగిత సాధించడం
సి) త్వరిత ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం
డి) ఆదాయ అసమానతలు తగ్గించడం
ఇ) విదేశీ మారకపు రేట్ల స్థిరత్వానికి కృషి చేయడం
ఎఫ్) చెల్లింపుల శేషంలో సమతౌల్యం సాధించడం
జి) ప్రాంతీయ సమానాభివృద్ధికి కృషి చేయడం

ద్రవ్య విధాన/ పరపతి నియంత్రణ సాధనాలు

రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరిమాణం, ఉపయోగాలను నియంత్రించడానికి చేపట్టే విధానాన్నే 'ద్రవ్యవిధానం' అంటారు. ద్రవ్య విధాన సాధనాలు లేదా పరపతి నియంత్రణ సాధనాలు రెండు రకాలు: అవి.

1. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు
2. గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు

- ☆ పరిమాణాత్మక పరపతి నియంత్రణలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ దేశంలో పరపతి పరిమాణాన్ని, ద్రవ్య సరఫరాను నియంత్రిస్తుంది.
- ☆ గుణాత్మక పరపతి విధానం అంటే పరపతి, ద్రవ్య సరఫరా ఉపయోగాన్ని నియంత్రించడం. దీనికోసం మార్జిన్లను మార్చడం, విచక్షణాత్మక వడ్డీరేటు, వినియోగదారుల పరపతి నియంత్రణ, పరపతి రేషనింగ్, నైతికోద్బోధ, ప్రత్యక్ష చర్యలు లాంటి విధానాలను ఆర్‌బీఐ పాటిస్తుంది.

ఉద్యోగాలు Jobs

గెస్ట్ ఫ్యాకల్టీ

హైదరాబాద్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: గెస్ట్ ఫ్యాకల్టీ/ పార్ట్ టైమ్ లెక్చరర్
- సబ్జెక్టులు: తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, కామర్స్
- అర్హత: సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/ సెట్, ఎంఫిల్/ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
- ఎంపిక: అకడెమిక్ మెరిట్, డెమో/ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో. చివరి తేది: 18 **ఆగస్టు**

వెబ్‌సైట్: www.tgtwgurukulam.telangana.gov.in

IBPS - RRBs Recruitment

ప్రతిభ

No. of Questions: 80 | Maximum Marks: 80 | Time: 45 Mts.

IBPS Officers Prelims Model Paper - 2017

Reasoning Ability

Directions (1-5): In each of the following questions, relationship between different elements is shown in the statements. The statements are followed by two Conclusions numbered I and II. Study the Conclusions based on the given statements and mark the appropriate answer: Give answer

1) If both the Conclusion I and Conclusion II are true
2) If either Conclusion I or Conclusion II is true
3) If neither Conclusion I nor Conclusion II is true
4) If only Conclusion I is true
5) If only Conclusion II is true

1. Statements: $A \leq R \leq N = G \geq T > S$
Conclusions: I. $A < S$ II. $A = S$

(2 - 3):
Statements: $C > R \leq E = T$; $R < Y$; $U \geq E$

2. Conclusions: I. $C > Y$ II. $U \geq Y$

3. Conclusions: I. $U \geq R$ II. $T \leq U$

(4-5):
Statements: $P \geq R = B \leq S$; $C \leq B > Z$

4. Conclusions: I. $Z = P$ II. $S \leq Z$

5. Conclusions: I. $C < S$ II. $C = S$

Directions (6 - 7): These questions are based on the position of English alphabets.

6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
1) LOJ 2) FID 3) RUP
4) ILN 5) CFA

7. Which of the following will be the next letter in the following letter series?
B C E H L ?
1) Q 2) P 3) O
4) Cannot be determined 5) None of these

Directions (8 - 10): Study the following information to answer the given questions:

A building has seven floors numbered one to seven, in such a way that the ground floor is numbered one, the floor above it, number two and so on such that the topmost floor is numbered seven. One out of seven people viz. A, B, C, D, E, F and G lives on each floor. A lives on fourth floor. E lives on the floor immediately below F's floor. F does not live on the second or the seventh floor. C does not live on an odd numbered floor. B does not live on a floor immediately above or below C's floor. D does not live on the top-most floor. G does not live on any floor below E's floor.

8. Who lives on the topmost floor?
1) B 2) C 3) E 4) G
5) Cannot be determined

9. Who lives immediately above D's floor?
1) A 2) B 3) C 4) F 5) G

10. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to that group?
1) F 2) D 3) B 4) G 5) C

Directions (11 - 15): Study the following information to answer the given questions:

In a Group of 5, each person has an exclusive and different preference (has/ likes) for a pen, a watch and a car. Pen preferences are

Mail your feedback to..
pratibhadesk@eenadu.net



Parker, Lamy, Pointer, Lexi and Cello. Car preferences are WagonR, Swift, Santro, Mica and City. Watch preferences are Timex, Titan, Fastrack, Samay and Citizen. Suman has Mica and Parker but does not prefer among watches -Titan or Fastrack. The one who has Swift, likes Fastrack. Mrudula has preference for City, Cello and Citizen. Amit has preference for Lamy and Timex. Veena prefers WagonR and Lexi. Harsh's preference for a watch is not Titan.

11. Which watch is Suman's preference?
1) Titan 2) Fastrack 3) Samay
4) Cannot be determined 5) None of these

12. Which pen is Harsh's preference?
1) Lamy 2) Pointer 3) Lexi
4) Cannot be determined 5) None of these

13. Which watch is Harsh's preference?
1) Samay 2) Fastrack 3) Timex
4) Cannot be determined 5) None of these

14. Who's preference is Swift?
1) Harsh 2) Amit 3) Veena
4) Cannot be determined 5) None of these

15. Which watch is Veena's preference?
1) Samay 2) Fastrack 3) Titan
4) Cannot be determined 5) None of these

Directions (16 - 18): In each question below is given a statement followed by two assumptions numbered I and II. An assumption is something supposed or taken for granted. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement. Give answer

1) If only assumption I is implicit.
2) If only assumption II is implicit.
3) If either assumption I or II is implicit.
4) If neither assumption I nor II is implicit.
5) If both assumptions I and II are implicit.

16. Statement: Please send an official letter rather than semiofficial on this subject this time.
Assumptions:
I. The format and emphasis of different types of letters is different.
II. We can send different types of letters on the same subject.

17. Statement: Please check the availability of 2 tickets from Delhi to Lucknow.
Assumptions:
I. Person checking knows the desired mode of travel.
II. Person checking knows the details of the person travelling.

18. Statement: If you want to increase your writing speed, use 0.7 pen.
Assumptions:
I. There are different types of pens available.
II. The person being told understands what is 0.7 pen.

Directions (19 - 20): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and Give answer

1) If the data in statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question.
2) If the data in statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone is sufficient to answer the question.
4) If the data in both the statements I and II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I and II together are necessary to answer the question.

19. On which day was Yasir born? (His date of birth is February 29)
I. He was born between year 2005 and 2011.
II. He will complete 4 years on February 29, 2012.

20. Out of 64 students, 38 play both chess and cricket. How many students play only chess?
I. Out of 64 students, 22 students don't play any game. 4 students play only cricket.
II. Out of 64 students, 20 are girls and 10 of them don't play any game.

Directions (21 - 25): Study the following information carefully and answer the questions given below:

Nine persons – P, Q, R, S, T, U, V, W and X - are seated in a straight line facing north but not necessarily in the same order. T sits fourth to the left of W. Neither T nor W sits at the extreme ends of the line. Only one person sits between X and R. Neither X nor R is an immediate neighbour of W. P sits second to the right of X. Only two persons sit between P and S. Q is not an immediate neighbour of S or P. V is not an immediate neighbour of X.

21. What is the position of V with respect to Q?
1) Fifth to the right
2) Immediate neighbour
3) Second to the right
4) Third to the right
5) Other than those given as options

22. Which of the following represents persons seated at two extreme ends of the line?
1) S, R 2) Q, S 3) R, P
4) X, Q 5) V, X

23. How many persons are seated between R and P?
1) One 2) Two 3) Three
4) Four 5) None

24. If T is related to V and Q is related to P in a certain way, to which of the following would X be related to following the same pattern?
1) Q 2) T 3) R 4) S 5) W

25. Who amongst the following sits exactly in the middle of the persons who sits seventh from the left and the person who sits sixth from the right?
1) P 2) Q 3) T 4) S 5) V

Directions (26 - 30): Study the following information carefully and answer the questions given below :

Seven persons namely, M, N, O, P, Q, R and S attended seminars in seven different cities viz, London, Paris, Bangkok, New York, Madrid, Tokyo and Seoul on seven different days of the same week starting from Monday to Sunday, but not necessarily in the same order. S attended Seminar on Wednesday. Only one person attended Seminar between S and the person who attended Seminar in Seoul. Only three persons attended Seminars between R and the person who attended Seminar in Seoul. Only one person attended Seminar between Q and the person who attended Seminar in Seoul. O attended Seminar immediately before P. Only two persons attended Seminars between P and the person who attended Seminar in Bangkok. M did not attend Seminar on Saturday. M attended Seminar immediately before the person who attended Seminar in Tokyo. N attended Seminar immediately before the person who attended Seminar in London. O did not attend Seminar in New York. N attended Seminar in Madrid but not on Monday.

26. Four of the following five are alike in a certain way as per the given arrangement and hence form a group. Which is the one that does not belong to that group?
1) O – Wednesday 2) N – Friday
3) M - Thursday 4) Q – Saturday
5) S - Tuesday

27. Which of the following represents the day on which N attended a Seminar?
1) Saturday 2) Sunday 3) Thursday
4) Tuesday
5) Other than those given as options

28. Who amongst the following attended Seminar in Seoul?
1) M 2) O 3) Either M or P 4) P
5) Cannot be determined

29. Which of the following combinations of Day-Person-City is definitely true?
1) Monday – Q – Bangkok
2) Friday – M – London
3) Saturday – R – Tokyo
4) Tuesday – N – Madrid
5) Thursday – O – Paris

30. Which of the following statements is true as per the given arrangement?
1) The one who attended Seminar in New York attended on Tuesday.
2) N attended Seminar on Saturday immediately after P.
3) M attended Seminar exactly between S and O
4) P attended Seminar on Tuesday in Paris
5) None of the given statements is true

Key

1-3	7-1	13-2	19-3	25-1
2-3	8-4	14-1	20-1	26-3
3-1	9-3	15-3	21-5	27-1
4-3	10-5	16-5	22-2	28-4
5-2	11-3	17-1	23-3	29-5
6-4	12-2	18-5	24-4	30-2.

(మిగతా ప్రశ్నలు రేపటి పేజీలో)

హాయ్! బుజ్జీ!!

కృష్ణా ముకుందా మురారీ!

చిన్ని కన్నయ్య పుట్టిన రోజు కృష్ణాష్టమి. ఈ పండగ వచ్చిందంటే మన దేశమంతా సందడే సందడి. వీధి వీధినా ఉట్లు కొడుతూ, గోపాలుణ్ని భక్తిగా ఆరాధిస్తూ అన్ని చోట్లా వేడుకలే. ఈ సందర్భంగా కృష్ణుడికి సంబంధించిన కొన్ని విశేషాలు తెలుసుకుందామా!



ఎత్తైన గుడి!

- ప్రపంచంలోనే ఎత్తైన కృష్ణుడి గుడిగా 'బృందావన చంద్రోదయ మందిర్' రికార్డులకెక్కింది.
- దీని ఎత్తు 700 అడుగులు అంటే దాదాపు 70 అంతస్తుల భవనమంత ఎత్తు.
- ఇదున్నది ఉత్తర్‌ప్రదేశ్ లోని బృందావన్‌లో.
- 2014లో ప్రారంభమైన దీని నిర్మాణం మరికొంత కాలంలోనే పూర్తికానుంది.
- పండగ సందర్భంగా ఇక్కడి రాధాకృష్ణుల విగ్రహ మూర్తులకు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.



శ్రీకృష్ణునికీ ఉందో మ్యూజియం

- ఈ మ్యూజియం పేరు 'శ్రీకృష్ణ సంగ్రహాలయ్.'
- హరియాణాలోని కురుక్షేత్రలో ఉంది.
- రకరకాల కృష్ణుడి ప్రతిమల్ని ఇక్కడ చూడొచ్చు. కళాకారులు వేసిన కళాఖండాలు ఓవైపు కనువిందు చేస్తాయి. శిలలతో చెక్కిన శిల్పాలొకవైపు; మట్టి, కంచుతో తయారుచేసిన రకరకాల విగ్రహాలు మరోవైపు దర్శనమిస్తాయి.
- అర్జునుడికి కృష్ణుడు భగవద్గీతను బోధించడం, అంపశయ్యపై ఉన్న భీష్ముడు... లాంటి మహాభారతంలోని సన్నివేశాలు ఇక్కడ నిలువెత్తు బొమ్మల రూపంలో కనువిందుచేస్తాయి.

చేత వెన్నముద్ద!

- చిన్ని కృష్ణుడి వెన్న ముద్ద తమిళనాడులోని మహాబలిపురంలో ఉంది.
- వాస్తవానికి ఇది ఓ పెద్ద రాయి. దీని పేరే 'కృష్ణుని వెన్న ముద్ద'.
- కన్నయ్య ఓసారి అమ్మ మజ్జిగ కుండలోని వెన్నముద్దను దొంగిలించి తెచ్చాడని, అదే ఇక్కడ రాయి రూపంలో మారిందని చెబుతారు.




- దాదాపు ఆరు మీటర్ల ఎత్తు, ఐదు మీటర్ల వెడల్పు ఉన్న ఇది 250 టన్నులకు పైగా బరువుంటుందట.
- పూర్తిగా ఏటవాలు ప్రదేశంలో కొంచెం మాత్రమే భూమిపై ఆనుకుని ఉంటుందిది. చూస్తే అమ్మో కిందికి దొర్లి పడిపోతుందేమోనని భయమేస్తుంది. అలా ఎప్పుడైనా జారిపోతుందేమోనని దీన్ని ఇక్కడి నుంచి కదల్చడానికి చాలా ప్రయత్నించారు. 1908లో ఒకసారి ఏడు ఏనుగులతో దీన్ని పక్కకి లాగించారు. అంతకంటే ముందు పల్లవ రాజైన నరసింహ వర్మన్ సైతం దీన్ని జరిపించేందుకు ప్రయత్నించారు. అయితే 1200 ఏళ్లుగా ఇది ఒక్క అంగుళమైనా కదల కుండా అలానే ఉంది.

మీకు తెలుసా?

- ఈ పండగను మనతోపాటు నేపాల్, బంగ్లాదేశ్, ఫిజి, పాకిస్థాన్... దేశాల్లోనూ చేసుకుంటారు.





ఐదు తేడాలు కనుక్కోండి





జవాబులు: చిలిపిప్రశ్న: గంగా! చెప్పగలరా: మాధవుడు
ఐదు తేడాలు కనుక్కోండి: మురళి, నెమలీక, వెన్న, కుండ, కడియం

కలలుకంటూ కూర్చుంటే పని అణువంతైనా ముందుకు సాగదు, కష్టపడితేనే పూర్తవుతుంది
- భగవద్గీత

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- flute = వేణువు
- నవనీతం = తాజావెన్న

నవ్వుల జల్లులు!

మొదటివ్యక్తి: నాలుగో నెంబరు ప్లాట్‌ఫారానికి ఎలా వెళ్లాలండీ?
రెండో వ్యక్తి: ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొనుక్కుని!
- **దండెం రాజయ్య,** డోర్నకల్

టీచర్: గోపీ అదేంటి? సగం పుస్తకం చింపేశావు?
గోపి: మీరే కదా టీచర్ పొదుపుగా ఉండాలన్నారు. అందుకే మరో సగం ఇంట్లో దాచా.
- **ఎం. లింగమూర్తి,** నల్లగొండ

చిలిపి ప్రశ్న

వేగంగా పరిగెత్తే నది?
- రెడ్డి రామలక్ష్మి, కాకినాడ

చెప్పగలరా?

మాటలో ఉన్నా కానీ ఆటలో లేను,
ధరంలో ఉన్నా కానీ వరంలో లేను,
ఆవులో ఉన్నా కానీ ఆకులో లేను,
పాడులో ఉన్నా కానీ పాములో లేను.
ఇంతకీ నేనెవరో చెప్పగలరా?

కిట్టయ్యవే అన్నీ!

ఇక్కడున్న సినిమా పేర్లు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి.

శ్రీకృష్ణ పాండవీయం, శ్రీకృష్ణ విజయం, శ్రీకృష్ణ సత్య, శ్రీకృష్ణమాయ, శ్రీకృష్ణతులాభారం, కృష్ణ లీలలు. ముకుంద, మురారి, గోపాల గోపాల, కన్నయ్యకిట్టయ్య, శ్రీకృష్ణార్జునయుద్ధము

గో	శ్రీ	కృ	ష్ణ	స	త్య	శ్రీ	ము
పా	కృ	ష్ణ	కు	క	ణి	రా	ద్ధ
ల	ష్ణ	లీ	య	న్న	రి	శ్రీ	యు
గో	తు	ల	మా	య్య	ము	కృ	న
పా	లా	లు	ష్ణ	కి	కుం	ష్ణ	ర్జు
ల	భా	రా	కృ	ట్ట	ద	వి	ష్ణా
రు	రం	ధ	శ్రీ	య్య	స	జ	కృ
శ్రీ	కృ	ష్ణ	పాం	డ	వీ	యం	శ్రీ

కృష్ణయ్య నామాలు

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

L	H	R	S	H	I	K	E	S	H	A
Y	M	A	F	X	Y	T	Q	Y	Q	P
Z	U	L	C	T	R	V	K	A	H	A
F	R	Z	L	Y	G	N	D	M	R	R
P	L	M	U	K	U	N	D	A	D	M
T	I	G	N	L	I	T	D	L	B	A
Z	D	G	F	V	M	O	A	V	L	D
X	H	L	O	C	M	R	Z	R	D	H
K	A	G	G	A	Y	K	R	L	G	A
L	R	Q	D	C	N	R	M	D	G	V
M	A	D	H	U	S	U	D	A	N	A

GOVINDA,
MUKUNDA,
HRSHIKESHA,
MADHAVA,
MURLIDHARA,
ACYUTA,
DAMODARA,
MADHUSUDAN

ఠాణా నుంచి నిందితుడి పరారీ...

వెంబడించి పట్టుకొన్న కోర్టు కానిస్టేబుల్

మల్యాల, న్యూస్‌టుడే: చోరీ కేసులో ఓ నిందితుడు ఆదివారం ఠాణా నుంచి పారిపోవడం కలకలం రేపింది. గొర్రెగుండంలో గొర్లను అపహరించుకొని వెళ్తున్న ఆరుగురు దొంగల్లో ఇద్దరిని గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారిలో రాజారం గ్రామానికి చెందిన వెంకటేశ్ ఆదివారం ఉదయం ఠాణా నుంచి పరారై సమీపంలోని పొలాల గుండా పరుగులు తీయడంతో వెంటనే తేరుకొన్న కోర్టు కానిస్టేబుల్ దాసరి ఎల్లయ్య నిందితుడి వెంట పడి పట్టుకొన్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లో పరుగెత్తడంతో కానిస్టేబుల్ రెండు కాళ్ల వేళ్లు తెగిపోయి తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. నిందితుడి అదుపులోకి తీసుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గతంలో కూడా నూకపల్లి అర్బన్ కాలనీలో ప్రేమజంటను బెదిరించి దోచుకొన్న రెండు సంఘటనల్లో వెంకటేశ్ ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు. ఠాణాకు వెళ్లే నిందితులను స్వేచ్ఛగా వదిలేయడం, వారితో కొందరు పోలీసులు చనువుగా ప్రవర్తించడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు అభిప్రాయపడ్తున్నారు.

నీటి పరీక్షల కేంద్రంపై ఫిర్యాదు

జగిత్యాల ధరూరుక్యాంపు,: జగిత్యాలలోని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం వాటర్‌టెస్టింగ్ ల్యాబ్ నిర్వహణపై సహచట్టం రక్షణ వేదిక అధ్యక్షుడు తిరునగరి శ్రీనివాస్ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన సీఎస్ నిబంధలను అనుగుణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని, చట్టపరంగా తదుపరి చర్యలను తీసుకోవాలని సూచిస్తూ రక్షిత మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్ ఇన్‌చీఫ్‌నకు ఈనెల 5న ఆదేశాలు జారీచేశారు. జిల్లాకేంద్రంలోని వాటర్‌టెస్టింగ్ ల్యాబ్ నిర్వహణపై సహచట్టం ద్వారా అసమగ్ర సమాచారాన్ని వెల్లడించటం, జిల్లా కలెక్టర్‌కు సైతం అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొంటూ శ్రీనివాస్ అన్ని పత్రాలతోసహా సీఎస్‌కు జులై 21న ఫిర్యాదు చేయడంతో సీఎస్ స్పందించారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ద్వారకలోని శ్రీకృష్ణ ఆలయ విశేషాలు, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రత్యేక ప్రవచనం 'శ్రీకృష్ణ శరణంమమ', 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: స్పెషల్ శుభమస్తు: అనుకున్నపనులు జయప్రదం కావాలంటే శ్రీకృష్ణుడిని ఎలా పూజించాలి...? బ్రహ్మశ్రీ చాగంటి విశేష ప్రవచనం? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడుతూ పాడుతూ... (శ్రీకాంత్, గాయత్రి).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'గసగసాలరైస్', మీచేతివంట 'మూంగ్‌దాల్ కోఫ్తాకర్రీ', 'కొబ్బరి పెసరపొంగలి', జస్ట్ ఎమినిట్ 'పల్లీపోహ' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: హీరోయిన్ రకుల్‌ప్రీత్‌సింగ్‌తో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకెల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ.9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్–అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: ముద్దమందారం (ప్రదీప్, పూర్ణిమ), 10-00: మార్నింగ్ షో: గోవుల గోపన్న (ఏఎన్నార్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: శ్రీవారికి ప్రేమలేఖ (నరేశ్, పూర్ణిమ), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: అనుబంధం (ఏఎన్నార్, సుజాత), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: శ్రీకృష్ణావతారం (ఎన్టీఆర్), 10-00: సెకండ్‌షో: అమాయకుడు కాదు అసాధ్యుడు (కృష్ణ).

ఈటీవీ అభిరుచి

కృష్ణాష్టమి స్పెషల్

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోవా ఉండల పాయసం & చుక్కకూర పెరుగు వడలు, ఉ.6.30: టేస్ట్ ఆఫ్ ఇండియా - తిల్ గుల్ వాడి & మటర్ కారాంజీ, ఉ.7.00: వావ్ ఏమి రుచి – టమోట సాస్ & ఇటాలియన్ పాస్తా, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – అంజీర్ కొబ్బరి బర్ఫీ & పప్పు చెక్కలు, ఉ.9.30: మమ్మీస్ కిచెన్ – రాగి లడ్డులు, ఉ.9.45: ప్రముఖ గేయ రచయిత రఘు కుంచె తో "చటపట్" – జామకాయ పచ్చడి, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – బ్రౌన్ రైస్ కిరాన్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – రాగి కుడుములు, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - వెన్న ఉండలు & శ్రీ ఖండ్, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - అంజీర్ ఆల్మండ్ కి కట్లీ, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – అటుకుల ప్రసాదం విత్ జబర్దస్త్ ఆర్టిస్ట్ నిహాంత్, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ధనియ బర్ఫీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - అరికెల పాయసం, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – చికెన్ పెప్పర్ స్కివర్స్ & ఫ్లావర్డ్ యోగర్ట్ అసోర్టెడ్ వెజిటబుల్స్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఓట్స్ పాయసం, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – ట్రెస్ లిచి, మ.2.15, రా.10.30: చెఫ్స్ స్పెషల్ – మెంతి పులిహోర, మ.2.30: చోటా షెఫ్ – స్వీట్ పోహా, మ.3.15: ఈవారం – మిక్స్ రవ్వ కిచిడి, సా.5.15: స్నాక్స్ – చిట్టి ఆవడలు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 o, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 o, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ కృష్ణాలయం, ఉడిపి, కర్ణాటక, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 o, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 o, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 o, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ కృష్ణాలయం, ఉడిపి, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 o, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 14-08-2017

SVBC TTD — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం - నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 గోపాలుడే గోవిందుడు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 శ్రీమహాలక్ష్మి వైశిష్ట్యం - మైలవరపు శ్రీనివాసరావు, 05-00 లైవ్ ఎస్.డి.సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 శ్రీకృష్ణ ఆలయ వైభవం, 09-30 శ్రీ కృష్ణతత్వం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీకృష్ణ జయంతి - వద్దిపర్తి.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీశివసహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీవైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 భజరే నందబాలం, 08-30 హరే రామ.. హరే కృష్ణ, 09-00 శ్రీకృష్ణతత్వం, 09-30 ద్వారక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Zee తెలుగు — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: తడాఖా, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: బాబు బంగారం.

maa — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: చూడాలని ఉంది, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: మేజర్ చంద్రకాంత్, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: శౌర్యం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: పటాస్.

HBO SIMPLY THE BEST. — **ఉదయం:** 06-00 ఎనీగివెన్ సన్‌డే, 08-22 ఎంపైర్ ఆఫ్ ది సన్, 11-04 10000 బీసీ, 12-59 విస్కీ ట్యాంగో ఫాక్స్‌ట్రాట్, **మధ్యాహ్నం:** 12-14 గెట్ స్మార్ట్, 02-47 కుంగ్ ఫూ పాండా, **సాయంత్రం:** 04-21 13 అవర్స్, **రాత్రి:** 09-00 మిషన్ ఇంపాజిబుల్ రోగ్ నేషన్, 11-22 షావొలిన్ సాకర్.


పత్తిని ప్రస్తుతం ఆశిస్తున్న తెగుళ్లు - నివారణ చర్యలు

ప్రస్తుతం పత్తిని ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జే. హేమంత్ కుమార్, డాక్టర్ ఎన్.కిశోర్‌కుమార్ తెలిపారు.

వేరుకుళ్లు తెగులు: భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు, వర్షం బాగా పడి ముంపునకు గురైనప్పుడు ఈ తెగులు వ్యాప్తి చెంది, లేతాకులు పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. ఈ తెగులు పంట అన్ని దశల్లో ఆశిస్తుంది. అర్ధంతరంగా మొక్క పూర్తిగా ఎండిపోవటం దీని లక్షణం. ఒక్క రోజులోనే మొక్క ఎండిపోతుంది. తెగులు తీవ్రమైనప్పుడు వ్యాధి సోకిన మొక్కలు పొలంలో గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు, ముందు జాగ్రత్త చర్యగా.. వేసవి కాలంలో పొలాన్ని లోతుగా దున్నాలి. పొలంలో సేంద్రియ పదార్థాన్ని, పశువుల ఎరువును ఎక్కువగా వాడాలి. సిఫారసు మేరకు పొటాష్ ఎరువులను తప్పక వాడాలి. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదళ్ల చుట్టూ నేలపై పోయాలి. అంతర పంటల సాగుతో కూడా తెగులు తీవ్రతను తగ్గించవచ్చు. పత్తి విత్తే సమయాన్ని మార్చి కూడా తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

ఎండు తెగులు: పత్తిని ఆశించే ఎండు తెగులుకు ఫ్యుజేరియం, వర్టిసీలియం వంటి శిలీంద్రాలు ప్రధాన కారణం. పంటను ఫ్యుజేరియం వడలు తెగులు ఆశించినప్పుడు తెగులు సోకిన మొక్కల ఆకులు వాడిపోయి మొదట ఈనెల మధ్య పసుపు రంగుకు తర్వాత ఎర్రగా మారి ఆకుల కింది నుంచి పైకి ఎండుకుంటూ రాలిపోతాయి. ఈ తెగులు పుష్పించే దశలో ఎక్కువగా కన్పిస్తుంది. కాండాన్ని చీల్చి చూస్తే లోపల నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి.

ఆకుమచ్చ తెగులు: పత్తి పంటను ఆశించే తెగుళ్లలో ఆకుమచ్చ తెగులు ప్రధానమైనది.



పత్తి ఆకుపై బ్యాక్టీరియా తెగులు మచ్చలు

ఆల్టర్‌నేరియా, సెర్కోస్పోరా, హెల్మింథోస్పోరియం, శిలీంధ్రజాతులు, జాంతోమోనాస్ ఆకుముడత బ్యాక్టీరియా నల్లమచ్చ తెగులు, బ్యాక్టీరియా ఆకుమాడు తెగులు ప్రధానమైనవి.

ఆల్టర్‌నేరియా ఆకుమచ్చ తెగులు: ఆశించిన మొక్కల ఆకుల మీద గోధుమరంగు మచ్చలు వలయాకారపు సుడులుగా ఏర్పడతాయి. తెగులు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు తర్వాత దశలో కాయల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి.

సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు: ఆకుల మీద ముదురు గోధుమ రంగులో గుండ్రని మచ్చలు ఏర్పడి చుట్టూ ఎరుపు రంగు కలిగి మధ్యభాగం తెల్లగా ఉంటుంది. ఈ తెగులు ఎక్కువగా ముదురు ఆకుల మీద పంట చివరి దశలో కన్పిస్తుంది.

హెల్మింథో స్పోరియం ఆకుమచ్చ తెగులు: ఈ తెగులు సోకిన ఆకుల మీద తేలికపాటి గోధుమరంగు గుండ్రని మచ్చలు ఏర్పడి, మధ్య భాగం బూడిద రంగుతో, చుట్టూ ఎర్రటి అంచులు ఏర్పడతాయి. తెగులు తీవ్రమైనప్పుడు వ్యాధి సోకిన ఆకుల మధ్యలో ఆకారం లేనటువంటి తూటాల వంటి రంధ్రాలతో రాలిపోతాయి.

ఆకుమచ్చ తెగుళ్ల అదుపు: తెగులు ఆశించిన భాగాలను పీకి నాశనం చేయాలి. లీటరు నీటికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కాప్టాన్ + హెక్సాకొనజోల్ 1 గ్రా. 2-3 సార్లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. పొలాన్ని ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలి. తప్పనిసరిగా నత్రజని పొటాష్ ఎరువులను సిఫారసు మేరకు అందించాలి.

బ్యాక్టీరియా నల్లమచ్చ తెగులు: మొక్క వివిధ దశల్లో వివిధ రూపాల్లో కన్పిస్తుంది. ఆకులపై కోణీయాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తర్వాత నల్లగా మారి మూడో దశలో ఆకుల ఆనెల ద్వారా తెగులు వ్యాపించి నల్లగా మారుతుంది. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు కొమ్మలకు కూడా వ్యాపించి కొమ్మలు నల్లగా మారతాయి. దీనినే బ్లాక్ ఆర్మ్ అని పిలుస్తారు. తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకు పండి రాలిపోతుంది. తెగులు పువ్వులకు, కాయలకు సోకినప్పుడు పరిపక్వత చెందకుండానే రాలిపోతాయి.

ఈ తెగులు నివారణకు.. తెగులు సోకిన మొక్కలను, పీకి నాశనం చేయాలి. పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి. కిలో విత్తనానికి 10 గ్రా. సుడోమోనాస్ ఫ్లోరెసెన్స్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఉధృతిని బట్టి 3-4 సార్లు 15 రోజుల వ్యవధిలో 10 లీ. నీటికి స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషామైసిన్ 1 గ్రా., + కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. కలిపి పిచికారీ చేయాలి.

–న్యూస్‌టుడే, ఖమ్మం (వ్యవసాయం)



జగిత్యాల బల్దియా

చిత్తశుద్ధి.. హరిత కీర్తి



జగిత్యాల రహదారిపై మొక్కలు

- పర్యావరణ పరిరక్షణకు కృషి
- ఉత్తమ సేవలతో వరించిన హరితమిత్ర పురస్కారం

జగిత్యాల, న్యూస్‌టుడే:

మొక్కలు నాటిన తరువాత తమ బాధ్యత తీరిపోయిందనుకోలేదు.. వాటిని కంటికి రెప్పలా కాపాడారు.. పచ్చదనం పెంచితే సమాజానికి ఎంత మేలు చేస్తుందో గుర్తించారు. సేవలను విస్తరిస్తూ మొక్కల పెంపకానికి కృషి చేశారు. అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో పూర్తి చేసి జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటారు. ఒక రాష్ట్రస్థాయి పురస్కారంతో పాటు ఏడు జిల్లా స్థాయి పురస్కారాలు పొంది శెభాష్ అనిపించుకున్నారు. జిల్లా పాలనాధికారి డాక్టర్ శరత్ అన్ని శాఖలను సమన్వయం చేసి అందరినీ భాగస్వామ్యం చేసి హరిత లక్ష్యం నిర్ణయించారు. మొక్కలకు జియోట్యాగింగ్ చేసి ప్రతి మంగళవారం గ్రీన్‌డే పాటించి మొక్కలకు నీరందించటం ప్రతి రెండు, మూడు రోజులకోసారి సమీక్షించడం, క్షేత్రస్థాయి సందర్శనలతో జిల్లాలో హరితహారం ముందంజలో ఉంది. దీనికి తోడు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మిగతా జిల్లాల కంటే జగిత్యాలకు హరితమిత్ర పురస్కారాల ఎక్కువగా వచ్చాయి.



మల్లన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల

చిత్తశుద్ధితో కృషి

జిల్లా హరితహారం సమన్వయకర్త, కోరుట్ల ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ కార్యక్రమ విజయవంతానికి గతేడాదిగా కృషి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశాలకు అనుగుణంగా హరితహారం లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తుండటంతో అవార్డు లభించింది. మేడిపల్లి మండలం గోవిందారం అటవీ సెక్షన్ అధికారి వి.రవికుమార్ అడవుల పరిరక్షణకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గతంలో రాయికల్ మండలంలో పనిచేస్తున్నప్పుడు రెండుసార్లు ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం లభించగా ప్రస్తుతం హరితమిత్ర అవార్డు లభించింది.

స్థానిక సంస్థల్లో..

జిల్లాలోని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలన్నింటిలో హరితహారం జోరుగా సాగుతున్నప్పటికి జగిత్యాల పురపాలక సంఘానికి, రాంసాగర్ గ్రామపంచాయతీకి అవార్డులు లభించాయి. జగిత్యాల బల్దియాలో 2016లో 30860 మొక్కలు నాటగా గతేడాది 1.55 లక్షలు మొక్కలు నాటారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 95 వేల మొక్కలు నాటారు. మొక్కలు నాటి సంరక్షించడంలో పురపాలక ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆమె ప్రాతినిధ్యం వహించే 4వ వార్డు తోపాటు పలు వార్డుల్లో ఆయా వార్డుల కౌన్సిలర్ల సహకారంతో సిమెంట్ రహదారుల్లోను గుంతలు తవ్వి మొక్కలు నాటి పరిరక్షించారు. బైపాస్ రహదారి, హౌజింగ్ బోర్డులో మొక్కలు ఎక్కువ సంఖ్యలో పెరిగాయి. కొడిమ్యాల మండలం రాంసాగర్ గ్రామపంచాయతీలో 2010 నుంచి మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపుతున్నారు. ఆ సంవత్సరం ఇంటింటికి దీపం కనెక్షన్ ఇచ్చి వంట చెరుకు కోసం అడవులు నరకవద్దని నిర్ణయించుకుని అమలు చేస్తున్నారు. గ్రామపంచాయతీలో ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది.



రాంసాగర్ గ్రామపంచాయతీ

ప్రజాప్రతినిధుల్లో... కృష్ణారావు

ప్రజాప్రతినిధులకు ఇచ్చే హరితమిత్ర పురస్కారం కొడిమ్యాల మండలం హిమ్మత్‌రావుపేటకు చెందిన తిర్మలాపూర్ సింగిల్‌విండో అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావుకు లభించింది. గత 23 ఏళ్లుగా గ్రామాల అభివృద్ధికి నిస్వార్థంగా కృషి చేస్తున్న కృష్ణారావుకు 2003లో జలమిత్ర అవార్డు కింద ప్రభుత్వం రూ.లక్ష నగదు పురస్కారం ఇవ్వగా ఆ సొమ్ముతో బోరు బావి వేయించి మూడు గ్రామాలకు తాగు నీరందించే ఏర్పాటు చేశారు. 2011 నుంచి మొక్కలు నాటడం ప్రారంభించిన ఆయన ఇప్పటికి 10 వేల మొక్కలు నాటారు. సొంత ఖర్చుతో నీడనిచ్చే మొక్కలతోపాటు, పూల మొక్కలు నాటి రక్షణ చర్యలు తీసుకోవడంలో గ్రామంలోని రహదారులు చూపరులను ఆకర్షిస్తాయి. కృష్ణారావు చేస్తున్న కృషికి రాంసాగర్ గ్రామపంచాయతీ ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవార్డులు ఇచ్చాయి. ఆదర్శ గ్రామమైన రాంసాగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. కృష్ణారావును ఉమ్మడి జిల్లా వన్యప్రాణి సంరక్షకునిగా ప్రభుత్వం గతేడాది నియమించగా ఈ సంవత్సరం జగిత్యాల జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు.



హిమ్మత్‌రావుపేటలో పెరిగిన చెట్లు

పాఠశాలల్లో పచ్చదనం

జగిత్యాల మండలం మోరపల్లి ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయి హరితమిత్ర అవార్డు లభించగా ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడు సుదర్శన్ మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గతేడాది రూ. 70 వేల సొంత ఖర్చులతో మొక్కలు కొనుగోలు చేసి నాటడమే కాకుండా, ట్రీగార్డులు ఏర్పాటు చేయించారు. గతంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన సుదర్శన్ హరితహారం కోసం తపిస్తారు. గొల్లపల్లి మండలం మల్లన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు అవార్డు లభించగా ఆ పాఠశాలలో మండల విద్యాధికారి జమునారాణి, ఉపాధ్యాయుడు రమణారావు మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గతేడాది 500 మొక్కలు నాటి 460 రక్షించారు. ఈసారి 1600 మొక్కలు నాటి జియోట్యాగింగ్ చేశారు. ఒక్కో ఉపాధ్యాయుడు వంద, ఒక్క విద్యార్థి పది మొక్కలు నాటి నీరు పోసేందుకు ముగ్గురు వ్యక్తులును ఏర్పాటు చేశారు. జగిత్యాల రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిరిసిల్ల శ్రీనివాస్, రోటేరియన్లు మంచాల క్రిష్ణ, టీవీ సూర్యం తదితరులు మొక్కలు నాటడంలో చేసిన కృషికి ఎన్జీవోలకిచ్చే అవార్డుల్లో ఆ సంస్థకు దక్కింది.



మోరపల్లి ప్రాథమిక పాఠశాల

జగిత్యాలలో సర్వమత శాంతి ర్యాలీ



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలో జమాదే ఉల్‌మా హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత శాంతి ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో మైనార్టీ వర్గాలు హాజరు కాగా సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి, తెరాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.సంజయ్ కుమార్ తదితరులు హాజరై ర్యాలీకి సంఘీభావం వ్యక్తం చేశారు. మతం ఏదైనా సోదరభావం, మానవత్వంతో జీవించడమే ప్రధానమన్నారు. అన్ని మతాల పవిత్ర గ్రంథాలు భగవద్గీత, ఖురాన్, బైబిల్ తదితరాలు ఇవే సూచిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బల్దియా మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రియాఖత్ అలీమొహిసిన్, మహ్మద్ అబ్దుల్ ఖదార్, ముజాహిద్, ఖజిమ్ అలీ, జమాతె ఇస్తామీ హింద్ అధ్యక్షుడు షోయాబ్‌ఉల్‌హక్, ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు రియాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ కరుణాకర్, సీఐ ప్రకాశ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండగట్టులో రద్దీ

వర్షంలో తలదాచుకోవడానికి భక్తుల అవస్థలు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వరుస సెలవులు రావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో కల్సి స్వామివారిని దర్శించుకొని వెళ్లారు. సాయంత్రం కురిసిన వర్షానికి భక్తులు తలదాచుకోవడానికి నానా తంటాలు పడ్డారు. వర్షంలో కూడా భక్తులు తరలివచ్చి అంజన్నను దర్శించుకొని తిరిగి వెళ్లే సమయంలో ప్రసాదం కౌంటరు మూసివుండటంతో స్వామివారి ప్రసాదం కొనుగోలు చేసే వీలులేక నిరాశ చెందారు. సాయంత్రం కురిసిన వర్షానికి ఆలయం ముందు భారీగా నీళ్లు నిలిచాయి. ఆలయం మూసివేయకముందే ప్రసాదం కౌంటర్లు మూసివేయడంతో స్వామి ప్రసాదం కొనుగోలు చేసే అవకాశం లేక భక్తులు నిరాశ చెందారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయపన్నుశాఖ కమిషనరు ఆదివారం రవీంద్రసాయి కొండగట్టు అంజన్నను దర్శించుకొన్నారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్ ఆయనను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదం అందజేశారు.



అంజన్న ఆలయం ముందు నిలిచిన వర్షపు నీరు